PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 125 | విజయవాడ, ఆదివారం 7 డిసెంబర్ 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 7 December 2025 | Rs

వన్డే సిరీస్ విజేత భారత్

- జైస్వాల్ సెంచరీ
- రోహిత్, కోహ్లి అర్ధసెంచరీలు
- చివరి వన్డేలో దక్షిణాఫ్రికాపై 9వికెట్ల తేడాతో గెలుపు

6

అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ

అంబేద్కర్ చిరస్మరణీయ మార్గదర్శి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యాంగ రూపశిల్పి, కుల వివక్షపై అవిశ్రాంత పోరు సల్పిన యోధుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తరతరాలకు చిరస్మరణీయ మార్గదర్శి అని పలువురు ప్రముఖులు కొనియాడారు. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా శనివారం దేశవ్యాప్తంగా ప్రజానీకం ఆయనకు ఘన నివాళు లర్పించింది. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ప్రభృతులు అంబేద్కర్‌కు నివాళులర్పించారు. 'ప్రేరణ స్థల్'లో అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సమసమాజ నిర్మాణం కోసం అంబేద్కర్ ఎంతో తపించారని, ఆయన బోధనలు, పోరాటం నేటికీ సమాజానికి మార్గనిర్దేశం చేస్తూనే ఉన్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొనియాడారు. అంబేద్కర్ దార్శనిక నాయకత్వం, న్యాయం, సమానత్వం, రాజ్యాంగవాదం పట్ల అచంచలమైన నిబద్ధత జాతీయ ప్రయాణానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడానికి అంబేద్కర్ తరతరాలుగా ప్రేరణనిచ్చారని ఆయన అన్నారు.

పెంచలయ్య హత్యను
పసిగట్టలేకపోయాం

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- కుటుంబాన్ని ఆదుకోవడంపై మౌనం
- నెల్లూరులో నేరస్తులు ఎక్కువయ్యారని వ్యాఖ్య
- రౌడీలను అణచివేస్తామని హెచ్చరిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నెల్లూరులో ప్రజలను చైతన్య పరుస్తున్న కళాకారుడు పెంచలయ్యను గంజాయి గుండాలు హత్య చేస్తారన్న విషయాన్ని ముందుగానే పసిగట్టలేకపోయినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. . టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో చంద్రబాబు కొంతసేపు ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా విలేకరులు పెంచలయ్య హత్య గురించి ప్రస్తావించడంతో స్పందించిన ఆయన 'ఆ హత్యను ప్రభుత్వం ముందుగానే పసికట్టలేకపోయింది' అని అన్నారు. నెల్లూరు జిల్లాలో నేరస్తులు ఎక్కువవుతున్నారని ఈ సందర్భంగా ఆయన అన్నారు. విజయనగరం, నెల్లూరు వంటి జిల్లాలకు ప్రశాంతతకు మారుపేరుగా ఉండేవని చెప్పారు.గత పాలకుల వల్ల ఈ జిల్లాల్లో కూడా నేరస్తులు తయారయ్యారని పేర్కొన్నారు. నెల్లూరు లాంటి జిల్లాలో లేడీడాన్లు తయారు చేశారంటే గత ఐదేళ్ల ఎలాంటి పాలన సాగిందో అర్థం చేసుకోవాలని అన్నారు. వీటిని ప్రక్షాళన చేస్తున్నామని చెప్పారు.నేరస్తులను ఏరివేస్తున్నామని, రౌడీలను అణిచివేస్తామని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో మొహమాటాలు లేవన్నారు. అదే సమయంలో పెంచలయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఎలా

టిడిపి కార్యాలయంలో ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

అండగా నిలుస్తుంది, ఎలా ఆదుకుంటుందన్న విషయాలను సిఎం మాట్లాడలేదు. గంజాయి గుండాలు పెంచలయ్యను ఆయన పిల్లల ముందే అమానుష హత్య చేసి రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు హోంశాఖ మంత్రిగాని, ముఖ్యమంత్రి గానీ, ఆ విషయంపై పెదవివిప్పకపోవడం రాష్ట్ర వ్యాప్తంగా విమర్శలకు దారి తీసిన విషయం తెలిసిందే.

మనోభావాలు దెబ్బతీసేలా జగన్ వ్యాఖ్యలు

తిరుమల తిరుపతి దేవస్థానం(టిటిడి) పరకామణి దొంగతనం చిన్న అంశమని మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయని విమర్శించారు. బాబాయి హత్యనే సెటిల్ చేసుకుందామని చూశారని, అలానే పరకామణి కూడా సెటిల్ చేయాలని చూశారని అన్నారు. దొంగతనాన్ని కూడా తప్పు మిగతా 7లో

పొమ్మనకుండా పొగ...!

'ఉపాధి'కి దూరమవుతున్న దళితులు, గిరిజనులు

- భారీగా తగ్గుతున్న పనిదినాలు
- కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశ వ్యాప్తంగా దళితులు, గిరిజనులతో పాటు గ్రామీణ పేదలకు అండగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రం ఉద్దేశ్యపూర్వకంగానే నీరుగారుస్తోందా? ఇప్పటికే ఆ చట్టంకింద పనులు చేపట్టడానికి కేటాయించే నిధులను ప్రతిసంవత్సరం తగ్గిస్తున్న మోడీ సర్కారు, పొమ్మనకుండా పొగ పెట్టే విధానాలను అవలంభిస్తూ లబ్ధిదారుల సంఖ్యను సైతం భారీగా తగ్గిస్తోందా? క్షేత్రస్థాయి పరిస్థితుల్లో ఏమాత్రం మార్పు లేని, పేదల కష్టాలు కొంచెం కూడా తీరని ప్రస్తుత పరిస్థితుల్లోనూ

ఉపాధి పనుల్లో దళితులు, గిరిజనులు, ఇతర పేదల భాగస్వామ్యం తగ్గతుండటం ఇవే అనుమానాలను కలిగిస్తోంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాబ్ కార్డులు తొలగిస్తుండటం, ఆధార్ అనుసంధానం, ఆధార్ ఆధారిత ఇకేవైసి వంటి చర్యలు లబ్ధిదారులను ఈ పథకంలో నమోదుకావడమే కష్టంగా మారుస్తున్నాయి. చేసిన పనికి సకాలంలో చెల్లింపులు చేయకపోవడం కూడా ఈ పథకం పట్ల ఆసక్తి తగ్గడానికి కారణమవుతోంది. దీంతో ఈ పథకం కింద ఉపాధి పొందే వారి సంఖ్యతో పాటు, వారికి కల్పిస్తున్న పనిదినాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గుతోందని ఈ పథకంపై అధ్యయనం చేస్తున్న లిబ్‌టెక్ సంస్థ వెల్లడించింది.

తగ్గుదల ఇలా...

రాష్ట్ర వ్యాప్తంగా గత ఆర్థిక సంవత్సరంలో దళితులు 5.23 కోట్ల పని దినాలు పూర్తి చేసే, ఈ ఏడాది ఇప్పటి వరకూ నాటికి మిగతా 7లో





రెండోదశ పూలింగ్ అంటే
రైతులను మోసం చేయడమే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రాజధానిలో రెండోదశ పూలింగు చేయడమంటే మొదటిదశలో రైతులతోపాటు కొత్తగా భూములు ఇచ్చే రైతులనూ మోసం చేయడమేనని విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న పలువురు వక్తలు అన్నారు. రైతు గద్దే తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడిన పలువురు గతంలో భూములిచ్చిన రైతులతో 9.14 అగ్రిమెంటు చేసుకున్నారని, ఆ సమయంలో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని కోరారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ తొలిదశలో భూములిచ్చిన రైతులకు న్యాయం చేయకుండా వారితో చేసుకున్న అగ్రిమెంటు 9.14లో ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోకుండా రెండోదశ పూలింగు చేయడం రైతులను మోసం చేయడమే అన్నారు. గతంలో నవనగరాల పేరుతో భూములు కేటాయించామని చెప్పి ఇప్పుడు అదిచాలదని అంటున్నారని చెప్పారు. దీనివల్ల రైతులకు నష్టం తప్ప లాభం లేదని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ రాజధాని నిర్వీర్యం అవడంలో చంద్రబాబు, జగన్, మోడీ ముగ్గురి ప్రమేయం

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు. వేదికపై బాబూరావు, తులసిరెడ్డి తదితరులు

ఉందన్నారు. దీనిలో కేంద్రానిదే ఎక్కువ పాత్రని తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీలు ఇప్పటి వరకూ నెరవేర్చలేదని దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ప్లాట్లు ఎక్కడున్నాయో కూడా ఇప్పటికీ రైతులకు తెలియదని అన్నారు. అమరావతి అభివృద్ధిపై ఇతర ప్రాంతాల్లో వ్యతిరేకత వస్తే దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని చెప్పారు. మొదటిదశలో భూములిచ్చిన రైతులకు ఇప్పటికీ న్యాయం చేయలేని పాలకులు రెండోదశలో రైతులకు ఏమి చేస్తారని ప్రశ్నించారు. అలాగే ఎయిర్‌పోర్టు అంశంలో అజ్జంపూడి రైతులూ బాధపడుతున్నారని, వారికీ న్యాయం చేయలేదని అన్నారు. ఇటీవల కేంద్ర ఆర్థికశాఖ మంత్రి రాజధానికి వచ్చినా కనీసం హామీ ఇవ్వలేదని విమర్శించారు. ప్రధాని రెండుసార్లు శంకుస్థాపనలు చేశారని, ఒక్క రూపాయి కూడా ఇచ్చిందిలేదని అన్నారు. డబుల్ ఇంజన్ సర్కారు అని చెబుతున్నా ఎందుకు న్యాయం చేయలేదని ప్రశ్నించారు. ఇలాంటి సమయంలో రెండోదశ భూమి తీసుకోవడం దుస్సాహసమని అన్నారు. పైగా రెండోదశ భూములు ఇవ్వడానికి ముందుకు వచ్చారని, చెబుతున్నారని, వాస్తవంగా వ్యవసాయాన్ని దండగలా తయారు మిగతా7లో

హక్కుల సాధనకు పోరాటాలే మార్గం

- సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య

గిరిజనోత్పత్తులకు మార్కెటింగ్ ఎంతో కీలకం

- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఎయు మాజీ విసికి జైలుశిక్ష

- అప్పీల్‌కు వీలుగా తీర్పు అమలు నిలిపివేత

3

తమిళనాడులో
ఘోర రోడ్డు ప్రమాదం

- విజయనగరం జిల్లాకు చెందిన నలుగురు సహా ఐదుగురు దుర్మరణం
- ఏడుగురికి గాయాలు

ప్రజాశక్తి- దత్తిరాజేరు (విజయనగరం జిల్లా)

తమిళనాడు రాష్ట్రం రామేశ్వరం సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి సుమారు మూడు గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. వీరిలో విజయనగరం జిల్లాకు చెందిన నలుగురు అయ్యప్ప భక్తులు, తమిళనాడుకు చెందిన డిఎంకె కార్యకర్త ఒకరు ఉన్నారు. ఏడుగురు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం... అప్పయ్యస్వామి మాలవేసిన విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం కోరపు కొత్తవలసకు చెందిన వంగర రామకృష్ణ (51), మార్పిన అప్పలనాయుడు (33), మరడ రాము (50), మరుపల్లికి చెందిన బండారు చంద్రరావు (35) కలసి ఈ నెల ఒకటిన శబరిమలై వెళ్లారు. అయ్యప్పస్వామి దర్శనం అనంతరం వీరంతా కారులో తిరుగు ప్రయాణమయ్యారు. తమిళనాడులోని రామేశ్వరానికి 40 కిలోమీటర్ల దూరంలో రామనారాయణపురం దగ్గరకు వచ్చేసరికి నిద్ర వస్తుందని కారును రోడ్డు పక్కకు ఆపి ఆ వాహనంలోనే నిద్రించారు. అందరూ గాఢనిద్రలో ఉండగా వేగంగా వచ్చిన మరో కారు వీరి కారును వెనుకవైపు బలంగా ఢీకొంది. ఈ ఘటనలో రామకృష్ణ, అప్పలనాయుడు, రాము, చంద్రరావు దుర్మరణం పాలయ్యారు. ఆ కారులోని విజయనగరం జిల్లా కొండకెంగువకు చెందిన బెవర శ్రీరామ్ తీవ్రంగా గాయపడ్డారు. ఢీకొట్టిన కారు డ్రైవర్, తమిళనాడుకు చెందిన డిఎంకె కార్యకర్త ముష్తాక్ అహ్మద్ (3) మృతి చెందారు. ఆ కారులోని తమిళనాడుకు చెందిన ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన నేపథ్యంలో కోరపు కొత్తవలస, మరుపల్లిలో తీవ్ర విషాదం అలముకుంది. జిల్లాకు చెందిన రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పందించి తమిళనాడు పోలీసు అధికారులతో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. అయ్యప్ప దర్శనానికి వెళ్లి వస్తూ ప్రమాదానికి గురై మృతి చెందడం బాధాకరమన్నారు. గాయపడినవారికి మెరుగైన చికిత్స అందించాలని తమిళనాడు అధికారులను కోరారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను స్వగ్రామం రప్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు మంత్రి తెలిపారు.

ఐదోరోజూ
గందరగోళమే

- 800కి పైగా ఇండిగో విమానాల రద్దు
- సిఇఓ క్షమాపణలు

న్యూఢిల్లీ : వరుసగా ఐదో రోజూ దేశీయ విమాన సేవల్లో సంక్షోభం కొనసాగింది. శనివారం కూడా వందలాది ఇండిగో విమానాలు రద్దు కావడంతోపాటు ఇతర విమానాలు తీవ్ర ఆలస్యంగా నడిచాయి. దీంతో వేలాదిమంది ప్రయాణికులు విమానాశ్రయాల్లో పడిగాపులు పడడంతోపాటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో పలు విమానాశ్రయాల్లో ప్రయాణికులు తీవ్ర ఆగ్రహావేశాలు, ఆందోళనలు వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా వెయ్యికి పైగా విమానాలు రద్దయినట్లు సంబంధిత వర్గాలు చెబుతుండగా, 850 పైగా విమానాలు నిలిచిపోయినట్లు ఇండిగో అధికారికంగా ప్రకటించింది. వచ్చే కొద్ది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఇండిగో ఒక ప్రకటన విడుదల చేసింది. కలిగిన అసౌకర్యానికి చింతిస్తూ ఆ సంస్థ సిఇఓ ప్రయాణికులకు క్షమాపణలు చెప్పారు. మరోవైపు ఇండిగో సంక్షోభంపై సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. విమానాలు నడవక ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో వుంచుకుని ఈస్ట్ కోస్ట్ రైల్వే, వెస్ట్రన్ రైల్వేలు ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించాయి. కొన్ని ప్రధానమైన రైళ్లకు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నాయి. ఈ మేరకు రైల్వే ఒక ప్రకటన చేసింది. శనివారం హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో 69, బెంగళూరులో 124, ఢిల్లీలో 106, ముంబయిలో 117, కోల్‌కతాలో 41, అహ్మదాబాద్‌లో 35 విమాన సర్వీసులకు అంతరాయం కలిగిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. వేలాదిమంది ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయి తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. విమానాల ఆలస్యం, రద్దుకు సంబంధించి ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహంతో డిజిసిఎకు ఫిర్యాదులు చేస్తున్నారని తెలుస్తోంది.

ఉల్లికి పరిహార(స)ం..!

- మాటల్లోనే సిఎం హామీ
- సాయం కోసం రైతుల ఎదురుచూపు

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

ఉల్లికి పరిహారం విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ మాటలకే పరిమితమైంది. దీంతో, డబ్బుల కోసం రైతులు ఎదురు చూడాల్సి వస్తోంది. ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో ఉల్లి సాధారణ సాగు 43,817 ఎకరాలు. ఈ ఏడాది 26,696 ఎకరాల్లో సాగైంది. ఎకరం విస్తీర్ణంలో ఉల్లి సాగుకు రూ.1.50 లక్షల వరకూ ఖర్చవుతోంది. ఈ ఏడాది ఆగస్టులో కురిసిన వర్షాలకు ఉల్లి దెబ్బతినడంతో మార్కెట్లో ధర దక్కలేదు. క్వింటాలు కనిష్ట ధర రూ.501కు పడిపోయింది. కర్నూలు మార్కెట్‌కు సరుకు తెచ్చినా ధర లేక బయట తక్కువ ధరకు అమ్ముకుని వెళ్లిపోతున్నారని పత్రికల్లో కథనాలు రావడంతో స్పందించిన ముఖ్యమంత్రి... మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాలు రూ.1200కు కొనుగోలు చేస్తామని ప్రకటించారు. ఆ ధరకు మూడు రోజులు మాత్రమే మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది. 1,226 టన్నుల మాత్రమే ఉల్లిని కొనుగోలు చేసి నిల్వ చేసుకోవడానికి

పత్తికొండలో ఉల్లి పంటను దున్నేస్తున్న రైతు పులికొండ (ఫైల్ ఫొటో)

వీలు లేదనే పేరుతో ఆ తర్వాత కొనుగోళ్లు ఆపేసింది. క్వింటాలు రూ.1200కు కొన్నా కూడా రైతుకు నష్టమే వచ్చింది. రైతుకు పెట్టుబడి కూడా దక్కలేదు. ఆ తర్వాత ట్రేడర్లు కొనుగోలు చేసిన ధర రూ.1200 కంటే తక్కువగా ఉంటే ఆ తేడా మొత్తాన్ని బోనస్‌గా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే, ఇందుకు పలు నిబంధనలు పెట్టడంతో రైతులకు ప్రభుత్వంపై నమ్మకం కలగలేదు. దీంతో, చాలామంది రైతులు ఉల్లిని అప్పట్లో పొలాల్లోనే వదిలేశారు. పత్తికొండ మండలం ఎం.అగ్రహారానికి చెందిన రైతు ప్రభాకర్ రెడ్డి రెండు ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. కోత కూడా కోశారు. ధర లేదని పొలం పక్కనే పారబోశారు. అదే మండలంలోని చిన్నహుల్తికి చెందిన రైతు చెన్నయ్య కూడా రెండు ఎకరాల్లో సాగు చేసిన ఉల్లి పంటను దున్నేశారు. దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామంలో రైతు రేమట వలి సాహెబ్ 4.50 ఎకరాల్లో సాగు చేసిన పంట చేతికి వచ్చిన సమయానికి ఉల్లికి గిట్టుబాటు ధర లేకపోవడంతో పొలంలోనే గొర్రెలకు వదిలేశారు. ఆ పరిస్థితుల నేపథ్యంలో ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50 వేలు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మిగతా 7లో

కృష్ణా జిల్లాలో
స్క్రబ్ టైఫస్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

స్క్రబ్ టైఫస్‌తో ఒకరు మరణించిన సంఘటన కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ముదునూరు గ్రామానికి చెందిన బుట్టి శివశంకరరాజు (42) జ్వరం, వాంతులు, విరోచనాలతో బాధపడుతూ మచిలీపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు.

పరిస్థితి మెరుగుపడకపోవడంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మరణించారు. స్క్రబ్ టైఫస్ వ్యాధితో శివశంకరరాజు మరణించినట్లు ఇంటిగ్రేడెట్ హెల్త్ ఇన్ఫర్మేషన్ పోర్టల్‌లో (ఐహెచ్ఐపి) శనివారం అధికారులు నమోదు చేశారు.

దీంతో మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రి వైద్యుల బృందం శనివారం ముదునూరు గ్రామంలో పర్యటించింది. శివశంకరరాజు కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకూ కృష్ణా జిల్లాలో 15 కేసులు, ఎన్‌టిఆర్ జిల్లాలో రెండు కేసులు నమోదయ్యాయి. వీటిలో ఎనిమిది మంది రికవరీ అయ్యారు.

గవర్నరుతో సిఎం భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గవర్నరు అబ్దుల్ నజీర్‌తో సిఎం చంద్రబాబు శనివారం రాత్రి లోక్‌భవన్ (రాజ్‌భవన్)లో భేటీ అయ్యారు. గంటకు పైగా మర్యాదపూర్వకంగా సాగిన భేటీ డిన్నర్‌మీట్‌గా మారింది. వీరిద్దరి మధ్య విశాఖలో ఇటీవల నిర్వహించిన సిఐఐ సదస్సు విజయవంతం కావడం, పెట్టుబడులు, ప్రోత్సాహకాలు, అమరావతిలో రెండో దశ భూ సమీకరణ, రాజధాని ప్రాంతంలో నూతనంగా లోక్‌భవన్ నిర్మాణాలకు ఇటీవల సిఆర్‌డిఎ టెండర్లు పిలిచేందుకు నిర్ణయించడం గురించి చర్చించినట్లు సమాచారం. అంతేకాకుండా రాజీనామా చేసిన ఎమ్మెల్సీల ఆమోదంలో నెలకొన్న ప్రతిష్టంభన, రాజ్యాంగబద్ధ నామినేటెడ్ పోస్టుల గురించి కూడా వీరి భేటీలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. వీటితోపాటు రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, శాంతిభద్రతలు, ఇటీవల జరిగిన మావోయిస్టుల ఎన్‌కౌంటర్ గురించి కూడా కొద్దిసేపు మాట్లాడుకున్నట్లు తెలిసింది. గవర్నరును కలిసేందుకు వచ్చిన ముఖ్యమంత్రిని ఎన్‌టిఆర్ కలెక్టరు లక్ష్మీశా, విజయవాడ సిపి రాజశేఖర్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఎస్‌ఎఫ్‌ఐ మహాసభను పురస్కరించుకుని పోటీలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

తిరుపతిలో ఈనెల 12 నుంచి నిర్వహించనున్న ఎస్‌ఎఫ్‌ఐ 25వ రాష్ట్ర మహాసభ సందర్భంగా శనివారం పోటీలు నిర్వహించారు. వేమన విజ్ఞాన కేంద్రంలో విద్యార్థులకు చెస్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. హెల్ప్ టు అదర్ ఆర్గనైజేషన్ ఫౌండర్ మణికంత ఈ కార్యక్రమానికి హాజరై విద్యార్థులను అభినందించారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పవిత్ర, జిల్లా నాయకులు శివతేజ పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సామాజిక చైతన్యం కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పవిత్ర తెలిపారు. ఇదే సందర్భంగా తిరుపతి బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో 'బాలల సైన్స్ ఫెస్టివల్' నిర్వహించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (తిరుపతి) డైరెక్టర్ డాక్టర్ కేఎన్. సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. విద్యార్థులు ప్రాథమిక విద్య నుంచే సజనాత్మకత, క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసాన్ని అలవర్చుకోవాలన్నారు. పరిశోధనా రంగంలో నూతన ఆవిష్కరణలకు ప్రథమ భాగం ఉందని, దేశం పురోగమనం వైపు వెళుతున్న సమయంలో నూతన ఆవిష్కరణలు చేసిన విద్యార్థులకు మంచి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుతూ నూతన అన్వేషణలు చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి బాలోత్సవం గౌరవ అధ్యక్షులుదామోదరం, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, రీజనల్ సైన్స్ సెంటర్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అటల్ సంకల్ప్.. యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశ మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి 100వ జయంతి సందర్భంగా శనివారం 'అటల్ సంకల్ప్-మోడీ సిద్ధి యాత్ర' పోస్టరును కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆవిష్కరించారు. ఈ మేరకు విజయవాడలోని ఒక ప్రయివేటు హోటల్‌లో జరిగిన కార్యాక్రమంలో ఆయన మాట్లాడుతూ వాజ్‌పేయి దేశం గర్వించ దగిన నేత అని కొనియాడారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ.. ఈ నెల 11 నుంచి 25 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అటల్ సంకల్ప్-మోడీ సిద్ధి యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి చిరునామాగా కడప ఉక్కు

- విశాఖ ఉక్కును మూతవేసి మిట్టల్‌కు రాయబారాలా?
- మోడీ చేతిలో కీలుబొమ్మ చంద్రబాబు
- లేబర్ కోడ్లపై అత్యుత్సాహం తగదు : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

కడప ఉక్కు పరిశ్రమ పనులు కన్నీటిసుడులను తెప్పిస్తున్నాయని, నలుగురు ముఖ్యమంత్రులు నాలుగు శంకుస్థాపనలు చేశారే తప్ప, ఒరిగిందేమీలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం సున్నపురాళ్లపల్లి, పెద్దదండ్లూరు గ్రామాల మధ్య జెఎస్‌డబ్ల్యు ఆధ్వర్యంలో వేసిన ఉక్కు పరిశ్రమ శిలాఫలకాన్ని సందర్శించారు. అనంతరం విలేకర్లతో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ 2014 రాష్ట్ర విభజన చట్టంలో కడప జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా ఉక్కు పరిశ్రమ నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఉక్కు పరిశ్రమ పనులు పది రోజుల్లో ప్రారంభమవుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరు నెలల క్రితం చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అయినా, నేటికీ పనులు ప్రారంభం కాలేదని తెలిపారు.

అమరావతిలో చెంబుడు నీళ్లు, గుప్పెడు మట్టికి పరిమితమైన తరహాలో కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం ఉందన్నారు. కడప ఉక్కు పరిశ్రమ కోసం 2019లో రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వం కడప జిల్లా కేంద్రంగా కేంద్రంలోని అప్పటి బిజెపి ప్రభుత్వంపై ధర్మపోరాట దీక్ష పేరుతో యుద్ధం చేసిందని గుర్తు చేశారు. ఆమరణ దీక్షకు కూర్చున్న సిఎం రమేష్ బిజెపిలో చేరిపోయి ఉక్కు పరిశ్రమకు ద్రోహం చేస్తున్నారని అన్నారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కడప ఉక్కు కోసం 2014 నుండి వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగుతోందన్నారు.

ఉక్కు పరిశ్రమ శిలాఫలకం వద్ద సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు

లేబర్ కోడ్లపై కార్మికులను కేంద్రం బలిపీఠంపైకి నెట్టింది

కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి ఆ స్థానంలో లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికులను బలిపీఠంపైకి పెట్టిందని వి.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో నవంబర్ 20న అమల్లోకి రావాల్సి ఉండగా రాష్ట్రంలో నవంబర్ 3 నుంచే అమల్లోకి తేవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రధాని మోడీ చేతిలో చంద్రబాబు కీలుబొమ్మగా మారారని విమర్శించారు. 2047 విజన్ సంగతేమోగానీ రాబోయే నాలుగేళ్లలో నెరవేర్చాల్సిన హామీలను అమలు చేయాలని కోరారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ అంటే ఇదేనా అని నిలదీశారు. జిందాల్ సమర్థత ఏమైందన్నారు. ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కావాలని నష్టాల పాలు చేస్తున్నారని వివరించారు. నిధులు, గనులు ఇవ్వడం లేదన్నారు. ప్రైవేట్ వ్యక్తికి చెందిన మిట్టల్ ఉక్కు పరిశ్రమల కోసం పది మంది ఎంపీలు లాబీయింగ్ చేస్తున్నారని విమర్శించారు.

పరిహారం నేటికీ అందలేదు
వి.శ్రీనివాసరావు వద్ద వాపోయిన కడప ఉక్కు పరిశ్రమ నిర్వాసితురాలు

ఉక్కు పరిశ్రమ పేరుతో తీసుకున్న భూములకు సంబంధించి నేటికీ తనకు పరిహారం అందలేదని వి.శ్రీనివాసరావు వద్ద నిర్వాసితురాలు కృపావతి ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వి.శ్రీనివాసరావు వద్ద ధాన్యం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన స్పందిస్తూ రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని, న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, జి.శివకుమార్ వి.అన్వేష్, బి.మనోహర్, చాన్‌బాషా, శ్రీనివాసులు, కుమారస్వామిరెడ్డి, డివైఎఫ్ఐ శివకుమార్, విజయ్, పట్టణ కార్యదర్శి దాసు, విజయ్, నరేంద్ర, ఆదాం, శేఖర్, నాగన్న, మైఖేల్, శివకుమార్, శివ నారాయణ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

- చిన్నారి ఆచూకీ గల్లంతు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందగా, ఆమె కుమారుడి ఆచూకీ గల్లంతమైంది. ఈ సంఘటన పల్నాడు జిల్లా నరసరావుపేట మండలంలో చోటు చేసుకుంది. తమ కూతురిని అల్లుడే చంపేశాడని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వారి కథనం మేరకు... రొంపిచర్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్‌కు, అదే మండలం నాదెండ్ల గ్రామానికి చెందిన త్రివేణి (25)తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు శరత్ ఉన్నారు. అనారోగ్యానికి గురైన శరణ్‌ను త్రివేణితో కలిసి నరసరావుపేటలోని ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా పాలపాడు గ్రామ సమీపంలో చిలకలూరిపేట మేజర్ కాల్వ వద్ద అనుమానాస్పద స్థితిలో త్రివేణి మరణించారు. నరసరావుపేటకు వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొని భార్య, కుమారుడు కాలువలో పడిపోయారని పోలీసులకు శ్రీకాంత్ ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు త్రివేణి మృతదేహాన్ని పరిశీలించారు. గజ ఈతగాళ్ల సాయంతో చిన్నారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. భార్యను చంపి చిన్నారిని కాలువలో పడేశారని మృతురాలి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పల్నాడు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేవుడి సొమ్ము దోపిడీ చిన్న విషయమా?

- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేవుడి సొమ్ము దోపిడీ చిన్న విషయమా? అని మాజీ సిఎం జగన్‌ను మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రశ్నించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ ప్రవర్తన చూస్తుంటే దొంగే దొంగ అని అరిచనట్టుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరకామణి చోరీ కేసులో దొంగ రవికుమార్ కేవలం రూ.72 వేలు చోరీ చేస్తే రూ.14 కోట్లు ఎలా రాసిచ్చారని ప్రశ్నించారు. వందల కోట్ల ఆస్తులను వైసిపి నేతల పేరుతో రాయించుకున్నారని, లోక్ అదాలత్‌లో రాజీ చేయించారని ఆరోపించారు. తిరుమలను అక్రమార్జనకు ఆదాయ వనరుగా జగన్ మార్చుకున్నారని పేర్కొన్నారు. రవికుమార్ ఆస్తులు వైసిపి పెద్దల పేర్లకు ఎలా మారాయి? ఎవరి ఒత్తిడితో లోక్ అదాలత్‌లో రాజీ జరిగిందని ప్రశ్నించారు. కల్తీ నెయ్యితో లడ్డూ ప్రసాదం తయారు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క చుక్క పాలు లేకుండా నెయ్యి తయారుచేశారని, ఇది ప్రపంచంలోనే తొమ్మిదో వింత అని ఎద్దేవా చేశారు.

రూఫ్‌టాప్ సోలార్ పనులు వేగవంతం

21 లక్షల బిసిల ఇళ్లకు సోలార్ సిస్టమ్స్ : సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలో ఎస్‌సి, ఎస్‌టి గృహవినియోగదారులకు రూఫ్‌టాప్ సోలార్ సిస్టం ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. పిఎం కుసుమ్, సూర్యఘర్ పథకం, ఎన్‌ఆర్‌ఇడిసి ప్రాజెక్టులు, వివిధ పథకాలపై ఎపిఎస్‌పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి, కలెక్టర్ ఓ.ఆనంద్‌తో కలిసి అనంతపురం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ...ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలో 7.48 లక్షల ఎస్‌సి, ఎస్‌టి గృహ విద్యుత్ వినియోగదారులకు వచ్చే ఏడాది మార్చిలోగా ఫీజిబిలిటీ ఉన్న గృహాలపై రెండు కిలోవాట్ల చొప్పున మొత్తం 415 మెగావాట్ల సామర్థ్యంతో రూఫ్‌టాప్ సోలార్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

మాట్లాడుతున్న విజయానంద్, పక్కన శివశంకర్ లోతేటి

సోలార్ ప్యానల్స్‌ను అమర్చిన వెంటనే ఎటువంటి జాప్యం లేకుండా నెట్ మీటర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలో పిఎం కుసుమ్ పథకం కింద 610 మెగావాట్ల సామర్థ్యంతో 1.36 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు సోలార్ విద్యుత్ పనులను పూర్తి చేయాలన్నారు. ఫీడర్ సోలరైజేషన్ పథకం కింద అనంతపురం సర్కిల్ పరిధిలోని 20 ప్రాంతాల్లో 498 ఎకరాల ప్రాంగణంలో 111 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి భూసేకరణను వేగవంతం చేయాలని ఆదేశించారు.

పిఎం సూర్యఘర్ పథకం కింద అనంతపురం జిల్లాలో 35.7 మెగావాట్ల సామర్థ్యంతో 17,870 గృహాలకు రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేయాలని, ఈ పనులను వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 21 లక్షల బిసి గృహాలకు రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్స్‌ను అమర్చనున్నట్లు తెలిపారు. పిఎం ఇ-డ్రైవ్ పథకం కింద వెహికల్ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, నెడ్‌క్యాప్ మేనేజింగ్ డైరెక్టర్ కమలాకర్ బాబు, ఎపిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ఐటి) పి.అయూబ్ ఖాన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌కె మస్తాన్‌బీ

గంజాయి ముఠాను కఠినంగా శిక్షించాలి

- పలువురు వక్తలు డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు జిల్లాలో ఇటీవల చోటు చేసుకుంటున్న పలు హత్యలకు గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు మూలకారణమని, ఈ మత్తు పదార్థాలను విక్రయిస్తున్న ముఠా సభ్యులను కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. 'డ్రగ్స్, గంజాయి వాడకం-సమాజంపై ప్రభావం' అనే అంశంపై నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక చైర్మన్ చొప్ప రవీంద్రబాబు మాట్లాడుతూ... మాదకద్రవ్యాలను విక్రయిస్తున్న మాఫియా, సభ్యులను పోలీసులు గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ఇప్పటివరకు జరిగిన హత్యలకు మూలకారణం మత్తు పదార్థాలేనని పోలీసులు నిర్ధారించారని గుర్తు చేశారు. గంజాయి వాడకం వల్ల కలిగే అనర్థాలను ఆర్‌డిటి కాలనీలో వివరిస్తూ ప్రజానాట్యమండలి కళాకారుడు పెంచలయ్య ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చూసి ఓర్వలేని గంజాయి మాఫియా సభ్యులు అతికిరాతకంగా ఆయనను హత్య చేయడం దుర్మార్గమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు మాట్లాడుతూ.. పెంచలయ్యను హత్య చేసిన గంజాయి ముఠాను కఠినంగా శిక్షించాలని కోరారు. ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్‌కె మస్తాన్‌బీ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలె వెంగయ్య మాట్లాడుతూ.. గంజాయి వంటి మత్తు పదార్థాలను నగరంలో పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పెంచలయ్య హత్యకు పాల్పడిన గంజాయి ముఠా సభ్యులను కఠినంగా శిక్షించాలని తీర్మానించారు. మహిళా మండలి నాయకులు వినోదమ్మ, సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి. ప్రసాద్, డివైఎఫ్ఐ నాయకులు నరసింహ, ఎంవి రమణ, యూత్ కాంగ్రెస్ నాయకులు సంజయ్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎంనరేంద్ర, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి జి.శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్ మాఫియాలో ఎవరి పాత్ర ఎంత?

- ప్రజా ప్రతినిధులు, అధికారుల లింకులపై ఇంటెలిజెన్స్ ఫోకస్
- రౌడీషీటర్ల పాత్రపైనా నివేదిక కోరిన సిఎంఒ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ మాఫియా రెచ్చిపోతోందని విజిలెన్స్ అధికారులు ఒకవైపు దాడులు చేస్తున్నా.. పూర్తి స్థాయిలో నియంత్రించలేకపోతున్నారనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. దీనికి అడ్డుకట్ట పడకపోవడం వెనుక ఎవరెవరి పాత్ర ఏ స్థాయిలో ఉందనే విషయంతోపాటు కదలికలపై ఇంటెలిజెన్స్ ఆరా తీస్తున్నట్లు సమాచారం. మాఫియాకు తెరవెనుక సహకరిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారుల పాత్రతోపాటు వారి మధ్య ఎటువంటి లింక్‌లు ఉన్నాయనే అంశంపై సిఎంఒ ఫోకస్ పెట్టినట్లు సమాచారం. పలు ప్రాంతాల్లో రేషన్ మాఫియాలో రౌడీ షీటర్లు కీలకపాత్ర పోషిస్తున్నట్లు ప్రభుత్వానికి నిర్దిష్టమైన సమాచారం రావడంతో వారి పాత్ర, ఏయే నియోజకవర్గాల్లో ఇటువంటి పరిస్థితులు నెలకొన్నాయి? వారి వెనుక ఉన్న ప్రజా ప్రతినిధులు ఎవరు? అనే అంశాలపై సిఎంఒ ఫోకస్ పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం విదేశాలకు ఎగుమతవుతున్న విషయం బహిరంగ రహస్యమే అయినప్పటికీ చెన్నై పోర్టును మాఫియా కేంద్రంగా చేసుకుని పెద్దయెత్తున బియ్యం విదేశాలకు తరలిస్తున్నారనేది అనేక సందర్భాల్లో బయటపడిన సంఘటనలు కూడా లేకపోలేదు. రాయలసీమతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని రేషన్ బియ్యం చెన్నై పోర్టు ద్వారా ఎగుమతులు జరుగుతున్నట్లు చర్చ నడుస్తోంది. ఎన్‌టిఆర్, కృష్ణా; గుంటూరు, పల్నాడు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి కాకినాడ పోర్టుకు తరలివెళ్తున్నట్లు చర్చ నడుస్తోంది. అనేక ప్రాంతాల్లో మాఫియా ముఠాలుగా రౌడీ షీటర్లు ఉండటంతో సామాన్యులు సైతం అక్రమంగా తరలిపోయే రేషన్ బియ్యాన్ని పట్టుకోవాలన్నా, పట్టించాలన్నా భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల కాలంలో గంజాయికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారనే కారణంతో నెల్లూరు పట్టణంలో పెంచలయ్య.. గంజాయి మూకల హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రేషన్ మాఫియాను అడ్డుకోవడం సామాన్యులకు ప్రాణాల మీదకు తెస్తుందనే భయం వెంటాడుతోంది. రేషన్ మాఫియా తమ వ్యాపార సామ్రాజ్యం యథేచ్ఛగా కొనసాగేందుకు ఆయా ప్రాంతాల్లోని రాజకీయ నేతలతోపాటు స్థానిక పోలీస్ స్టేషన్లకు నెలవారీ మామూళ్లు పెద్ద మొత్తంలో ముట్టజెబుతున్నట్లు తెలిసింది. కొన్ని ప్రాంతాల్లో వీరితోపాటు రవాణా శాఖ ఉద్యోగులు సైతం మాఫియాకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ వినియోగదారుల నుంచి కిలో రూ.10 నుంచి రూ.14 వరకు ప్రాంతాన్ని బట్టి బియ్యాన్ని మాఫియా కొనుగోలు చేసి, మిల్లర్లకు అమ్మకాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వం కిలోకు రూ.40కు పైగా ఖర్చు చేస్తూ ప్రజలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు రావడం లేదని పాలకులు పదేపదే చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇంటెలిజెన్స్ ద్వారా సమాచారాన్ని సేకరించి, ఇందులో ప్రజా ప్రతినిధులు, అధికారులు, రౌడీషీటర్ల జాబితాను నివేదిక రూపంలో ఇవ్వాలని ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశించినట్లు తెలిసింది.

హెచ్1బి వీసాలపై అమెరికాలో ఉంటున్న

ఉద్యోగులు, విద్యార్థులకు భరోసా కల్పించండి

- మంత్రి లోకేష్‌కు వి శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

హెచ్1బి వీసాలపై అమెరికాలో ఉంటున్న ఉద్యోగులు, విద్యార్థులకు భరోసా కల్పించేందుకు రాష్ట్ర మంత్రి లోకేష్ పర్యటన దోహదపడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కమిటీ తరపున అమెరికా పర్యటనలో ఉన్న లోకేష్‌కు శనివారం ఆయన లేఖ రాశారు. నేటి నుండి 10వ తేదీ వరకు లోకేష్ అమెరికాలో పర్యటించనున్నట్లు మీడియా ద్వారా తెలుసుకున్నానని, తెలుగువారి నుండి పెట్టుబడులు ఆహ్వానించడానికి ఈ పర్యటన జరుపుతున్నట్లు ప్రకటించాకరని అది మంచిదేనని ఆయన లేఖలో పేర్కొన్నారు. . అదే అమెరికాలో నేడు లక్షలాది మంది తెలుగు (ప్రత్యేకించి మన రాష్ట్రానికి చెందినవారు) వారు ఐటి తదితర ఉద్యోగాలు చేస్తున్నవారు, చదువు (ఎంఎస్)కుంటున్నవారు అభద్రతా భావంతో జీవిస్తున్నారని వారికి ఉద్యోగ భద్రత, జీవన భద్రతకోసం అమెరికా ప్రభుత్వంతో కూడా మట్లాడాలని కోరారు. ఎన్నారైలు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నారని, విదేశీ రెమిటెన్సిస్ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ సంక్షోభాన్ని తట్టుకోడానికి కొంత వరకు తోడ్పడుతున్నాయని వివరించారు. ప్రస్తుతం అమెరికా విధానాల వల్ల వాటికి గండి పడుతోందని పేర్కొన్నారు. గతంలో చంద్రబాబునాయుడిని అరెస్టు చేసిన సందర్భంలో మొదటగా గళమెత్తినవారు వారేనని, 2024 ఎన్నికల్లోనూ సెలవులు పెట్టి టిడిపి విజయం కోసం కషి చేశారని వివరించారు. అలాంటి వారు నేడు మీ నుండి తగిన భరోసా, స్పందనరాక బాధతో ఉన్నారని పేర్కొన్నారు. నిత్యం జెన్‌జెడ్ లేదా యువతరం, ఐటి అంటూ మాట్లాడే ప్రధాని మోడీ ఒక్కసారి కూడా ఈ సమస్యపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడలేదని, కనీసం అమెరికా ప్రభుత్వంతో సంప్రదించలేదని విమర్శించారు. నేడు అనేక పెద్ద ఐటి కంపెనీలు (గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబియం, మెటా, అమెజాన్ తదితర) వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్నాయని పేర్కొన్నారు. టిపిఎస్, విప్రో, ఇన్ఫోసిస్ తదితర భారతీయ కంపెనీలు కూడా పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్నాయని తెలిపారు. అనేక కంపెనీలు ఆంధ్రాకు వచ్చి కొత్తగా ఉద్యోగాలిస్తామని భ్రమపెడుతున్నాయని, అలాంటి కంపెనీలకు పెద్ద ఎత్తున రాయితీలు, సౌకర్యాలు కల్పిస్తున్నారని, వారి నుండి రాష్ట్రం వారికి ఉద్యోగాలిచ్చేందుకు ఎలాంటి హామీ తీసుకోవడం లేదని పేర్కొన్నారు. పైగా ఉద్యోగులను, కార్మికులనుసులభంగా తొలగించడానికి చట్ట సవరణ (లేబర్ కోడ్స్) చేశారని, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని సవరించి అదనపు గంటలు పనిచేయాలని నిర్దేశించారని వివరించారు. మధ్యంతర వయస్సులో ఉన్నవారు అప్పులు చేసి ఇల్లు, కార్లు కొనుక్కున్నారని, పిల్లల చదువులు మధ్యలో ఉన్నాయని వివరించారు. ఇప్పుడు వారికి ఉద్యోగాలుపోతే (లే ఆఫ్, రిక్రూట్‌మెంట్) కనీసం ఇఎంఐలు కూడా కట్టుకోలేక కట్టుబట్టలతో వీధిన పడతారని తెలిపారు. వారు ఇంత సంక్షోభంలో ఉన్నా మీ నుండి స్పందన, సానుభూతి వ్యక్తం కాలేదని, ఆపే ప్రయత్నమూ చేయలేదని పేర్కొన్నారు. అమెరికాలో ఉంటున్నవారు తిరిగి ఇక్కడకు వస్తే వారికి ఉద్యోగాల కల్పన చేయలేకపోతే తీవ్ర నిస్పృహకు గురవుతారని, మంత్రిగా చొరవ తీసుకొని వారికి ఉద్యోగ భద్రత కల్పించేందుకు, తొలగింపులు ఆపేందుకు భారత ప్రభుత్వం, అమెరికా అధ్యక్షుడు, వివిధ కంపెనీల అధికారులతో మీకున్న సంబంధ బాధ్యాలను ఉపయోగించాలని కోరారు. రాష్ట్రం నుండి వేలాదిమంది అమెరికాలో ఉపాధి పొందుతూ రాష్ట్రాభివృద్ధికి తోడుగా నిలబడ్డ ఐటి తరగతిని, యువతరాన్ని ఆదుకోవడానికి ముందుకు రావాలని, భరోసా ఇవ్వాలని కోరారు. ఈ పర్యటనలో ఆ మేరకు మంత్రిగా కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు.



గుమ్మడి గోపాలకృష్ణను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఘనంగా బొల్లిముంత ఫౌండేషన్ మహోత్సవాలు

- గుమ్మడి గోపాలకృష్ణకు విశిష్ట రంగస్థల కళా పురస్కారం ప్రదానం

ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తెనాలి పట్టణానికి చెందిన బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాలను తొలిరోజు శనివారం స్థానిక కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేశారు. తొలుత బొల్లి ముంత శివరామకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 'తెలుగు భాష -సాహిత్యం -వికాసం' అనే అంశంపై కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత తాతినేని శివశంకర్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మారిశెట్టి కృష్ణారావు, శాస్త్రవేత్త డాక్టర్ చందు సాంబశివరావు ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనం సభికులను ఆకట్టుకుంది. అంతర్జాతీయ రంగస్థలం నటులు గుమ్మడి గోపాలకృష్ణకు విశిష్ట రంగస్థల కళా పురస్కారంతో పాటు రూ.25 వేల నగదు, ప్రజాసాహితీ పత్రిక సంపాదకులు కొత్తపల్లి రవిబాబుకు బొల్లిముంత శివరామకృష్ణ విశిష్టసాహితీ పురస్కారంతో పాటు రూ.25 వేలు నగదుతో సత్కరించారు. ఆదివారం సినీనటుడు బ్రహ్మానందాన్ని బొల్లిముంత శివరామకృష్ణ, జాతీయ స్థాయి జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించనున్నట్లు నిర్వాహకులు చందు సుబ్బారావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ, వైష్ణవి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావు, ప్రియదర్శిని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చింతల శ్రీనివాసరావు, టి శివశంకరరావు, బెల్లంకొండ వెంకట్ పాల్గొన్నారు.

'స్మార్ట్..'గా ప్రయివేటుకు మధ్యాహ్న భోజనం !

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల ఆందోళన
- స్మార్ట్ కిచెన్ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా అమల్జేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. 'స్మార్ట్ కిచెన్'ల పేరుతో ఈ పథకాన్ని ప్రయివేటుకు కట్టబెట్టాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో విజయవాడలోని ఎంబివికెలో శనివారం నాడు నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయివేటు సంస్థలకు అప్పగిస్తే ఆహార నాణ్యత తగ్గిపోవడంతో పాటు కార్మికుల ఉపాధిపైనా తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యూనియన్ కోశాధికారి ఎం నాగమణి ప్రవేశపెట్టిన 'మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటుకు అప్పగించే ఆలోచన'ను వెనక్కి తీసుకోవాలనే తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగిస్తే.. స్మార్ట్ కిచెన్లలో ఎక్కడో వండిన ఆహార పదార్థాలను పాఠశాలలకు తరలించాల్సివుంటుందని, దీనివల్ల ఆహార నాణ్యతకు భరోసా ఉండదన్నారు. ఇప్పటికే అక్షయపాత్ర, ఇస్కాన్ వంటి ప్రయివేటు సంస్థల నిర్వహణలో చల్లారిన భోజనాన్ని, రుచిపచీ లేని ఆహారాన్ని పిల్లలు తినాల్సివస్తోందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రయివేటు ఆలోచనలు మానుకోవాలని హితవు పలికారు. ఈ పథకం పటిష్టంగా అమల్జేసేందుకు మెను ఛార్జీలను విద్యార్థికి రూ.20 చొప్పున ఇవ్వాలని కోరారు. కార్మికులకు కనీసం రూ.10 వేలు వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దడాల సుబ్బారావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు అశోక్, యుటిఎఫ్ నాయకులు కె శ్రీనివాసరావు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ నాయకులు ఎం సూర్యారావు పాల్గొన్నారు.

ప్రాయశ్చితంగానే నా ఆస్తి రాసిచ్చా

- పరకామణి ఎ1 ముద్దాయి రవికుమార్ కామెంట్స్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

రవికుమార్ ఫొటో

'పరకామణిలో ఓ తప్పు చేశాను... ఆ తప్పును మా కుటుంబ సభ్యులు, నేను మహాపాపంగా భావించాం... ప్రాయశ్చితంగానే నా ఆస్తిలో 90 శాతం ఆస్తులను స్వామివారికి ఇచ్చాను... నేను ఎవరికీ వాటాలు ఇవ్వలేదు.' అని పరకామణి కేసులో ఎ1 ముద్దాయిగా ఉన్న రవికుమార్ కామెంట్స్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఓ వీడియోను శనివారం ఆయన విడుదల చేశారు. తాను ఎవరికీ వాటాలు ఇవ్వలేదని, తాను శస్త్ర చికిత్స చేసుకున్నానని మాట్లాడుతున్నారని, న్యాయస్థానం ఆదేశిస్తే ఎలాంటి వైద్యసేవలకైనా సిద్ధమే అన్నారు. తాను ఎలాంటి శస్త్ర చికిత్సా చేసుకోలేదని నిరూపించుకుంటానని పేర్కొన్నారు. కొంతమంది తనను బ్లాక్‌మెయిల్ చేశారని, వారిపైనా కేసులు పెట్టానని అన్నారు.

34.5 కేజీల గంజాయి స్వాధీనం

- ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రయాణికుల ముసుగులో గంజాయిని తరలిస్తున్న ముఠాను ఏలూరు పెద రైల్వేస్టేషన్‌లో పోలీసులు పట్టుకున్నారు. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు రైల్వే ఎస్ఐ శివన్నారాయణ తన సిబ్బందితో కలిసి శుక్రవారం అర్ధరాత్రి రైల్వే స్టేషన్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సమయంలో ఓ యువతి, యువకుడు, వృద్ధురాలు మూడు బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా వారు అడ్డతీగల నుంచి గంజాయిని కొనుగోలు చేసి కాకినాడ ప్రాంతంలో స్టోర్ చేసి అనంతరం రైలు ప్రయాణం ద్వారా చెన్నై తరలిస్తున్నట్లు చెప్పారు. నిందితుల నుంచి రూ.17 లక్షల విలువైన 34.5 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.ప్రధాన ముద్దాయి కర్ణాటక రాష్ట్రంలోని వెల్లూరు గ్రామానికి చెందిన హెచ్‌ఎం.రవికుమార్ ప్రస్తుతం కాకినాడ రమణక్కపేటలోని భవాని బేకరీలో పని చేస్తున్నారు. తమిళనాడు రాష్ట్రం చెన్నై ప్రాంతానికి చెందిన మునియమల్ మనోగరామ్ అనే వృద్ధురాలు, చెన్నైకి చెందిన రెబక గణేషన్ స్థానికంగా ఉన్న ఉమెన్స్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఈ ముగ్గురు ముఠాగా ఏర్పడి గంజాయిని కొనుగోలు చేసి కాకినాడ నుంచి చెన్నై తరలిస్తున్నారు. చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌కు చేరుకొకముందే రైలు పట్టాల పక్కన గంజాయిని జారవిడుస్తారని, అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న కొనుగోలుదారులు వీటిని తీసుకుని అక్కడ నుంచి వెళ్లిపోతారని, ఈ వ్యవహారంలో నగదు లావాదేవీలు అంతా ఆన్‌లైన్ ద్వారానే జరుగుతున్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారు.

హక్కుల సాధనకు పోరాటాలే మార్గం

సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య

ప్రజాశక్తి - కడప

హక్కుల సాధనకు పోరాటాలే మార్గమని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. కడప నగరంలోని హరిత హోటల్ సమావేశ మందిరంలో సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర 9వ మహాసభ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బంగారురావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ పాసిజానికి వ్యతిరేకంగా హక్కుల సాధనకు పోరాటాలే మన ముందున్న మార్గమన్నారు. సామాజికంగా అణచివేతకు గురైన అన్ని వర్గాల ప్రజల కోసం, కార్మికుల కోసం, ఉద్యోగుల కోసం, విద్యార్థుల సమస్యల కోసం సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని బిజెపి, ఎన్‌డిఎ కూటమిపాలన ప్రజావ్యతిరేకంగా సాగుతోందన్నారు. కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం సాగించాలని దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో విధ్వంసపాలన ప్రజల జీవితాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందన్నారు. కేంద్రంలో ఫాసిజం అధికారంలోకి వచ్చి వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ గుత్తాధిపత్యం సాగిస్తోందని, భారత రాజ్యాంగాన్ని విధ్వంసం చేసేందుకు పూనుకుంటోందని విమర్శించారు.

బలమైన వామపక్ష ఉద్యమాన్ని నిర్మించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

దేశంలో, రాష్ట్రంలో ప్రస్తుత పాలకులు అనుసరిస్తోన్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలంటే బలమైన వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ 9వ రాష్ట్ర మహాసభకు గౌరవ విశిష్ట అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 6 బాబ్రీ మసీదు కూల్చివేత, అంబేద్కర్ వర్ధంతి ఒకే రోజన్నారు. బాబ్రీ మసీదు కూల్చివేత రాజ్యాంగంపై దాడి అని తెలిపారు. లౌకిక రాజ్యాంగంపై పడిన దెబ్బ ఈనాడు బీహార్‌పై కనబడుతోందన్నారు. ప్రజా, పౌర హక్కులపై దాడిని, పాలకుల కుట్రలను వామపక్షాలు ఉమ్మడిగా చర్చించి ఓ ప్రణాళిక రూపొందించుకొని ఎదుర్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రత కోసం కమ్యూనిస్టులందరూ ఏకం కావాలన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతుందన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తుందని వివరించారు. పోరాడి సాధించుకున్న చట్టాలను సమూలంగా మార్పులు చేసి దోపిడీకి ద్వారాలు తెరిచిందన్నారు.

సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పొలిట్ బ్యూరో సభ్యులు శంకర్, కేంద్ర కమిటీ సభ్యులు చంద్రమోహన్, మూర్తి, రాష్ట్ర నాయకులు హరినాథ్, జనార్ధన్, అర్జునరావు, రాందేవ్, సన్యాసిరావు, వాసుదేవరావు, గొడుగు సత్యనారాయణ, అప్పలరాజు, కళావతి, ఉదయ్ కుమార్, సిపిఐ ఎంఎల్ జిల్లా అధ్యక్షులు బందెల ఓబయ్య పాల్గొన్నారు. మహాసభ ప్రారంభానికి ముందు కడప నగరంలో ర్యాలీ నిర్వహించారు.

సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, వి శ్రీనివాసరావు తదితరులు

పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

21 నుంచి చెకుముకి రాష్ట్రస్థాయి సంబరాలు

- పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు డిసెంబర్ 21 నుంచి 23 వరకు కాకినాడ జిల్లా కేంద్రంలోని జెఎన్‌టియుకెలో నిర్వహిస్తున్నట్లు జెవివి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు తెలిపారు. చెకుముకి సంబరాల్లో ఇస్రో సైంటిస్టులు, సిసిఎంబి రిటైర్డ్ సైంటిస్ట్ రాధ, 200 మంది ఉపాధ్యాయులు, 200 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొంటారని చెప్పారు. కాకినాడలోని యుటిఎఫ్ హోమ్‌లో చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మీడియా సమావేశంలో లక్ష్మణరావు మాట్లాడారు. ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం జన విజ్ఞాన వేదిక శాస్త్రవిజ్ఞాన ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్య పరుస్తోందని, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి కృషి చేస్తోందని అన్నారు. పాఠశాల, మండల, జిల్లా స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించామని తెలిపారు. జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సురేష్ మాట్లాడుతూ సైన్స్ ఫలాలు ప్రజలందరికీ అందాలని ఆకాంక్షించారు.

వైద్య విద్య ప్రవేశాల్లో బాలికలదే హవా

- మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్య విద్య (ఎంబిబిఎస్) ప్రవేశాల్లో బాలికలే ఎక్కువగా చేరారని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఈ ఏడాది ఎంబిబిఎస్ ప్రవేశాల వివరాలను ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రాధికారెడ్డి.. మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు నివేదించగా, ఆ వివరాలను మంత్రి శనివారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. గత రెండేళ్లతో పోల్చితే 2025-26 విద్యా సంవత్సరంలో 3.66 శాతం అమ్మాయిల ప్రవేశాలు పెరిగాయని తెలిపారు. 2024-25తో పోల్చితే అబ్బాయిల ప్రవేశాలు 3.66 శాతం తగ్గాయని వివరించారు. 2023-24లో 57.06 శాతం, 2024-25లో 57.96 శాతం, 2025-26లో 60.72 శాతం చొప్పున బాలికలు ఎంబిబిఎస్‌లో చేరినట్లు వెల్లడించారు. ఈ పరిణామం పట్ల అమ్మాయిల భవిష్యత్తు విషయంలో తల్లిదండ్రుల్లో వస్తున్న మార్పునకు సంకేతమని పేర్కొన్నారు. పాఠశాల విద్య నుంచే అమ్మాయిలు నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు పుస్తకాలతో మమేకమవుతున్నారని తెలిపారు. అందువల్లే వారికి నీట్‌లో ఉత్తమ ర్యాంకులు వస్తున్నాయని చెప్పారు. కన్వీనర్, యాజమాన్య కోటాలోనూ బాలికల ప్రవేశాలు అధికంగా ఉండటం గమనార్హమని పేర్కొన్నారు. ఈ ఏడాది మొత్తం 6,430 సీట్లలో కన్వీనర్ కోటా కింద అమ్మాయిలు 2,617, అబ్బాయిలు 1,638 చొప్పున సీట్లు దక్కించుకున్నారని వెల్లడించారు. యాజమాన్య కోటాలో 1,287 సీట్లు అమ్మాయిలు, 888 సీట్లు అబ్బాయిలు పొందారని వివరించారు.

సదస్సునుప్రారంభిస్తున్న ఐఎంఎ జాతీయ అధ్యక్షులు దిలీప్ భానుశాలి

వైద్య రంగంలో వస్తున్న మార్పులను కృత్రిమ మేధా సాంకేతికతతో అధిగమించాలి

- ఆరోగ్య కెరీర్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్లదే ముఖ్య పాత్ర
- ఐఎంఎ జాతీయ అధ్యక్షులు దిలీప్‌భాను సాలి

ప్రజాశక్తి - విజయనగరం కంటోన్మెంట్

వైద్యరంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులను కృత్రిమ మేధా సాంకేతికతతో అధిగమించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ దిలీప్ భానుశాలి అన్నారు. వైద్యులంతా ఈ సాంకేతికతపై నిష్ణాతులు కావాలని, దీనిని ఉపయోగించి చికిత్స చేయాలని సూచించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలోని ప్రైవేట్ కన్వెన్షన్ హాల్లో శనివారం నిర్వహించిన జిపి కాన్ 2025 ఐఎంఎ వార్షిక జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆరోగ్య కెరీర్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్ ముఖ్యపాత్ర పోషిస్తున్నారన్నారు. అన్ని రోగాలకు ప్రాథమిక వైద్యాన్ని అందిస్తున్నారని తెలిపారు. తప్పు లేకపోయినా ఇటీవల కాలంలో వైద్యులపై భౌతిక దాడులు పెరుగుతున్నాయని, ఇటువంటి దాడులు ఆపాలని అన్నారు. అత్యంత కీలకమైన సిపిఆర్‌లో ఫార్మసీ రిసిపిటేషన్ ప్రక్రియపై బేసిక్ లైఫ్ సపోర్ట్ ప్రథమ చికిత్స అందించే విధానంపై దేశవ్యాప్తంగా సామాజిక కార్యకర్తలను తయారు చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం యువత పోలీస్, వైద్య సిబ్బంది తదితరులకు శిక్షణ ఇవ్వాలని అన్నారు. అనంతరం వైద్య రంగంలో కృత్రిమ మేధా ప్రభావంపై అవగాహన కల్పించారు. ముందుగా పేపర్ ప్రజెంటేషన్ చేసిన వారికి సదస్సు అనంతరం ప్రశంసా పత్రాలు అందజేశారు. సిజిపి (ఎలక్ట్ డీన్) శోభా ఓజా, ఐఎంఎ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ గురులింగప్ప, బిడి సహళ్, కోశాధికారి పీయూష్ జైన్, ఎపి మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ శ్రీహరిరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ సమరం, ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు ఐ.బాలరాజు ప్రధాన కార్యదర్శి డాక్టర్ బోషు, జాతీయ సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ ఎం.వెంకటేశ్వరరావు, ఐఎంఎ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, ఎన్‌టిఆర్ ఆరోగ్య వైదవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ జెసి నాయుడు, ఎ.మధుకర్, ఐఎంఎ బ్రాంచ్ అధ్యక్షులు వి.అశోక్, కార్యదర్శి లెంక శ్రీనివాస్, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వైద్యులు తదితరులు పాల్గొన్నారు

8న విద్యుత్తు, విత్తన బిల్లుల ప్రతుల దగ్ధం

- ఎపి రైతు సంఘం విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో విద్యుత్తు బిల్లు-2025, విత్తన బిల్లు-2025ను ఆమోదించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలు తీసుకొచ్చిందని, ఈ రెండు బిల్లులు వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పేర్కొంది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతాంగానికి నష్టం చేకూర్చే ఈ రెండు బిల్లుల కాపీలను దగ్ధం చేయాలని అఖిలభారత కిసాన్ సభ, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో రైతులు, కౌలు రైతులు, కలిసొచ్చే అన్ని రైతు సంఘాలనూ కలుపుకుని నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సిక్కోలులో గుప్పుమంటున్న గంజాయి

- గుట్టుచప్పుడు కాకుండా వినియోగం, విక్రయాలు
- ఉపాధి లేక అటు వైపు ఆకర్షితులవుతున్న యువత

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

సిక్కోలులో గంజాయి గుప్పుమంటోంది. మూడేళ్ల కాలంలో గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుబడుతున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ఒడిశా నుంచి విరివిగా జిల్లాలోకి గంజాయిను తీసుకొస్తూ వినియోగం, విక్రయాలు చేస్తున్నారు. పట్టుబడుతున్న వారిలో ఎక్కువ మంది 20 నుంచి 40 ఏళ్ల లోపే ఉంటున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల కొందరు, ఉపాధి లేక మరికొందరు డబ్బులు వస్తాయనే ఆశతో గంజాయి రవాణా వైపు ఆకర్షితులవుతున్నారు. మరోవైపు ఒడిశా నుంచి జిల్లా మీదుగా యథేచ్ఛగా గంజాయి అక్రమ రవాణా సాగుతోంది. శ్రీకాకుళం మీదుగా రోడ్డు, రైలు మార్గాల్లో మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాలకు పెద్ద మొత్తం గంజాయి తరలిస్తూ పోలీసులకు పట్టుబడుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో గంజాయి అక్రమ రవాణాతో పాటు చాప కింద నీరులా వినియోగం పెరుగుతోంది. పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్న వారిలో అత్యధిక మంది యువకులే ఉంటున్నారు. తక్కువ ధరకు ఒడిశా నుంచి కొనుగోలు చేసి ఎక్కువ మొత్తానికి ఇక్కడ విక్రయిస్తున్నారు. గంజాయి కోసం శ్రీకాకుళం, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం, నరసన్నపేట, ఎచ్చెర్ల, పాతపట్నం, టెక్కలి నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాలకు చెందిన యువకులు వారం, పది రోజులకోసారి ద్విచక్ర వాహనాలపై ఒడిశాకు వెళుతున్నట్లు తెలిసింది. పెద్ద మొత్తంలో తీసుకొస్తే పోలీసులకు అనుమానం వస్తుందని రెండు నుంచి నాలుగు కేజీల వరకు తీసుకొస్తున్నట్లు సమాచారం.

పట్టుబడిన గంజాయి ప్యాకెట్లు

పోలీసుల నుంచి తప్పించుకోవడానికి మారుమూల మార్గాలను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఒడిశాలో కేజీ రూ.రెండు వేల నుంచి రూ.3 వేల వరకు కొనుగోలు చేసి తీసుకొస్తున్నట్లు సమాచారం. వారు వినియోగించడంతో పాటు స్నేహితులు, తెలిసిన వారికి పొట్లాల్లో పెట్టి విక్రయిస్తున్నారు. పరిమాణం మేరకు ఒక్కొక్కటి రూ.వంద, రూ.300, రూ.500, రూ.వెయ్యి వరకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. యువతలో ఉన్న బలహీనతను అనువుగా తీసుకుని గంజాయి ముఠా వీరిని ఉచ్చులోకి లాగుతోంది. ఆంధ్రా-ఒడిశా బోర్డరు మల్కన్‌గిరి, ఆర్ ఉదయగిరి, మోహన, గజపతి బ్లాకుల్లో ఉన్న మారుమూల కొండలు, అటవీ ప్రాంతాల్లో గంజాయిని విరివిగా పండిస్తున్నట్టు సమాచారం. దీనిని దళారులు ఒడిశా సరిహద్దు వరకు వరకూ తీసుకొచ్చి అక్కడ నుంచి కూలీలు, చిన్న చిన్న దళారులకు అప్పగిస్తున్నారు. నిఘా లేకపోతే రైలు మార్గం, నిఘా ఎక్కువైతే రోడ్డు మార్గం గుండా గంజాయిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గంజాయిని బస్సులు, కార్లు, రైళ్లలో మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాలకు తరలించి, అక్కడ దళారులకు అందజేస్తున్నారు. తమకు నిజమైన వ్యాపారి ఎవరనేది తెలియదని, కనీసం వారి ఫోన్ నంబర్లూ అందుబాటులో ఉండవని కూలీలు చెప్తున్నారు. కేవలం దళారులు ఫోన్ చేసి ఫలానా వ్యక్తి వేసుకున్న దుస్తుల కలర్, ఎత్తు ఆధారాలు చెప్పి సరుకు ఇవ్వాలని ఆదేశిస్తారు. ఆ ఆనవాళ్ల ప్రకారం గంజాయి నిల్వలు అందజేస్తామని పోలీసు దర్యాప్తులో నిందితులు అంగీకరిస్తున్న పరిస్థితి ఉంది.

యువతను రొంపిలోకి దించుతున్న ముఠా శ్రీకాకుళం నగరానికి చెందిన ఓ యువకుడు ఇటీవల జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద రెండు కేజీ గంజాయితో పోలీసులకు దొరికాడు. అతడు వినియోగించడంతోపాటు తెలిసిన వారికి విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో అంగీకరించాడు. ఎచ్చెర్ల మండలం పొన్నాడ వంతెన వద్ద కొన్ని వారాల కిందట తొమ్మిది మంది యువకులు 17 కేజీల గంజాయితో పోలీసులకు దొరికారు. అంతా 18 నుంచి 25 ఏళ్ల లోపువారే. గత నెల ఒకటిన పోలీసులు పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో తనిఖీలు నిర్వహిస్తుండగా ఐదుగురు 85 కిలోల గంజాయితో పట్టుబడ్డారు. అందులో 20 ఏళ్లు కూడా నిండని వారు ముగ్గురు ఉన్నారు. గంజాయి రవాణా చేసి అక్కడున్న మధ్యవర్తికి అందజేస్తే రూ.10 వేలు వస్తాయని చెప్పడంతో తరలిస్తుండగా దొరికిపోయినట్లు పోలీసులకు చెప్పారు. తమిళనాడు తూత్కుడి జిల్లాకు చెందిన మారీష్ రాయగడ ప్రాంతానికి చెందిన రాహుల్ వద్ద 14 కేజీల గంజాయి కొనుగోలు చేసి పలాస రైల్వేస్టేషన్‌లో పోలీసులకు పట్టుబడ్డారు.

గంజాయి కేసుల వివరాలు

సంవత్సరం	స్వాధీనం చేసుకున్న గంజాయి (కేజీల్లో)	నిందితులు
2023-24	219	16
2024-25	986	139
2025 ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు	1275	220

గిరిజనోత్పత్తులకు మార్కెటింగ్ ఎంతో కీలకం

- ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గిరిజనుల జీవనోపాధిని పెంచేందుకు మార్గాలు అన్వేషించడంతో పాటు గిరిజన ఉత్పత్తుల పెంపు, మార్కెటింగ్ ఎంతో కీలకమని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తెలిపారు. అటవీ ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, ఎకో టూరిజం, పర్యాటకం పెంపు వంటి కీలకమైన అంశాలను ప్రాతిపదికగా తీసుకుని గిరిజన యువతలో నిరుద్యోగ సమస్య లేకుండా చేయాలన్నారు. మంగళగిరిలోని ఆయన క్యాంపు కార్యాలయం నుంచి శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్‌పి అమిత్ బర్దర్‌తో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అల్లూరి జిల్లా అటవీ ప్రాంతంలో గంజాయి నిర్మూలన అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లోని వారి శక్తిని, శ్రమను ఉపయోగించుకుని వారి జీవన ప్రమాణాలను పెంచాలన్నారు. అటవీ ఉత్పత్తులు, ఆర్గానిక్ ప్రొడక్ట్స్‌కు ఎంతో డిమాండ్ ఉందన్నారు. కాఫీ తోటలతో పాటు అడవిలో విరివిగా దొరికే ఉత్పత్తులను సాగుచేసేలా ప్రోత్సహించాలన్నారు. మార్కెట్ డిమాండ్‌ను అనుసరించి అటవీ ఉత్పత్తులను విరివిగా పెంచేలా చూడాలన్నారు. గిరిజనులతో మమేకం కావడం, వారి ఆలోచనలను వినడం, వారికి సహాయపడటం, మర్చిపోవద్దని అధికారులకు సూచించారు. గిరిజన యువతలో స్ఫూర్తిని నింపి వారిని ఎంటర్ ప్రెన్యూర్‌గా తీర్చిదిద్దాలన్నారు. ఉద్యాన పంటలకు ఉపాధి పనులను అనుసంధానం చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యాటకం పెంపుదల ప్రధానమని, ఎకో టూరిజమనేది ప్రపంచంలో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రంగమన్నారు. సినిమాలు, సీరియళ్లతోపాటు ఒటిటి కంటెంట్లను ఏజెన్సీ ప్రాంతాల్లో షూటింగ్లు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో శ్రీసత్యసాయి జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- రైతులకు సాగు నీరు అందించి ఆదుకోవాలి
- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. కర్నూలులోని కార్మిక కర్షక భవన్‌లో రైతు సంఘం జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయం లాభసాటి కావాలన్నదే పంచ సూత్రాల లక్ష్యమని చంద్రబాబు చెబుతున్న మాటలకు చేతలకు చాలా వ్యత్యాసం ఉందని అన్నారు. అన్ని రకాల పంటల ధరలు పతనమయ్యాయని, మద్దతు ధర లేక అతి తక్కువ ధరకు గుంటూరు మిర్చి యార్డులో వేల క్వింటాళ్లను రైతుల అమ్ముకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2024లో క్వింటాలు పొగాకు రూ.18,000 ఉంటే 2025లో రూ. ఆరువేలు కూడా దక్కలేదని చెప్పారు. మామిడి పంటకు ప్రభుత్వం ప్రకటించిన పది రూపాయల మద్దతు ధర కూడా దక్కలేదన్నారు. అరటికి ధర లభించక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని వివరించారు. ఉల్లి ధరలు పడిపోవడంతో క్వింటాలు రూ.1200 చొప్పున కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ తీరా ఒక్క వారం కూడా రైతుల నుంచి కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. ఐదు లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా తేమ శాతం అధికంగా ఉందని జిన్నింగ్ మిల్లులు కొనుగోలు చేయకుండా రైతులను మోసం చేస్తున్నాయన్నారు. మిర్చి, టమోటా రైతులకు మద్దతు ధర ప్రకటించి రైతులకు భరోసా ఇవ్వాలని కోరారు. మొక్కజొన్న 16 శాతం విస్తీర్ణం పెరిగిందని, క్వింటాలు రూ.2,400 మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు పంటల బీమా అమలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇ-క్రాప్ ద్వారా రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలోని వేదవతికి రూ.200 కోట్లు, రాజోలి ఆర్‌డిఎస్ కుడికాలువకు రూ.1800 కోట్ల నిధులు కేటాయిస్తే ప్రాజెక్టులు పూర్తి అవుతాయని తెలిపారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర పాల్గొన్నారు.

10 నుంచి భారత్, అమెరికా వాణిజ్య చర్చలు

న్యూఢిల్లీ : భారత్, అమెరికా మధ్య డిసెంబర్ 10 నుంచి వాణిజ్య ఒప్పంద చర్చలు జరగనున్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీలో మూడు రోజుల పాటు సాగే ఈ చర్చల్లో మొదటి విడత ఒప్పందంపై ప్రధానంగా దృష్టి సారించే అవకాశాలున్నాయి. ఈ చర్చలకు అమెరికా తరపున హాజరవుతున్న బృందంలో డిప్యూటీ ట్రేడ్ రిప్రజెంటేటివ్ రిక్ స్విట్జర్ పాల్గొననున్నారు. భారత ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు ఆరు విడతలుగా సమావేశాలు జరిగాయి. అయినా పెద్ద ప్రయోజనం లేకుండా పోయింది.

ప్రస్తుత ఏడాదిలోనే అమెరికాతో తొలి దశ వాణిజ్య ఒప్పందం జరగొచ్చని ఇటీవల వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వెల్లడించారు. పూర్తిస్థాయి వాణిజ్య ఒప్పందం దిశగా మరో విడత చర్చలు జరుపుతామని పేర్కొన్నారు.

తరలిపోయిన రూ.11,820 కోట్ల ఎఫ్ఐఐలు

ముంబయి : భారత స్టాక్ మార్కెట్లపై విదేశీ సంస్థాగత మదుపర్లు అనాసక్తి కనబర్చుతున్నారు. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐ) డిసెంబర్‌లోని ఒక్క తొలి వారంలోనే రూ.11,820 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించి.. ఆ మొత్తాన్ని తరలించుకుపోయారు. నవంబర్‌లో కూడా అమ్మకాలు పరంపర కొనసాగింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు మొత్తం రూ.1,55,495 కోట్ల విలువైన దేశీయ షేర్లను విక్రయించారు.

ఎయు మాజీ విసికి జైలుశిక్ష

- అప్పీల్‌కు వీలుగా తీర్పు అమలు నిలిపివేత

ప్రజాశక్తి-అమరావతి

ఆంధ్రా యూనివర్సిటీ సైన్స్, టెక్నాలజీ కళాశాల బోటనీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ నూకన్న దొరను కొనసాగించాలన్న ఉత్తర్వులను అమలు చేయని ఆంధ్రా యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ పివిజిడి ప్రసాదరెడ్డి తీరును హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. కోర్టు ఉత్తర్వుల అమలు విషయంలో ప్రసాదరెడ్డి అతి తెలివిగా వ్యవహరించారని ఆగ్రహించింది. అనేకసార్లు కోర్టు ఉత్తర్వులను అమలు చేయలేదని గుర్తు చేసింది. విసి బాధ్యతల నుంచి వైదొలగిలింపు తర్వాత కొత్త విసి కోర్టు ఆదేశాల్ని అమలు చేశారని చెప్పింది. కోర్టు ధిక్కరణ కేసులో ప్రసాదరెడ్డికి నెలరోజుల సాధారణ జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధించింది.

జైలు శిక్షపై అప్పీల్ దాఖలుకు వీలుగా తీర్పు అమలును ఆరు వారాలు సస్పెండ్ చేయాలని ప్రసాదరెడ్డి తరపున న్యాయవాది కోరగా, అందుకు హైకోర్టు అనుమతినిచ్చింది. ఒకవేళ అప్పీల్ దాఖలు చేయకపోయినా, అప్పీల్ దాఖలు చేశాక స్టే ఉత్తర్వులు లభించకపోయినా ఈ నెల 22న సాయంత్రం 5 గంటలలోపు హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) వద్ద లొంగిపోవాలని ప్రసాదరెడ్డిని ఆదేశించింది. ఎయు సైన్స్, టెక్నాలజీ కళాశాల-బోటనీ విభాగంలో భోదనా సిబ్బందిగా నూకన్న దొర 2006 జులైలో నియమితులయ్యారు. ఆ తర్వాత ఒప్పంద విధానంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ కొనసాగుతూ మొత్తం 17 ఏళ్లపాటు చేశాక ఆయనను విధుల్లోంచి తొలగిస్తూ ఎయు విసి 2022 నవంబరు 18న ఉత్తర్వులిచ్చారు. అదే ఏడాది మే నెల నుంచి జీతం బకాయిలు కూడా చెల్లించలేదంటూ 2023లో నూకన్న దొర హైకోర్టును ఆశ్రయించారు. అదే ఏడాది మార్చిలో న్యాయమూర్తి.. పిటిషనర్‌ను అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కొనసాగించాలని మధ్యంతర ఆదేశాలిచ్చారు. ఈ ఉత్తర్వులను అమలు చేయలేదని మాజీ విసి ప్రసాదరెడ్డిపై నూకన్న దొర కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. ఈ మేరకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ గత నెల 20న వెలువరించిన తీర్పు ప్రతి శనివారం అందుబాటులోకి వచ్చింది.

మదనపల్లె ఫైళ్ల దగ్ధం కేసులో మాధవరెడ్డి ఇంట్లో సోదాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అన్నమయ్య జిల్లా మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం కేసు నిందితుడు మాధవరెడ్డి ఇంట్లో సిఐడి అధికారులు సోదాలు చేపట్టారు. శనివారం తెల్లవారుజాము నుంచే ఆయన నివాసం, రొంపిచెర్లలోని ఫామ్‌హౌస్‌లోనూ ఒకేసారి సోదాలు నిర్వహించారు.

ఆయన ఇంట్లో అనువనువు తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. ఈ సోదాల్లో తిరుపతి నుండి వచ్చిన సిఐడి డిఎస్‌పి వేణు గోపాల్, సిఐలు రాజకుమార్, రంగస్వామి, వన్‌టౌన్ ఎస్ఐలు శివకుమార్, అన్సర్ బాషా పాల్గొన్నారు.

19 నుంచి హైదరాబాద్‌లో హైడ్.ఆర్ట్ ప్రదర్శన

ప్రజాశక్తి - హైదరాబాద్

భారతీయ సాంస్కృతిక వేడుకకు హైదరాబాద్ వేదిక కానుంది. ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు నానక్‌రామ్‌గూడలోని ఈయాన్ హైదరాబాద్‌లో హైడ్.ఆర్ట్ 2025 కళా ప్రదర్శనను ఏర్పాటు చేస్తోన్నట్లు నవనామి ప్రాజెక్ట్స్ ఫౌండర్, ఎండి గద్దె వెంకట నవీన్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 200 మందికి పైగా కళాకారులు తమ కళాఖండాలను ప్రదర్శించనున్నారన్నారు. ఈ షో మాస్టర్‌పీసులు, సమకాలీన కళ, యువ కళాకారుల కృతులు, జానపద సంప్రదాయాలు, క్యూరేటెడ్ గ్యాలరీలు, వర్క్‌షాప్‌లు, ఆర్ట్ సంభాషణల సమ్మేళనాన్ని చూడవచ్చన్నారు. ప్రఖ్యాత క్యూరేటర్ అన్నపూర్ణ మడిపడిగ... హసన్ సహకారంతో దీనిని క్యూరేట్ చేయగా నవనామి గ్రూప్ తమ ముఖ్యమైన ల్యాండ్‌మార్క్ ప్రాపర్టీ ఈయాన్ హైదరాబాద్‌లో వద్ద దీనిని ప్రదర్శిస్తున్నామన్నారు.

సంపాదకీయం

పేరులో ఏముంది?

రాష్ట్రపతి, ప్రధానమంత్రి నుంచి ఆర్‌ఎస్‌ఎస్ సంచాలకుల వరకు సంఘ్ పరివార్ మొత్తం 'వలసవాద మనస్తత్వం' చాటున పేర్ల మార్పిడిలో నిమగ్నమై ఉందిప్పుడు. వాజ్‌పేయి నాయకత్వంలో ప్రారంభమైన 'వలసవాద మనస్తత్వం' నుండి విముక్తి పొందే ప్రక్రియ...మరింత తీవ్రతతో దూకుడుగా సాగుతోంది. ఎనిమిది శతాబ్దాల ఇస్లామిక్ పాలన చిహ్నాలను, పేర్లను, చారిత్రక కట్టడాలను మార్చడం లేదా కూల్చడం ద్వారా భారతదేశ ప్రాచీన సాంస్కృతిక గుర్తింపును పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నట్లు దేశానికి, ప్రజలకు నిరంతరం గుర్తు చేస్తున్నారు. చరిత్రకు వక్రభాష్యాలు చెబుతున్నారు. స్వాతంత్ర్య పోరాట కాలంలో సామ్రాజ్యవాదానికి పూర్తిగా లొంగిపోయి, తరచూ రాజకీయ సర్దుబాట్లు చేసుకున్న శక్తులు.. ఇప్పుడు తమను తాము 'వలస వ్యతిరేక పోరాట నాయకులు'గా చిత్రించుకోవడమంటే చరిత్రను మసకబార్చే ప్రయత్నమే. 'చరిత్రను రాసేవారి చేతిలో సత్యం కూడా వంగిపోతుంది' అన్న ఓ చరిత్రకారుని మాటలు దీనికి చక్కగా సరిపోతాయి.

2016లో ప్రధానమంత్రి అధికారిక నివాసం పేరును 'లోక్ కళ్యాణ్ మార్గ్'గా మార్చారు. అదేవిధంగా, రాజ్‌పథ్ పేరును 'కర్తవ్య పథ్'గా మార్చారు. తాజాగా రాష్ట్ర గవర్నర్ల అధికారిక నివాసాలైన రాజ్ భవన్‌ల పేరును 'లోక్ భవన్'గా మార్చారు. అన్ని రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ మారిపోయాయి. ఇప్పుడు ప్రధాని కార్యాలయానికి 'సేవాతీర్థం' అని నామకరణం చేయనున్నట్లు చెబుతున్నారు. నగరాలు... వీధుల పేర్లు మార్చడం, పాఠ్యపుస్తకాలలో చరిత్రను తిరగరాయడం, శాస్త్రీయ అధ్యయనాలను నకిలీ శాస్త్రాలు, పురాణాలతో భర్తీ చేయడం చూస్తున్నాం. ఈ మార్పులన్నిటికీ ఒక్కటే ట్యాగ్‌లైన్... 'వలసవాద మనస్తత్వం నుంచి విముక్తి'. రాజ్ అనే పదం బ్రిటిష్ కాలంలోని రాజులు, వారి పాలనకు సంబంధించినది. ఇది వలస పాలనను గుర్తు చేస్తున్నా కూడా స్వాతంత్ర్యానంతరం ఈ పేర్లను మార్చలేదు. రాజ్‌భవన్ అంటే.. గవర్నర్ నివాసం అనుకుంటున్నారు కానీ, దాని వెనుక వలసవాద బానిసత్వం వుందని ఇప్పటి తరానికి అసలే తెలియదు. ఈ అర్థం ప్రజాస్వామ్యంలో ఎవరూ పాటించరు. కానీ, గవర్నర్‌లు గీత దాటి పోతున్నారు. రాజ్యాంగాన్ని ధిక్కరిస్తున్నారు. రాజకీయాలు చేస్తున్నారు. గవర్నర్ పేరు మీద ప్రభుత్వం నడిచినా, ఆయనకు ఎలాంటి అధికారాలు వుండవని రాజ్యాంగం స్పష్టం చేస్తున్నది. కానీ, బిజెపి యేతర పార్టీలు అధికారంలో వున్న రాష్ట్రాల్లో గవర్నర్లు... ఆయా రాష్ట్రప్రభుత్వాలకు కంటిలో నలుసుగా, కేంద్రానికి తాబేదార్లుగా మారుతున్నారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో గవర్నర్లు వ్యవహరించే తీరే దీనికి తాజా ఉదాహరణ. వీరి రాజకీయాలన్నీ రాజ్‌భవన్ వేదికగానే నడుస్తున్నాయి. గవర్నర్ల వ్యవస్థ మూలంగా ప్రజాస్వామ్యం, ఫెడరలిజం దెబ్బతింటోంది. మరి పేరు మార్పుల వల్ల ఉపయోగం ఏమిటి?

భారత రాజ్యాంగ ప్రస్తావన 'వుయ్ ది పీపుల్ ఆఫ్ ఇండియా'తో మొదలవుతుంది. లోక్ అనే పదం ప్రజలు సర్వోన్నతులని, ప్రజల భావనలు, ఆకాంక్షలకు చిహ్నమని చెబుతోంది. కానీ, బిజెపి ప్రభుత్వం... దేశ రాజ్యాంగం, సమాఖ్య వ్యవస్థను, సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘంతో సహా అన్ని రాజ్యాంగ వ్యవస్థలను 'ఎన్నికల నిరంకుశత్వం' కిందకు తెచ్చిన ఫాసిస్టు నియంతృత్వాన్ని దేశం చూస్తోంది. మతతత్వ అజెండా అమలులో భాగంగా ఇప్పటికే ఐపిసిని సంస్కృత పదాల్లోకి మార్చింది. హిందుత్వ రాజకీయాలు, దానికి మార్గం సుగమం చేసే భావజాలం ఆయుధాలుగా మారాయి. రాజ్‌భవన్ అయినా, లోక్‌భవన్ అయినా గవర్నర్ల పాత్రలో మార్పేమీ వుండదు. సేవాతీర్థం, లోక్ కళ్యాణ్ మార్గ్, కర్తవ్యపథ్, లోక్‌భవన్ వంటి పేర్లు ప్రజల జీవితాల్లో నిజమైన దేశభక్తిని, కర్తవ్య నిబద్ధతను పెంచుతాయా? రైతుకి న్యాయం, కార్మికుడికి భరోసా, యువతకు ఉద్యోగం, పౌర స్వేచ్ఛ, మైనారిటీకి భద్రత కల్పించలేని నామకరణాలు వలసవాద మనస్తత్వాన్ని తుడవలేవు. 'ఎలుక తోలు తెచ్చి ఏడాది ఉతికినా, నలుపు నలుపే గాని తెలుపు కాదు' అంటాడు వేమన. నిజమైన 'వలస మనస్తత్వ విముక్తి' అంటే, బోర్డులపై పేర్లు మార్చడం కాదు... వ్యవస్థల్లో మార్పు తేవడం. కేవలం పేరు మార్పుతోనే ఈ వ్యవస్థ పునీతం కాదు.

మహనీయుల మాట



ఈ ప్రపంచంలో ఒక వ్యక్తి ప్రత్యేకతను...తన దగ్గర వున్న సంపదను బట్టి కాకుండా...మొత్తం ప్రజల బతుకుల్లో సౌభాగ్యాన్ని నింపడానికి చేసిన కృషిని బట్టి గుర్తించాలి.

- రోబ్ గౌలాండ్,
ఆస్ట్రేలియా కమ్యూనిస్టు పార్టీ సిడ్నీ నగర కమిటీ కార్యదర్శి, రచయిత.

తొలి పాతికేళ్లు : సమాంతర సంకేతాలు

విశ్లేషణ

తెలకపల్లి రవి

నూతన సహస్రాబ్దిలో తొలి ఘట్టంగా-ఇరవై ఒకటో శతాబ్ది తొలి పాతికేళ్లు (2000-2025) మరికొద్ది రోజుల్లో ముగిసిపోతాయి. ప్రపంచానికీ ఈ దేశానికీ, తెలుగు రాష్ట్రాలకూ కూడా చాలా సంచలనాత్మకం, సంఘటనాభరితం ఈ కాలం. కేంద్రంలో వివిధ రాష్ట్రాలలో కాంగ్రెస్, బిజెపి, ప్రాంతీయ పార్టీలూ, వామపక్షాల ఆధ్వర్యంలోని ప్రభుత్వాల పాలనలు, రాజకీయాలు, ఉద్యమాలు, పోరాటాలు, ప్రతిఘటనలూ, వ్యూహ ప్రతివ్యూహాలు చూసింది. శాస్త్ర, సాంకేతిక, కళా సాహిత్య సినీ మీడియా రంగాలలోనూ శరవేగంగా (ఇప్పుడు చెప్పాలంటే ఎ.ఐ వేగంగా) మార్పులు జరిగాయి. ఈ మార్పులూ మలుపులూ కుదుపులూ పూర్తిగా ఊహించనవీ కాదు, ఎవరూ అచ్చంగా అనుకున్నవీ కాదు. అవేవో ఒకవైపునే వున్నట్టు చిత్రించే ప్రయత్నాలు మాత్రం భారీగా జరిగిపోతున్నాయి. 2001 నుంచి పదమూడేళ్లు మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా వున్నారు. తదుపరి పదకొండేళ్ల నుంచి ప్రధానిగా కొనసాగుతున్నారు. ఆయన అప్రతిహత రాజకీయ శక్తినీ ఘటనా ఘటన సమర్థతనూ కీర్తించే శక్తులకూ వ్యక్తులకూ ఆయనను ఆశ్రయించుకుని మనుగడ సాగిద్దామనుకునే కుయుక్తులకూ లోటు లేదు. ఆయన మహాశక్తిని గుర్తించడం వాస్తవికత అని భ్రమపెట్టేవారూ పుట్టుకొచ్చారు. పైగా ఇలాంటివారే మరోవైపున గతంలో వలె ప్రతిఘటించేవారు లేకుండా పోయారని, అందరినీ మోడీ చిత్తు చేశారని కథనాలు, వినిపిస్తూ వుంటారు. సహజంగానే ఈ క్రమంలో వారిని నిరతం నిశితంగా ప్రతిఘటించే సిపిఎంతో సహా కమ్యూనిస్టులపై, ప్రజా ఉద్యమాలపై లౌకిక ప్రజాస్వామిక వాదులపై ఎక్కువ కేంద్రీకరణతోనూ, అవకాశవాదులపై ప్రలోభాలతోనూ ఈ దాడి కొనసాగుతుంటుంది. సోషల్ మీడియా వ్యాప్తి పుణ్యాన ప్రతి క్షణం ప్రగతిశీల భావజాలాన్ని ఉద్యమాల కదలికనూ అపహాస్యం చేసే, కొట్టిపారేసే ధోరణులు ఇందులో భాగమవుతాయి. మోడియాగా పేరు తెచ్చుకున్న బడా మీడియా ఇందుకు వినయపూర్వకమైన వేదికగా మారిపోయిందని క్షణమైనా మర్చిపోకూడదు. ఒకవైపున రాజ్య వ్యవస్థలూ మరోవైపున దాన్ని ఆశ్రయించు కుని ఆకాశానికి ఎగబాకుతున్న అపార వ్యాపార సామ్రాజ్యాలు తమ స్వార్థ ప్రయోజనాలు సాగించుకోవడం, సమాంతర శక్తులను దెబ్బ తీసేందుకు దాడులు చేయడం ఏకకాలంలో జరిగిపోతున్నాయి. వీటన్నిటి మధ్య అంతస్సంబంధాన్ని బుద్ధిజీవులు, ఉద్యమకారులు గ్రహించగలరు గనక నిరుత్సాహపడవలసిన అవసరమే వుండదు. ఈ స్థాయిలో పోరాట శక్తులపై దాడి చేస్తే తప్ప వారి ఆధిపత్య రాజ్యం సాగే పరిస్థితి లేదన్న అంగీకారం కూడా అందులో లేదా? అదానీ వంటి వారు అంతర్జాతీయ బోనులోనే దొరికిపోలేదా? సామాజిక, రాజకీయ, రాజ్యాంగ కోణాలలో ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కూడా విమర్శలకు గురికావలసినంత తీవ్రత గతంలో వుందా?

అన్ని రంగాలలో నిరసన

గొప్ప చరిత్రకారిణి రొమిలా థాపర్ 1978లో జనతా ప్రభుత్వంలో భాగంగా అప్పటి జనసంఘం విద్యాశాఖ తీసుకున్నప్పుడే దాడికి గురైన చరిత్ర పాఠాల రచయిత్రి. 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే నిఖిల్ చక్రవర్తి స్మారకోపన్యాసం చేస్తూ రొమిలా థాపర్ మితవాద, మతవాద పాలనలో రాబోయే పరిణామ క్రమం ఎలా వుండబోయేది సోదాహరణగా చెప్పారు. మళ్లీ 2025 సెప్టెంబరులోనూ ఒక సదస్సులో ఆమెకు ఘనమైన స్వాగతం పలికి సందేశం విన్నారు. మరో గొప్ప చరిత్రకారుడు ఇర్ఫాన్ హబీబ్ కూడా చాలా విరామం తర్వాత ఈ మధ్యనే చారిత్రిక సందేశం వినిపించారు. కనుక పోరాడే శక్తులూ ప్రశ్నించే గొంతులూ ఏదో ఆగిపోయినట్టు చిత్రించడం కుటిలత్వం మాత్రమే.



> **2001 నుంచి పదమూడేళ్లు మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా వున్నారు. తదుపరి పదకొండేళ్ల నుంచి ప్రధానిగా కొనసాగుతున్నారు. ఆయన అప్రతిహత రాజకీయ శక్తినీ ఘటనా ఘటన సమర్థతనూ కీర్తించే శక్తులకూ వ్యక్తులకూ ఆయనను ఆశ్రయించుకుని మనుగడ సాగిద్దామనుకునే కుయుక్తులకూ లోటు లేదు. ఆయన మహాశక్తిని గుర్తించడం వాస్తవికత అని భ్రమపెట్టేవారూ పుట్టుకొచ్చారు. పైగా ఇలాంటివారే మరోవైపున గతంలో వలె ప్రతిఘటించేవారు లేకుండా పోయారని, అందరినీ మోడీ చిత్తు చేశారని కథనాలు, వినిపిస్తూ వుంటారు. సహజంగానే ఈ క్రమంలో వారిని నిరతం నిశితంగా ప్రతిఘటించే సిపిఎంతో సహా కమ్యూనిస్టులపై, ప్రజా ఉద్యమాలపై లౌకిక ప్రజాస్వామిక వాదులపై ఎక్కువ కేంద్రీకరణతోనూ, అవకాశ వాదులపై ప్రలోభాలతోనూ ఈ దాడి కొనసాగుతుంటుంది.**

తిరోగామి ధోరణులపై పోరాటానికి మరిన్ని ఉదాహరణలు చెప్పుకోవచ్చు. సుప్రీంకోర్టు ఆవరణలోనే మాజీ సిజెఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై చెప్పు విసిరిన ఘటన దిగ్భ్రాంతి కలిగించింది. ఆ స్థానంలో వచ్చిన సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ ఇటీవల రోహింగ్యాలను ఉద్దేశించి చేసిన అమానవీయ వ్యాఖ్యలు సరికాదని మాజీ సీనియర్ న్యాయమూర్తులు లేఖ రాయడం ఈ రోజు చూస్తున్నాం. 'సర్' తతంగంపై మాజీ సిఇసి ఎస్.వై ఖురేషి వంటి వారు బాహాటంగా అభ్యంతరాలు చెప్పడం వింటున్నాం. అంతెందుకు? 1972లో పశ్చిమ బెంగాల్‌లో సిపిఎంను గెలవకుండా చేయడం కోసం మొదటిసారి ఎన్నికల ప్రక్రియపై నాటి ఇందిరాగాంధీ ప్రభుత్వం సైన్యాన్ని ప్రయోగించి రిగ్గింగ్‌కు పాల్పడింది. అప్పుడు లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ మాత్రమే గొంతు కలిపారు. తర్వాత చాలా పరిణామాలు, పోరాటాలు జరిగాయి. ఈ రోజున 'సర్' ప్రక్రియ పైన, ఇవిఎంల పైన పాలక పార్టీలే విమర్శలు గుప్పించడం లేదా? 2009లో ఇవిఎంలపై బిజెపి మాజీ ఎం.పి జి.వి.ఎల్.నరసింహారావు పుస్తకం రాస్తే ప్రస్తుత ఎ.పి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుమాట రాశారు! 2019లో 151 స్థానాలతో జగన్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక టిడిపి సుప్రీంకోర్టులో కేసు వేసింది. నితీష్ కుమార్, చంద్రబాబు, కెసిఆర్ వంటి వారు రాజకీయావసరాల కోసం యూ టర్న్‌లు తీసుకోవచ్చునేమోగాని ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం వంటి లక్ష్యాలకు నికరంగా కట్టుబడిన నిజమైన కమ్యూనిస్టులకు, అసలైన లౌకికవాదులకు పిల్లిమొగ్గలు వుండవు. చేగువేరా చిత్రంతో ఊగిపోయిన పవన్ కల్యాణ్ వంటి వారు హిందుత్వ సావర్కర్ చిత్రంతో ప్రత్యక్షం కావడం అధికార రాజకీయాల్లో జరుగుతుందిగానీ ఆశయబద్ధమైన చోట జరగదు. పాతికేళ్ల కిందట ప్రపంచాన్నే ఆకర్షించిన విద్యుత్ ఉద్యమం తెలుగునాట జరిగిందే. ప్రభుత్వాలు మారితే పాలక పార్టీలూ అటూ ఇటూ వాదించవచ్చు గానీ విద్యుత్ ఉద్యమకారులు మాత్రం ఆ మార్గం విడవలేదే?

మోడీ భజన-సడలని సంఘర్షణ

బెర్జిస్ దేశాయ్ అనే ప్రముఖ రచయిత 'మోడీ మిషన్' అంటూ రాసిన పుస్తకాన్ని రూపా సంస్థ ప్రచురించింది. ఇప్పటికీ భారతీయ మేధావులు మోడీ రహస్యం పట్టుకోలేకపోతున్నారని (డీ కోడ్), ఆయన ఎదుగుతూనే పోతున్నారని ఆ రచయిత చేసిన వ్యాఖ్య ప్రముఖంగా ప్రచారం పొందుతోంది (రాంగోపాల్‌వర్మ రాజకీయ చిత్రాలు తీసినట్టు గుర్రప్పందేలపైన, నేర పరిశోధనలపైన రాసే రచయిత ఈ బెర్జిస్). వామపక్ష భావాలు గలవారు గనకనే మోడీ అంటే ఈ మేధావులకు ఎలర్జీ అని ఆయన భక్తులు మొదట్లో ఆక్షేపించేవారు. మరోవైపున వారు నెహ్రూ, ఇందిరల ప్రాపకం వల్లనే చలామణి కాగలిగారని తిట్టిపోస్తూ వచ్చారు. ఇప్పటికే బడా మీడియా నుంచి లోకల్ ఆర్ణబ్ గోస్వాముల వరకూ ఇవే శాపనార్థాలు గుప్పిస్తూనే వున్నారు. నిజంగా చరిత్రలో ఐన్‌స్టీన్, రవీంద్రనాథ్ టాగూర్, పికాసో, చార్లీ చాప్లిన్ నుంచి శ్రీశ్రీ వరకూ నాడూ నేడూ వామపక్ష భావుకులు శాంతి కాముకులు కావడం గర్వకారణమే. అయితే రాజ్యాంగం కల్పించిన ఇలాంటి భావప్రకటనా స్వేచ్ఛను కాలరాస్తూ విమర్శకులను నానా నిర్బంధాలకు గురిచేస్తుంటే చాలామంది ప్రముఖులు సుప్రీంకోర్టులో పోరాడుతున్నారేగానీ చేతులెత్తి సాగిలబడిన ఉదాహరణే లేదు. మరీ వికృత దాడులకు, వేధింపులకు గురవుతున్న మహిళలు కూడా చాలామంది వున్నారు. పోలీసుల, ప్రభుత్వాల ఆటంకాల వల్ల కొందరు అనుకున్న మేరకు చేయలేకపోవచ్చుగాని దారి మార్చలేదు. మతాన్ని రాజకీయాలతో మిళితం చేసి హిందూ వ్యతిరేకులుగా ముద్రలు వేసే ఈ దాడుల ఫలితంగా కొందరు తటస్థులమని ప్రకటించుకోవలసిన పరిస్థితీ రావచ్చు. రాజ్‌దీప్ సర్దేశాయ్ వంటి వారి తంటాలు చూస్తున్నదే. అయినా ప్రజాస్వామ్య స్ఫూర్తి వున్నవారెప్పుడూ వివక్షనూ విద్వేషాన్ని సమర్థించబోరని ఈ కాలంలో రుజువైంది.

మారిన మాయోపాయాలు

గతానికి ఇప్పటికీ కీలకమైన తేడా సామాజికావరణంలోనూ ప్రజావరణంలోనూ వచ్చింది. ప్రజావరణం (పబ్లిక్ స్పేస్) కుదించివేయబడింది. రచనలు, సెమినార్లు, చర్చలతో అవగాహనా బలంబట్టి గాక లైకులు, షేర్లు, వ్యూలు, రెవెన్యూలనే అమితంగా ప్రచారంలో పెట్టే ఈ వ్యవస్థ ఫలితంగా కొత్త రకం ఇన్‌ఫ్లుయన్సర్లు, మాస్ ఎంటర్‌టైనర్లు పుట్టుకొచ్చారు. వీరు విధానపరమైన అంశాల జోలికి పోకుండా పైపై మసాలాలతో మాయ చేస్తుంటారు. దీనివల్ల ప్రజా ప్రచార కథనాలు (పబ్లిక్ నేరేటివ్స్) హైజాక్ చేయబడుతున్నాయి. బడా మీడియా సంస్థల హస్తగతంతో పాటు సోషల్ మీడియాలోనూ గొలుసుకట్టు వ్యవస్థలూ, స్వంత సైన్యాలు ఏర్పాటు చేసుకున్న పాలక వర్గాలు చైతన్యవంతమైన గొంతులనూ ఐచ్ఛిక స్వరాలనూ కత్తిరించడానికి వెనకాడవు. గతంలో 'అంగీకార సృష్టి' అన్న నామ్‌చామ్‌స్కీ సిద్ధాంతం పని చేస్తే ఇప్పుడు వివిధ మీడియా ప్లాట్‌ఫాంలలో కూడా ఆల్గోరిథమ్స్ అనే వీక్షకుల లెక్కలు, ఆకర్షణలూ ఆ పనిచేస్తాయి. తాజాగా రష్యా అధ్యక్షుడు పుతిన్ పర్యటననే తీసుకుంటే ఆయన రాకకు ముందే మూడు పశ్చిమ దేశాల రాయబారులు కూడబలుక్కుని రాసిన ఒకే వ్యాసాన్ని పెద్ద పత్రికలు ప్రచురించాయి. దీనిపై ప్రభుత్వమే అసంతృప్తి వ్యక్తం చేయాల్సి వచ్చింది. కానీ కేంద్రం కూడా ప్రతిపక్ష నాయకులను కలుసుకోనివ్వకుండా అడ్డుపడింది. ఆయనతో అధికారిక విందుకు ప్రతిపక్ష నేతలనుగాక తమకు ఇష్టుడైన శశిథరూర్‌ను ఆహ్వానించింది. తమను తెలివిగా, పరోక్షంగా మోసేవాళ్లను ఇలా అన్నిచోట్లా పెంచుతున్నారు. ఇటీవల ఇదే పేజీలో చెప్పుకున్నట్టు సంఘ్ పరివార్ వివిధ రకాల సంస్థల ద్వారా అనేక ప్రలోభాలతో సర్కారీ స్వరాలను పెంచుతూ స్వతంత్ర విమర్శకులను నిర్బంధానికి గురిచేస్తున్నది. అయినా సరే అటు ఉద్యమకారులు ఇటు బుద్ధిజీవులు గట్టిగా పోరాడుతూనే వున్నారు. ఇటీవలనే ఖమ్మం జిల్లాలో రైతు నాయకుడు సామినేని రామారావు హత్య, నెల్లూరులో యువజన నాయకుడు పెంచలయ్య హత్య చూశాక ఎవరు దుష్టశక్తులను ఎదిరిస్తున్నదీ స్పష్టమైంది. దేశంలో మళ్లీ రైతాంగ ఉద్యమాలు, లేబర్ కోడ్‌లపై పోరాటం చూస్తూనే వున్నాం. పిపిపిపి ల తతంగంపై పోరాటంగానీ, డేటా సెంటర్‌లతో సహా కార్పొరేట్ భూ పందేరాలుగానీ తీవ్ర నిరసననే ఎదుర్కొనక తప్పడం లేదు. ఇండిగో విమానాలు ఒక్కసారిగా నిలిచిపోతే నిజాలు చాలా తెలిశాయి. ట్రంప్ గెలిచిన చోటనే మమ్దానీ కూడా విజయం సాధించడం చూశాం. ఇవన్నీ యాదృచ్ఛికమైనవీ కాదు. పరస్పరం సంబంధం లేనివీ కాదు. చరిత్రలో విప్లవం పునరుద్ధరణ, పున:ఘర్షణలు నిరంతరం కొనసాగుతూనే వుంటాయి. ఈ పాతికేళ్ల పరిణామాలు చెబుతున్నదీ అదే.

> **ఇటీవలనే ఖమ్మం జిల్లాలో రైతు నాయకుడు సామినేని రామారావు హత్య, నెల్లూరులో యువజన నాయకుడు పెంచలయ్య హత్య చూశాక ఎవరు దుష్టశక్తులను ఎదిరిస్తున్నదీ స్పష్టమైంది. దేశంలో మళ్లీ రైతాంగ ఉద్యమాలు, లేబర్ కోడ్‌లపై పోరాటం చూస్తూనే వున్నాం. పిపిపిపి ల తతంగంపై పోరాటంగానీ, డేటా సెంటర్‌లతో సహా కార్పొరేట్ భూ పందేరాలుగానీ తీవ్ర నిరసననే ఎదుర్కొనక తప్పడం లేదు. ఇండిగో విమానాలు ఒక్కసారిగా నిలిచిపోతే నిజాలు చాలా తెలిశాయి. ట్రంప్ గెలిచిన చోటనే మమ్దానీ కూడా విజయం సాధించడం చూశాం. ఇవన్నీ యాదృచ్ఛికమైనవీ కాదు. పరస్పరం సంబంధం లేనివీ కాదు. చరిత్రలో విప్లవం పునరుద్ధరణ, పున:ఘర్షణలు నిరంతరం కొనసాగుతూనే వుంటాయి. ఈ పాతికేళ్ల పరిణామాలు చెబుతున్నదీ అదే.**

★

గంజాయిని నియంత్రించలేరా?

గత కొద్ది కాలంగా పత్రికల్లో గంజాయి సంబంధిత వార్తలు, కథనాలు లేని రోజు లేదు! ఒకవైపు గంజాయి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతుంటే మరోవైపు బాధిత కుటుంబాలు వీధిన పడుతున్నాయి.

2021 నాటికి ఆంధ్ర ఒడిశా సరిహద్దు (ఎఒబి)లో రెండు వేల కోట్ల విలువైన గంజాయి పది వేల ఎకరాల్లో సాగవుతుందని పోలీసులు గుర్తించారు. ఆరు వేల ఎకరాల్లో ఆంధ్రప్రదేశ్ భూభాగంలోనూ, నాలుగు వేల ఎకరాల్లో ఒడిశా భూభాగంలోనూ గంజాయి సాగవుతుందని అంచనా వేశారు. గంజాయి సాగుకు ప్రత్యామ్నాయంగా అధిక ఆదాయం వచ్చే ఉద్యాన పంటల వైపు ఆదివాసులకు అలవాటు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. దేశంలో గంజాయి వినియోగంలో 12వ స్థానంలోవున్న రాష్ట్రంలో నియంత్రణపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని వివరించారు. శాటిలైట్ ఇమేజ్, డ్రోన్లు ఉపయోగించి గంజాయి పంటను ధ్వంసం చేయాలని నిర్ణయమైతే ప్రభుత్వం తీసుకుందిగానీ చర్యలకు వెళ్లలేదు. ఫలితంగా గంజాయి సాగు, రవాణా, వినియోగం తగ్గడంలేదు. 2018 డిసెంబరులో గంజాయి సాగు నిర్మూలనకు సంయుక్తంగా సిఫార్సు చేసిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, పోలీసు, వ్యవసాయ, ఉద్యాన, అటవీ, రెవెన్యూ శాఖాధికారులు ఆదివాసీలకు అధిక ఆదాయం వచ్చే పంటలను ప్రోత్సహించి, మార్కెట్ సౌకర్యం కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటే గంజాయి సాగు నిర్మూలించవచ్చని ప్రభుత్వానికి నివేదించారు. ఆదాయం వచ్చే వాణిజ్య పంటల వైపు ఆదివాసీలు ఆలోచించేలా అవగాహన కల్పించాలని సూచించారు. వివిధ రాష్ట్రాల్లో పండుతున్న స్ట్రాబెర్రీ, యాపిల్, డ్రాగన్‌ఫ్రూట్ సాగుకు ఏజెన్సీ నేల, ఉష్ణోగ్రతలు సానుకూలంగా వున్నాయని శాస్త్రవేత్తలు సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు సాగునీటి వసతి, విత్తన పంపిణీ, మొక్కలు సరఫరా, పంట పెట్టుబడులకు ఆర్థిక సహాయం నిమిత్తం రూ.400 కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదించారు. గిరిజనుల అటవీ, వ్యవసాయోత్పత్తులు తేనె, చింతపండు, పసుపు, అల్లం, కాఫీ, రెడ్ క్యాబేజీ వంటి పంటలను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించేలా గిరిజన సహకార సంస్థ (జిసిసి) పాత్రను పెంచి, నిధులు సమకూర్చి బలోపేతం చేయాలని పేర్కొన్నారు. వ్యాపారులు, మధ్యవర్తుల బెడదలేకుండా జిసిసి, ఐటిడిఎతో ఆదివాసుల పంటలు కొనుగోలు చేసే వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా గిరిజనుల తమ ఆదాయాల్లో వచ్చిన స్థిరత్వంతో గంజాయి సాగుకు దూరమవుతారని భావించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఐటిడిఎ కూడా ప్రణాళిక రూపొందించింది. ప్రత్యామ్నాయ పంటలు ప్రోత్సాహానికి వివిధ శాఖాధికారులు, ఐటిడిఎ నివేదికలను చంద్రబాబు ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని ప్రత్యామ్నాయ వాణిజ్య పంటల సాగు, అటవీ వ్యవసాయోత్పత్తులు కొనుగోలుకు ఐటిడిఎ, జిసిసిని బలోపేతం చేసివుంటే గంజాయి ఇంతగా విస్తరించేది కాదు.

గంజాయి సాగు తగ్గిందని చెబుతున్నా, ప్యాకెట్లలోనూ, ద్రవ రూపంలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న గంజాయి గణనీయంగా బయటపడుతోంది. చెక్‌పోస్టులు పెంచినా, ప్యాకెట్లలోని గంజాయిని పసిగట్టే కుక్కలను పోలీసులు రంగంలోకి దించినా రవాణా ఆగడంలేదు. 2024లో దేశంలో 5,33,903 కేజీల గంజాయిని పోలీసులు సీజ్ చేశారు. ఇందులో ఒడిశాలో 1,43,761 కేజీలు, మహారాష్ట్రలో 55,351 కేజీలు, ఆంధ్రప్రదేశ్‌లో 53,983 కేజీల గంజాయి వుంది. పోలీసులు పట్టుకున్న గంజాయిలో మూడో స్థానంలో రాష్ట్రం వుంది. నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) ప్రకారం 2018లో దేశ వ్యాపితంగా 63,137, 2019లో 72,721, 2020లో 59,806, 2021లో 78,331, 2022లో 1,15,236 కేసులు నమోదయ్యాయి. గంజాయి కేసులు నమోదు రాష్ట్రంలో 2018లో 534, 2019లో 717, 2020లో 866, 2021లో 1635, 2022లో 1391 జరిగాయి. ఈ గణాంకాలను గమనిస్తే గంజాయి నియంత్రణ, నిర్మూలనకు తీసుకున్న ప్రభుత్వ చర్యలు నామమాత్రంగానే వున్నాయని అర్థమవుతుంది. గంజాయి, మత్తు పదార్థాల సరఫరా, రవాణా నియంత్రణ, నేరాల విచారణకు ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూఫ్ ఫర్ లా ఎన్‌ఫోర్సుమెంట్ (ఈగల్) ఏర్పాటు, గంజాయి, మాదక ద్రవ్యాలు, నాటు సారా నియంత్రణకు రాష్ట్ర హోంశాఖ మంత్రి అధ్యక్షతన 2024 నవంబరులో ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉప సంఘం ఆశించిన ఫలితాలు ఇచ్చినట్లు కనబడ్డంలేదు. ప్రభుత్వ చర్యలు గంజాయిని నిర్మూలించి, మత్తుకు యువత బానిస కాకూడదన్న చిత్తశుద్ధితో పని చేస్తే నెల్లూరులో సిపిఎం నాయకుడు పెంచలయ్య గంజాయి మాఫియా చేతిలో హత్యకు గురయ్యేవాడు కాదు. అనేక కుటుంబాలు ఇలా వీధిన పడేవి కావు. పెంచలయ్య హత్య కేసులో ప్రధాన నిందితురాలు మహిళ కావడం, ఆమె ఇంట్లో రవాణాకు సిద్ధంగా వుంచిన 25 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్న తీరు చూస్తే, ఆమె, ఆ మాఫియా వెనుక ఏ రాజకీయ నాయకులు, పోలీసులు సహకారం లేకుండా వుంటుందని అనుకోలేం. ప్రభుత్వం ఇప్పటికైనా గంజాయి సాగు, రవాణా, వినియోగం నియంత్రణపై చర్యలు చేపట్టాలి.

- గుల్ల కాంతారావు, సెల్ : 94900 99487

సెటైర్

అంతా...పెద్దాయన దయ!



"ఏమోయ్ ఎక్కడున్నావ్?" అంటూ ఇంట్లోకి వచ్చాడు కమలేష్.

"ఏమిటండీ?" అంటూ వంటింట్లోంచి హాల్లోకి వచ్చింది వందన.

"ఇదిగో స్వీటు తీసుకో' అంటూ తను తీసుకొచ్చిన స్వీట్ భార్య నోట్లో పెట్టాడు కమలేష్.

"అంతగా ఆనందపడుతున్నారు! ఏమిటీ విశేషం?" అడిగింది వందన స్వీటు నములుతూ.

"అమెరికా నుండి నా కొడుకు ఈ నెల లక్ష రూపాయలు పంపాడు!" అంతా మన పెద్దాయన దయ!" అన్నాడు కమలేష్ అరమోడ్పు కనులతో.

"ఏం మాట్లాడుతున్నారండీ! మన అబ్బాయి కష్టపడి సంపాదించి అమెరికా నుండి డబ్బులు పంపిస్తే పెద్దాయన దయ అంటారేమిటి?" చిరాగ్గా అన్నది వందన.

"ఓసి పిచ్చి మొఖమా! ఇంతకు ముందు డెబ్బై వేలు మాత్రమే మన అబ్బాయి పంపించాడు. ఈసారి లక్ష రూపాయలు ఎలా పంపించాడనుకున్నావు! మన అబ్బాయికి జీతం కూడా పెరగలేదు. ఇదంతా పెద్దాయన దయ!" అన్నాడు మళ్ళీ కమలేష్ కళ్ళు మూసుకుంటూ.

"అసలు విషయం ఏమిటో నాన్చకుండా చెప్పండి!" అన్నది వందన విసుగ్గా.

"మన రూపాయి విలువ పడిపోయింది కదా! అందుకే అబ్బాయి ఇంతకు ముందు పంపినన్ని డాలర్లే పంపినా మన రూపాయిలు ఎక్కువ వచ్చాయి! గత డెబ్బై వేలతో పోల్చుకుంటే ఇప్పుడు ముప్పై వేలు అధికంగా వచ్చాయి. అందుకే ఇదంతా పెద్దాయన దయ అంటున్నాను" అన్నాడు తన్మయంగా కమలేష్.

"ఓహో మీకు అలా అర్థమయ్యిందా! సరే డబ్బులున్నాయి కదా! షాపింగ్‌కి తీసుకెళ్ళండి!" అన్నది వందన.

"దానికేం భాగ్యం పద వెళదాం!" అంటూ కమలేష్ బండి తీశాడు.

"మన ఇంట్లో టీవీ, ఫ్రిజ్ చాలా పాతవైపోయాయి. మళ్ళీ మళ్ళీ రిపేర్లు వస్తున్నాయి. కొత్తవి తీసుకుందాం!" అన్నది వందన.

ఇద్దరూ షాపులోకి వెళ్ళారు. ఒక టీవీ సెలక్ట్ చేశారు. యాభై వేలు చెప్పాడు షాపు ఓనరు. అదిరిపడ్డాడు కమలేష్.

"అదేంటయ్యా! ఇదే టీవీ రెండు నెలల కింద అడిగితే నలభై వేలే అన్నావు. రెండు నెలల్లో పదివేలు పెంచావేంటి?" అడిగాడు కమలేష్.

"అంతా పెద్దాయన దయ సార్!" అంటూ షాపులోని పెద్దాయన ఫోటో వైపు చూపాడు ఓనరు.

"ఏమండి ఫ్రిజ్ ఇదే తీసుకుందాం! బాగుంది!" అంటూ ఫ్రిజ్ వద్దకు పిలిచింది వందన. అటువైపు వెళ్ళాడు కమలేష్.

"దీని ధర ఎంత? అడిగాడు మల్లేష్ తన వెనకే వచ్చిన షాపు ఓనర్‌తో.

"ఈ ఫ్రిజ్ నలభై వేలు సార్! ఇంతకు ముందు నెలలో దీని ధర ముప్పై వేలు సార్! ఇది కూడా పెద్దాయన దయే సార్!" అడక్కుండానే చెప్పేశాడు షాపు ఓనర్!.

"ఏమయ్యా మీరు ఇష్టం వచ్చినట్లు ధరలు పెంచి దానికి పెద్దాయన పేరు చెబుతారా? ప్రభుత్వం జిఎస్‌టి తగ్గించినా, మీరు ధరలు ఏమీ తగ్గించలేదు. పైగా పెంచి అమ్ముతున్నారు. మీరు పాకిస్తాన్ ఏజెంట్లు! మీ మీద ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తాను!" అన్నాడు కమలేష్ ఆవేశంగా.

"కోపం తెచ్చుకోకండి సార్! నేను పక్కా లోకల్. మీ పక్క గల్లీలోనే ఉంటాను. మీ అబ్బాయి అమెరికాలో ఉన్నాడు. అతను బాగా సంపాదిస్తున్నాడు కద సార్!" అన్నాడు షాపు ఓనర్.

"ఏం మాట్లాడుతున్నావయ్యా! మా అబ్బాయి బాగా సంపాదిస్తుంటే అదంతా నీకు ధారపోయాలా? ఇష్టం వచ్చినట్లు ధరలు పెంచి, ఎదవ లాజిక్కులు మాట్లాడుతున్నావా?" అన్నాడు కమలేష్ మరింత కోపంగా.

"సార్! మన రూపాయి విలువ తగ్గింది కదా! అందుకే మీ అబ్బాయి సంపాదించే డాలర్లకి ఎక్కువ రూపాయలు వస్తాయి కదా! అని మీ అబ్బాయి బాగా సంపాదిస్తున్నాడని అన్నాను!" అన్నాడు ఓనర్.

"నీ షాపులోని సరుకుల ధరలు పెంచి, దానితో మా అబ్బాయి సంపాదనకు ఎందుకు లింక్ పెడతావు!" అంటూ ఓనర్ మీదికి దూసుకెళ్ళబోయాడు కమలేష్. వందన చెయ్యి పట్టుకుని ఆపింది.

"సార్! మీరు అర్థం చేసుకుంటారని అనుకున్నాను. మీరు కొంటున్న టీవీ, ఫ్రిజ్ అన్నీ మనం దిగుమతి చేసుకున్నవే సార్. మరికొన్నింటికి విడి భాగాలు దిగుమతి చేసుకొని ఇండియాలో అసెంబుల్ చేసుకొని మేకిన్ ఇండియా అంటున్నాము. మనం విదేశాల నుండి దిగుమతి చేసుకునే ఏ సరుకులైనా డాలర్లే చెల్లించాలి! మన రూపాయి విలువ పడిపోయినందువల్ల ఎక్కువ రూపాయిలు చెల్లించి, డాలర్లు కొని ఆ డాలర్లతో సరుకులు దిగుమతి చేసుకోవాలి! మీ అబ్బాయికి వచ్చే డాలర్లకి మన రూపాయి విలువ తగ్గినందున ఎక్కువ రూపాయలు ఇవ్వాల్సి వస్తుంది. ఇంత చిన్న లాజిక్ ఎలా మిస్సయ్యారు సార్!" అన్నాడు షాపు ఓనర్.

జేబుల్లో చేతులు పెట్టుకుని మౌనంగా నిలబడిపోయాడు కమలేష్. రూపాయి విలువ తగ్గితే దేశానికి మంచిదంటూ వాట్సప్‌లో వస్తుంటే నిజమేననుకున్నాడు! దేశానికి ఏది మంచిదైతే అదే పెద్దాయన అమలు చేస్తాడని, అందుకే రూపాయి విలువ తగ్గుతున్నా పట్టించుకోవటంలేదని, ఆయన దేశానికి చౌకీదార్ గాబట్టి దేశాన్ని కాపాడతాడని గట్టిగా విశ్వసించాడు. పెద్దాయనకు వ్యతిరేకంగా మాట్లాడే వాళ్ళంతా దేశద్రోహులు అని, వారిపై కసి పెంచుకున్నాడు.

ఇంతలో ఎవరో తమ మొబైల్ ఫోన్‌ను టీవీకి కనెక్ట్ చేశారు.

"శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్ రూపాయి విలువ పడిపోవటం లేదు. కాని హిందుస్తాన్ రూపాయి విలువ మాత్రమే ఎందుకు పడిపోతుంది. ప్రధాని మంత్రీజీ...సమాధానం చెప్పండి నాకు!" అని ప్రధాన మంత్రిని టీవీలో ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ నిలదీస్తున్నారు!

- ఉషాకిరణ్

న్యూయార్క్ మహిళపై కేసు

న్యూయార్క్ : భారత్ నుండి కెనడా సరిహద్దుల మీదుగా అమెరికాకు అనధికారికంగా ముగ్గురు భారతీయులు, ఒక కెనడా వాసిని తరలిస్తున్న న్యూయార్క్‌కి చెందిన మహిళ స్టాసీ టేలర్ (42)పై ఈ ఏడాది సెప్టెంబర్‌లో కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. అభియోగాలు రుజువైతే ఆమెకు ఐదేళ్లు కనీస జైలు శిక్ష పడుతుంది.

నెట్‌ఫ్లిక్స్ చేతికి 'వార్నర్ బ్రదర్స్'

- రూ.6.48 లక్షల కోట్లకు కుదిరిన మెగా ఒప్పందం
- సబ్‌స్క్రిప్షన్ ఛార్జీలు పెరిగే అవకాశం

వాషింగ్టన్ : ప్రముఖ సినీ దిగ్గజ సంస్థ వార్నర్ బ్రదర్స్‌ను నెట్‌ఫ్లిక్స్ కొనుగోలు చేయనుంది. ఈ మేరకు రెండు సంస్థల మధ్య ఒప్పందం కుదిరిందని నెట్‌ఫ్లిక్స్ ప్రకటించింది. వార్నర్ బ్రదర్స్ డిస్కవరీకి చెందిన టివి, ఫిల్మ్ స్టూడియోలతో పాటు స్ట్రీమింగ్ విభాగాన్ని రూ.6.48 లక్షల కోట్లకు (72 బిలియన్ డాలర్లు) కొనుగోలు చేస్తున్నామని నెట్‌ఫ్లిక్స్ సంస్థ తెలిపింది. ఇది హాలీవుడ్ వ్యాపార సామ్రాజ్యంలో పెద్ద డీల్‌గా నిలిచిపోతుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ఒప్పందంతో వార్నర్ బ్రదర్స్ సంస్థ రెండు విభాగాలుగా విడిపోనుంది. సిఎన్ఎన్, డిస్కవరీ, టిబిఎస్, టిఎన్‌టి వంటి సంస్థలు డిస్కవరీ గ్లోబల్ కింద పనిచేయనున్నాయి. వార్నర్ బ్రదర్స్ కోసం కామ్‌కాస్ట్, పారామౌంట్ వంటి అగ్రశ్రేణి సంస్థలు పోటీపడ్డాయి. చివరకు నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది. దీంతో వచ్చే దశాబ్ద కాలంలో తమ వ్యాపారం వేగవంతం అవుతుందని, అనేక ఆఫర్లను ప్రకటించడానికి దోహదపడుతుందని, ప్రేక్షకులకు నచ్చేలా కంటెంట్‌ను అందిస్తామని నెట్‌ఫ్లిక్స్ కో-చీఫ్ ఎగ్జిక్యూటివ్ టెడ్ సరండోస్ మీడియాకు తెలిపారు. ప్రపంచంలో ఎక్కువ మంది వీక్షకులు కలిగిన నెట్‌ఫ్లిక్స్ ఈ ఒప్పందంతో హెచ్‌బిఒ, హెచ్‌బిఒ మ్యాక్స్‌కు సంబంధించిన వీక్షకులు కూడా తోడుకానున్నారు. దీంతో సబ్‌స్క్రిప్షన్ ఛార్జీలు పెరిగిపోతాయని, ఈ రంగంలో నెట్‌ఫ్లిక్స్ గుత్తాధిపత్యం వహిస్తుందని పలువురు భావిస్తున్నారు.

డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు సిపిఎం నివాళి

- వర్ధంతి సందర్భంగా సిపిఎం ఘన నివాళి

న్యూఢిల్లీ : భారత రాజ్యాంగ నిర్మాణంలో కీలకపాత్ర వహించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పోరాటం స్ఫూర్తిదాయకమని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కొనియాడింది. కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన ధీరుడని డాక్టర్ అంబేద్కర్ అని సోషల్ మీడియాలో పేర్కొంది. సామాజిక న్యాయం, మహిళా సాధికారిత, కార్మిక సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేసిన గొప్ప వ్యక్తి అని తెలిపింది. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా ఆయనకు సిపిఎం శ్రేణులు దేశవ్యాప్తంగా ఘనంగా నివాళు లర్పించాయి. ప్రస్తుతం బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ పెత్తందారుల ఆధీనంలో రాజ్యాంగాన్ని, ప్రజల హక్కులను తీవ్రంగా దెబ్బతీస్తున్న క్లిష్ట సమయంలో డాక్టర్ అంబేద్కర్ ఆశయాలను కాపాడుకోవాలని సిపిఎం పిలుపునిచ్చింది.

గంటేడకు తాపీ ధర్మారావు పురస్కారం

ప్రజాశక్తి- పార్వతీపురం

గుంటూరుకు చెందిన బండిఖల్లు ఫౌండేషన్ ప్రదానం చేయనున్న తాపీ ధర్మారావు పురస్కారానికి పార్వతీపురం పట్టణానికి చెందిన కవి, రచయిత గంటేడ గౌరు నాయుడు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన ఆదివారం గుంటూరులోని కొరటాల సమావేశ మందిరంలో జరగనున్న కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. బండిఖల్లు ఫౌండేషన్ విశాఖ సంస్కృతి మాసపత్రిక సౌజన్యంతో 9వ జాతీయ స్థాయి కథల పోటీలు నిర్వహించింది. విజేతలకు అవార్డుల ప్రదానోత్సవంలో గౌరునాయుడుకు తాపీ ధర్మారావు పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు.

నేషనల్ హెరాల్డ్ కేసులో డికె శివకుమార్‌కు నోటీసులు

న్యూఢిల్లీ : నేషనల్ హెరాల్డ్ కేసులో కర్ణాటక డిప్యూటీ సిఎం డికె శివకుమార్, ఆయన సోదరుడు ఎంపి డికె సురేష్‌కు ఢిల్లీ పోలీసుల ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ నోటీసులు జారీ చేసింది. యంగ్ ఇండియన్ సంస్థకు ఇచ్చిన రూ.2.5 కోట్ల విరాళాల మూలం, లావాదేవీ వివరాలు, సంబంధిత డాక్యుమెంట్లు ఈ నెల 19లోపు సమర్పించాల ని ఆదేశించింది. విరాళం ఎందుకు ఇచ్చారు, ఎవరి సూచనతో ఇచ్చారు, సోనియా గాంధీ - రాహుల్ గాంధీతో చర్చ జరిగిందా వంటి ప్రశ్నలతో నోటీసుల్లో వివరణ కోరారు.

కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి

సుజల స్రవంతి భూసేకరణ త్వరగా పూర్తి

ప్రజాశక్తి- విజయనగరం కోట, కంటోన్మెంట్

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కోసం విజయనగరం జిల్లాలో మొత్తం 9,630 ఎకరాలు భూమి సేకరణ చేయాల్సి ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి తెలిపారు. దీనిలో కాలువల నిర్మాణం కోసమే 4,495 ఎకరాలు అవసరం ఉంటుందన్నారు. తక్షణ ప్రాధాన్యతగా 339.68 ఎకరాలను సేకరించాల్సి ఉందని తెలిపారు. వెంటనే రైతులతో సమావేశాలను నిర్వహించి ప్రక్రియను ఉత్తరాంధ్ర సుజల స్రవంతి భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు భూసేకరణ, నిర్మాణానికి సంబంధించి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులతో శనివారం ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన భూసేకరణ, పూర్తి చేయాల్సిన ప్రక్రియలపై గ్రామాలవారీగా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రూ.17,050 కోట్ల అంచనా వ్యయంతో ఉత్తరాంధ్రలో సుమారు ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోనే సుమారు 3.865 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని రెండు దశలుగా చేపట్టనున్నట్లు తెలిపారు. రెండో దశలోని మొత్తం ఆరు ప్యాకేజీల్లో మొదటి ప్యాకేజీలో కొంత భాగంతోబాటు, 2, 4, 5, 6 ప్యాకేజీలు విజయనగరంలో ఉన్నాయని వివరించారు. సమావేశంలో ప్రాజెక్టు ఇఇ ఉమేష్‌కుమార్, భూసేకరణ విభాగం ఎస్‌డిసి కళావతి, చీపురుపల్లి ఆర్‌డిఒ సత్యవాణి, పలువురు డిఇలు, తాహశీల్దార్లు, డిటిలు పాల్గొన్నారు.

విశాఖలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

పోరుబాటలో ఇ-సేవ ఉద్యోగులు

- గత ప్రభుత్వంలో తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్
- నేటి నుంచి పునర్జీవన సైకిల్ యాత్ర
- 16 నుంచి విజయవాడలో దీక్షలు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

గత ప్రభుత్వంలో ఉద్యోగాలు కోల్పోయిన 605 మంది ఇ (మీ) సేవ ఉద్యోగులకు ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వ హయాంలోనూ న్యాయం దక్కకపోవడంతో వారంతా పోరుబాటకు సిద్ధమయ్యారు. ఎపి ఇ (మీ) సేవ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఈ నెల ఏడు నుంచి ఆధ్యాత్మిక ఆలయం (తిరుపతి) నుండి అమరావతిలోని పరిపాలన ఆలయం (సచివాలయం) వరకు పునర్జీవన సైకిల్ యాత్ర చేపట్టనున్నారు. ఈ నెల 16, 17, 18, 19 తేదీల్లో విజయవాడలో దీక్షలు నిర్వహించనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్న సమయంలో 2003లో ప్రజలకు అన్ని రకాల సర్వీసులు ఒకే చోట అందించాలనే ఉద్దేశంతో ఇ (మీ) సేవ వ్యవస్థను శ్రీకారం చుట్టారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లోని 170 గవర్నమెంట్ అర్బన్ ఇ-సేవా కేంద్రాలలో 605 మంది ఉద్యోగులు విధులు నిర్వహించేవారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య అనుసంధానకర్తగా ఉంటూ ప్రతి రోజూ దాదాపు 467 సర్వీసులు అందించేవారు. ప్రభుత్వ శాఖలకు ఏడాదికి రూ.4 వేల కోట్లు ఆదాయాన్ని, యూజర్ ఛార్జెస్ రూపంలో మరో రూ.30 కోట్లు ఆదాయాన్ని సమకూర్చేవారు. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ అర్బన్ ఇ-సేవ కేంద్రాలను మూసివేసి అందులో 18 సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్న 605 మంది ఉద్యోగులను ఉపాధికి దూరం చేసింది. వీరంతా ఆందోళనలు చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకుంటా నిరంకుశంగా వ్యవహరించింది. ఈ నేపథ్యంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు యువగళం పాదయాత్రను నారా లోకేష్ చేపట్టారు. వైసిపి ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని ఇ-సేవ ఉద్యోగులు ఆయనకు వివరించారు. వినతిపత్రాలు అందించారు. లోకేష్ స్పందిస్తూ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇ (మీ) సేవ ఉద్యోగులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. గెలిచిన అనంతరం ఆ హామీని టిడిపి కూటమి ప్రభుత్వం, నారా లోకేష్ విస్మరించడంతో తమ పరిస్థితిని మరొకసారి సిఎం చంద్రబాబుకు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు, మంత్రి నారా లోకేష్‌కు చెప్పుకునేందుకు ఇ (మీ) సేవ ఉద్యోగులు ఉద్యమ కార్యాచరణ రూపొందించారు.

విశాఖలో పోస్టర్ ఆవిష్కరణ

గత వైసిపి ప్రభుత్వంలో ఉద్యోగాలు కోల్పోయిన 605 మంది ఉద్యోగులకు యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలంటూ ఎపి ఇ (మీ) సేవ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (సిఐటియు) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన శనివారం విశాఖలోని జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో పునర్జీవన సైకిల్ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ బాధను గుర్తించి 605 మందికి వెంటనే ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.మణి, జిల్లా కార్యదర్శి రాజాన సింహాచలం, నాయకులు ఎం.అనిల్ కుమార్, రాజబాబు, రాము, అరుణ కుమారి, శివకృష్ణ, ఆశా రాణి పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ)
అస్సెట్ రికవరి బ్రాంచ్ (79170), విజయవాడ, 4వ ఫ్లోర్, ఆంధ్రా బ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఎ.పి-520001
E-mail : arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియజేస్తూ ప్రకటన (30 రోజుల నోటీస్)
RULE 6(2)/8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ)
అస్సెట్ రికవరి బ్రాంచ్ (79170), విజయవాడ, 4వ ఫ్లోర్, ఆంధ్రా బ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఎ.పి-520001
E-mail : arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియజేస్తూ ప్రకటన (30 రోజుల నోటీస్)
RULE 6(2)/8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

... వార్డ్ నం.54, ప్లాట్ నం.2462, బ్లాక్ నెం.96, ఆర్.యస్ నెం.17లో శ్రీమతి యారబోతుల కోటేశ్వరికు చెందిన 66.66 చ॥గ॥ల ఆర్.సి.సి గ్రౌండ్ ఫ్లోర్ భవనం, డాక్యుమెంట్ నెం.6717 తేది.28-06-2017 ఈ దిగువ హద్దులలో **తూర్పు:** యమ్‌డి. షాహీనా సుల్తానా 40'-00", **ఉత్తరం:** మున్సిపల్ రోడ్ 15'-00", **పడమర:** ప్లాట్ నెం.2461 40'-00", **దక్షిణం:** ప్లాట్ నెం.2451 15'-00".

తేది : 01-12-2025
ప్రదేశం : విజయవాడ
చీఫ్ మేనేజర్ / అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచ్ విజయవాడ

బ్యాంక్ ఆఫ్ ఇండియా Bank of India — Relationship beyond banking
నాజర్‌పేట బ్రాంచి, డి.నెం.1-1-63, బుర్రిపాలెం రోడ్డు, నాజర్‌పేట, తెనాలి, గుంటూరు జిల్లా, ఎ.పి.-522201. ఫోన్: 08644-228065

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 క్రింద **బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకం చేసిన వారు, సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3 తో కలిపి చదువుకోబడిన సెక్షన్ 13(12) ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, <u>ఋణగ్రహీతలు:</u> **శ్రీ గుంటముక్కల భాస్కర కామేశ్వరశర్మ** మరియు **శ్రీ గుంటముక్కల వీరార్జునచారి (లేటు), చట్టబద్ధవారసులు:** అనగా **1. శ్రీమతి జి.గౌతిమి (భార్య), 2. శ్రీ జి.వీణ మాధురి (కుమార్తె మైనర్ అయినందున నాచురల్ గార్డియన్ తల్లి శ్రీమతి జి.గౌతమి), 3. శ్రీ జి.రుత్విక్ విశ్వమణి (కుమారుడు మైనర్ అయినందున నాచురల్ గార్డియన్ తల్లి శ్రీమతి జి.గౌతమి)** వారిని బకాయిమొత్తము: రూ.21,17,223.97 (అక్షరాల ఇరవై ఒక్క లక్షల పదిహేడు ...

తేది: 06.12.2025, ప్రదేశం: నాజర్‌పేట   సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

బ్యాంక్ ఆఫ్ ఇండియా Bank of India — Relationship beyond banking
జగ్గయ్యపేట బ్రాంచి, డి.నెం.6-1173/1B, కోదాడ రోడ్డు, మైత్రీ హోండా షోరూమ్ ఎదురు, జగ్గయ్యపేట, యన్‌టిఆర్ జిల్లా-521175. ఫోన్: 08654-224757

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) నిబంధనలతో చదవబడే సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

యావన్మంది ప్రజలు మరియు ప్రత్యేకించి దిగువ రుణగ్రహీత(లు) మరియు గ్యారంటారు(లు) లకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా **బ్యాంక్ ఆఫ్ ఇండియా** (హామీగల రుణదాత)కు తనఖా ఉంచిన/ చార్జ్ చేయబడిన దిగువ పేర్కొన్న స్థిరాస్తులు **బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారిచే నిర్మాణాత్మక స్వాధీనత చేపట్టినందున **ఋణగ్రహీతలు:** M/s. సత్తార్ స్క్రాప్ డీలర్స్ నుండి బ్యాంక్ ఆఫ్ ఇండియా, జగ్గయ్యపేట శాఖ వారికి బాకీ ఉన్న **రూ.28,57,709.06 (అక్షరాల ఇరవై ఎనిమిది లక్షల యాభై ఏడు వేల ఏడు వందల తొమ్మిది రూపాయలు మరియు ఆరు పైసలు మాత్రమే) మరియు** నెలవారీ మిగులుతో వర్తించు వడ్డీ మరియు ఖర్చులు, ఛార్జీలు రాబట్టుకొనుట కొరకు **09.01.2026**న **''ఎక్కడ ఉన్నది అక్కడ అలాగే'', ''ఉన్నది ఉన్నట్లుగానే'' మరియు ''అక్కడ ఏది ఉంటే అలాగే''** ప్రాతిపదికన విక్రయించబడును. **రిజర్వు ధర, ఇఎండి మొత్తం మరియు ఆస్తి వివరాలు దిగువ పేర్కొనబడినవి.**

స్థిరాస్తి వివరణ

1) యన్‌టిఆర్ జిల్లా, పూర్వము కృష్ణా జిల్లా, జగ్గయ్యపేట మండలం, యన్‌టిఆర్ రిజిష్ట్రేషన్ జిల్లా, జగ్గయ్యపేట సబ్ జిల్లా, షేర్‌మొహమ్మద్‌పేట గ్రామ పంచాయతీ ఏరియా, SVR ఫుడ్ కోర్ట్ @ ఇస్టా రెస్టారెంట్ వెనుకవైపు, NH-65 విజయవాడ రోడ్డుకు దగ్గర, సర్వే నెం.118/2, డోర్ నెం.10-26 నందు ఉన్న ఆస్తి, అందులోని సమస్త భాగాలు, కట్టడాలు, అమరికలు, నిక్షిప్తమైన వస్తువులు మరియు దానికి సంబంధించిన ఇతర అనుబంధ హక్కులతో సహా. **షెడ్యూలు ఆస్తికి సరిహద్దులు: తూర్పు:** షేక్ జరీనా బేగం యొక్క స్థలము; **దక్షిణం:** రోడ్డు; **పడమర:** రోడ్డు; **ఉత్తరం:** మోర్ దారమ్మ & బచ్చుటి నందబాయ్ యొక్క స్థలము. పైన తెలిపిన సరిహద్దుల మధ్య ఉన్న 648.07 చ॥గ॥ లేదా 541.86 చ॥ మీ॥ విస్తీర్ణం గల స్థలము మరియు అందులోని జి.ఐ. రేకుల కప్పు కలిగిన వాణిజ్య షెడ్డు.

రిజర్వుధర: రూ.44,45,000/- ఇఎండి రిజర్వుధర యొక్క 10% అనగా : రూ.4,44,500/-

ఇ-వేలం తేదీ & సమయం: 09-01-2026 న ఉ॥ 11.00 గం.ల నుండి సా॥ 05.00 గం.ల వరకు (ప్రతి 10 నిమిషాల ఆటో అపరిమిత పొడిగింపుతో)

అధీకృత అధికారి యొక్క ఉత్తమ పరిజ్ఞానం మరియు సమాచారం మేరకు పైన ఉదహరించిన ఆస్తిపై ఎటువంటి తాకట్టు రుణభారాలు లేవు అయితే ఆసక్తిగల బిడ్డర్లు రుణభారాలు, ఆస్తి యొక్క టైటిల్ మరియు వాటిని పరిశీలించుట మరియు సంతృప్తి చెందుటకు సంబంధించి వారు స్వయంగా వ్యక్తిగతంగా విచారణ చేపట్టగలరు. వేలం ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకం / బిడ్డింగ్ ద్వారా ఉండును మరియు వెబ్‌సైట్: https://baanknet.com ద్వారా ''ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ బిడ్డింగ్ ప్రక్రియ'' ద్వారా మాత్రమే జరుగును. అమ్మకం యొక్క పూర్తి నియమనిబంధనల కొరకు https://www.bankofindia.co.in/tenders లో ఇవ్వబడిన లింక్‌ను దయచేసి పరిశీలించగలరు మరియు ఆసక్తిగల కొనుగోలుదారులు దిగువ సంతకందారుని **ఫోన్ నెం. 08654-224757 మరియు శ్రీ టి.జి.యస్.ప్రసాద్, బ్రాంచ్ మేనేజర్, జగ్గయ్యపేట బ్రాంచి వారిని వారి మొబైల్: 7730996902 ను సంప్రదించవచ్చును. ఇ-వేలం తేది & సమయం: 09.01.2026న ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ల వరకు.** (ప్రతి 10 నిమిషాల ఆటో అపరిమిత పొడిగింపుతో)

రుణగ్రహీతలు/ గ్యారంటార్లకు అమ్మకం ప్రకటన

ప్రియమైన అయ్యా/అమ్మా,

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు అందులో ఏర్పరిచిన రూల్స్ క్రింద ఇట్టి అమ్మకం నోటీసు జారీచేయుటకు మరియు అమ్మకం యొక్క అన్ని అధికారాలు ఉపయోగించుటకు **బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క ... **స్వాధీనపరచుకున్నారు.** ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా అమ్మకం కొరకు నిర్ధారించిన తేదీలోపు పైన పేర్కొనబడిన విధంగా వాటిని చెల్లించవలసిందిగా మిమ్మలను కోరడం జరుగుచున్నది. విఫలమైన యెడల ఆస్తి విక్రయించబడును మరియు ఒకవేళ ఏదేని బ్యాలెన్స్ ఉంటే వడ్డీ మరియు ఖర్చుతో మీ నుండి రాబట్టుకోవడం జరుగుతుంది. డిమాండు నోటీసుకు స్వాధీనత చేపట్టుటకు, వాల్యుయేషన్ మరియు ఆస్తుల అమ్మకం మొదలగు వాటికి సంబంధించిన అన్ని ఖర్చులను దిగువ సంతకందారుచే రాబట్టబడే అమ్మకం ప్రొసీడింగ్స్ నుండి ముందుగా తగ్గించడం జరుగుతుంది మరియు అమ్మకం ప్రొసీడ్స్ యొక్క బ్యాలెన్స్‌ను పైన పేర్కొనబడిన విధంగా మీ బాకీల నిమిత్తం సర్దుబాటు చేయడం జరుగుతుందని దయచేసి గమనించగలరు. బయానా సొమ్ము ధరావతు సహా నియమనిబంధనల ప్రకారం నిర్వహించబడే వేలంలో పాల్గొనుటకు మీకు స్వేచ్ఛ కలదు.

తేది: 02.12.2025, ప్రదేశం: జగ్గయ్యపేట   సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

బ్యాంక్ ఆఫ్ ఇండియా Bank of India — Relationship beyond banking
బాపులపాడు బ్రాంచి, డి.నెం.5-48/1, శుభకృష్ణ ఎన్‌క్లేవ్, విజయవాడ రోడ్డు, బాపులపాడు. ఫోన్: 08656-245255

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) నిబంధనలతో చదవబడే సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ పేర్కొన్న రుణగ్రహీత(లు) మరియు హామీదారు(ల)కు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, **బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటర్)** కు తాకట్టు/చార్జ్ చేయబడిన మరియు **బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారులచే నిర్మాణాత్మక స్వాధీనం చేసుకోబడిన దిగువ వివరించిన స్థిరాస్తులను, **బ్యాంక్ ఆఫ్ ఇండియా, బాపులపాడు శాఖకు** దిగువ పేర్కొన్న రుణగ్రహీతల నుండి రావలసిన బకాయిలు, వడ్డీ మరియు ఇతర ఖర్చుల రికవరీ నిమిత్తం, **09.01.2026** తేదీన **''ఎక్కడ ఉన్నది అక్కడే'', ''ఎలా ఉన్నది అలాగే'' మరియు ''ఏమున్నది అదే''** ప్రాతిపదికన విక్రయించబడును.

వ.నెం.	అకౌంట్ పేరు	బకాయిసొమ్ము
1	శ్రీమతి శ్రీపతి శిరీష	రూ.12,94,344.81 + నెలవారీ మిగులుతో వర్తించు వడ్డీ మరియు ఖర్చులు, ఛార్జీలు
2	M/s.వంశీ సూపర్ మార్కెట్ తరపున యజమాని: శ్రీమతి శ్రీపతి శిరీష	రూ.10,09,148.96 + నెలవారీ మిగులుతో వర్తించు వడ్డీ మరియు ఖర్చులు, ఛార్జీలు

స్థిరాస్తి వివరణ

... గల ప్లాట్ నెం. 15, 222 చ॥గ॥ విస్తీర్ణము గల ప్లాట్ నెం. 16, 200 చ॥గ॥ విస్తీర్ణము గల ప్లాట్ నెం. 38 & 192.00 చ॥గ॥ విస్తీర్ణము గల ప్లాట్ నెం. 39 వెరశి మొత్తము 839.00 చ॥గ॥ స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **అపార్ట్‌మెంట్‌కు హద్దులు: తూర్పు:** 40 అ॥ వెడల్పుగల రోడ్డు ...81.7 అ॥; **దక్షిణం:** ఇతరుల స్థలము ...95.1 అ॥; **పడమర:** 40 అ॥ వెడల్పుగల రోడ్డు ...77.4 అ॥; **ఉత్తరం:** ప్లాట్ నెం.18 & 36 లోని స్థలము ...95.3 అ॥. ఈ పై హద్దుల మధ్యలో 839.00 చ॥గ॥ లేదా 701.50 చ॥మీ॥ విస్తీర్ణములో అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు బాగమైన 41.95 చ॥గ॥ విస్తీర్ణముగల స్థలము.
షెడ్యూలు-బి: సమీప డోర్ నెం.8-42/1, పైన పేర్కొన్న షెడ్యూలు-ఎలో ఆర్‌సిసి రూఫ్ స్టిల్ట్, గ్రౌండ్ మరియు నాలుగు పై అంతస్తులతో **''శ్రీ వెంకటేశ్వర ఫార్ట్యూన్''** పేరు మరియు శైలితో నిర్మించిన రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ 2వ అంతస్తులోని ఫ్లాట్ నెం.301 **ఈ దిగువ హద్దులలో: తూర్పు:** శూన్యాకాశము; **దక్షిణం:** శూన్యాకాశము; **పడమర:** వరండా; **ఉత్తరం:** శూన్యాకాశము. ఈ పై హద్దుల మధ్యలోని **''శ్రీ వెంకటేశ్వర ఫార్ట్యూన్''** రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ 2వ అంతస్తులో 840.00 చ॥అ॥ ప్లింత్ ఏరియా మరియు 210.00 చ॥అ॥ కామన్ ఏరియా, 100 చ॥అ॥ కార్ పార్కింగ్ ఏరియా కలిగిన ఫ్లాట్ నెం.301 అన్ని అనుషంగిక హక్కులతో సహా యావత్తు. **డాక్యుమెంట్ నెం.411/2021, తేది.02-02-2021 ప్రకారము శ్రీమతి శ్రీపతి శిరీషపేరునగల ఆస్తి.**

రిజర్వుధర: రూ.26,50,000/- ఇఎండి రిజర్వుధర యొక్క 10% అనగా : రూ.2,65,000/-

ఇ-వేలం తేదీ & సమయం: 09-01-2026 న ఉ॥ 11.00 గం.ల నుండి సా॥ 05.00 గం.ల వరకు (ప్రతి 10 నిమిషాల ఆటో అపరిమిత పొడిగింపుతో)

అధీకృత అధికారి యొక్క ఉత్తమ పరిజ్ఞానం మరియు సమాచారం మేరకు పైన ఉదహరించిన ఆస్తిపై ఎటువంటి తాకట్టు రుణభారాలు లేవు అయితే ఆసక్తిగల బిడ్డర్లు రుణభారాలు, ఆస్తి యొక్క టైటిల్ మరియు వాటిని పరిశీలించుట మరియు సంతృప్తి చెందుటకు సంబంధించి వారు స్వయంగా వ్యక్తిగతంగా విచారణ చేపట్టగలరు. వేలం ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకం / బిడ్డింగ్ ద్వారా ఉండును మరియు వెబ్‌సైట్: https://baanknet.com ద్వారా ''ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ బిడ్డింగ్ ప్రక్రియ'' ద్వారా మాత్రమే జరుగును. అమ్మకం యొక్క పూర్తి నియమనిబంధనల కొరకు https://www.bankofindia.co.in/tenders లో ఇవ్వబడిన లింక్‌ను దయచేసి పరిశీలించగలరు మరియు ఆసక్తిగల కొనుగోలుదారులు దిగువ సంతకందారుని **ఫోన్ నెం. 08656-245255 మరియు శ్రీ డోల సుధాకర్, బ్రాంచ్ మేనేజర్, బాపులపాడు బ్రాంచి వారిని వారి మొబైల్: 9030903501 ను సంప్రదించవచ్చును. ఇ-వేలం తేది & సమయం: 09.01.2026న ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ల వరకు.** (ప్రతి 10 నిమిషాల ఆటో అపరిమిత పొడిగింపుతో)

రుణగ్రహీతలు/ గ్యారంటార్లకు అమ్మకం ప్రకటన

ప్రియమైన అయ్యా/అమ్మా,

... **లాంఛనముగా స్వాధీనపరచుకున్నారు.** ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా అమ్మకం కొరకు నిర్ధారించిన తేదీలోపు పైన పేర్కొనబడిన విధంగా వాటిని చెల్లించవలసిందిగా మిమ్మలను కోరడం జరుగుచున్నది. విఫలమైన యెడల ఆస్తి విక్రయించబడును మరియు ఒకవేళ ఏదేని బ్యాలెన్స్ ఉంటే వడ్డీ మరియు ఖర్చుతో మీ నుండి రాబట్టుకోవడం జరుగుతుంది. డిమాండు నోటీసుకు స్వాధీనత చేపట్టుటకు, వాల్యుయేషన్ మరియు ఆస్తుల అమ్మకం మొదలగు వాటికి సంబంధించిన అన్ని ఖర్చులను దిగువ సంతకందారుచే రాబట్టబడే అమ్మకం ప్రొసీడింగ్స్ నుండి ముందుగా తగ్గించడం జరుగుతుంది మరియు అమ్మకం ప్రొసీడ్స్ యొక్క బ్యాలెన్స్‌ను పైన పేర్కొనబడిన విధంగా మీ బాకీల నిమిత్తం సర్దుబాటు చేయడం జరుగుతుందని దయచేసి గమనించగలరు. బయానా సొమ్ము ధరావతు సహా నియమనిబంధనల ప్రకారం నిర్వహించబడే వేలంలో పాల్గొనుటకు మీకు స్వేచ్ఛ కలదు.

తేది: 05.12.2025, ప్రదేశం: బాపులపాడు   సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా Union Bank of India — A Government of India Undertaking
అస్సెట్ రికవరీ బ్రాంచ్ (79170), విజయవాడ, చిరునామా : 4వ ఫ్లోర్, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520001.
E-mail: arb.vijayawada@unionbankofindia.bank

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6)ల నిబంధనలతో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్థుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం నోటీసు

ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ సాధారణ ప్రజానీకానికి మరియు "ఋణగ్రహీత(లు) & హామీదారు(లు)"లకు ప్రత్యేకముగా తెలుపునది ఏమనగా, **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారిచే లాంఛనాత్మకంగా స్వాధీనం తీసుకొనబడిన** బ్యాంక్ తనఖాలో / ఛార్జీలో ఉన్న దిగువ పేర్కొన్న స్థిరాస్తిని **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదారులు బకాయి పడిన దిగువ తెలిపిన బకాయిలు మొత్తం + వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులతో సహా సదరు మొత్తం రాబట్టుకొనుటకు సదరు ఆస్తులను **'ఎక్కడ ఉన్నది అలాగే" "ఏది ఉంటే అది & అక్కడ ఏది ఉన్నదో అలాగే" పద్ధతిలో తేదీ:09-01-2026న** అమ్మకం చేయుటకు నిర్ణయించినారు.

ఇ-వేలం తేది&సమయం: 09-01-2026, మ॥ 12.00 గం॥ల నుండి సా॥ 05.00 గం॥ల వరకు
ధరావత్తు సమర్పించుటకు ఆఖరు తేది: ఇ-వేలం ప్రారంభానికి ముందు వరకు

...

తేది : 01.12.2025
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి, విజయవాడ

విశాఖలో సందడే సందడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలని (విశాఖపట్నం)

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా దక్షిణాఫ్రికా విశాఖ వేదికగా జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్ అద్భుత విజయాన్ని అందుకుంది. భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్ 121 బంతులలో 12 ఫోర్లు, 2 సిక్సుల సాయంతో 116 పరుగులు చేసి క్రీడాభిమానులను అలరించారు. నిర్ణయాత్మక ఈ మ్యాచ్‌లో విజయంతో మూడు వన్డే సిరీస్ భారత్ 2-1తో కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టులో క్వింటన్ డి కాక్ శతక విన్యాసంతో ఆకట్టుకున్నారు. అతనికి జట్టు ఆటగాళ్ల నుంచి సరైన సహకారం లభించలేదు. దీంతో ఆ జట్టు స్కోర్ 270కే పరిమితమైంది.

కోహ్లి, రోహిత్ మానియా

టీమ్ ఇండియా స్టార్ ఆటగాళ్ళు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ కోసమే ఈ మ్యాచ్‌కు వచ్చిన వాళ్ళు అధికం. క్రికెట్ అభిమానులు పెద్ద సంఖ్యలో కనిపించారు. వైజాగ్ స్టేడియం కోహ్లికి అత్యంత కలిసొచ్చిన మైదానాల్లో ఒకటి. దీనికి తగ్గట్టుగానే ఈ మ్యాచ్‌లో అతని బ్యాటింగ్ సాగింది. సొగసైన షాట్లతో కోహ్లి 65 పరుగులు చేశాడు.

బ్లాక్ మార్కెట్ దందా

ఆన్‌లైన్‌లో టికెట్లు కొద్దిసేపట్లోనే అమ్ముడుపోవడంతో విశాఖలో బ్లాక్ టికెట్ల విక్రయాలు పెద్ద ఎత్తున జరిగాయి. రూ.3,000 టికెట్‌ను రూ.10,000 వరకు, రూ.5,000 టికెట్‌ను ఏకంగా రూ.12,000 – 15,000 వరకు విక్రయించి పలువురు సొమ్ము చేసుకున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే శుక్రవారం రాత్రి 15 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు శనివారం బ్లాక్‌లో టికెట్లు విక్రయిస్తున్న మరో 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఏసిఎ – విడిసిఎ స్టేడియం సామర్థ్యం 28 వేలు అయినప్పటికీ సుమారు 35 వేలపైన టికెట్లు అమ్మకాలు జరిగినట్లు తెలుస్తోంది.

డికాక్ (106 పరుగులు)

వన్డే సిరీస్ విజేత భారత్

- జైస్వాల్ సెంచరీ
- రోహిత్, కోహ్లి అర్ధసెంచరీలు
- చివరి వన్డేలో దక్షిణాఫ్రికాపై 9వికెట్ల తేడాతో గెలుపు

విశాఖపట్నం: నిర్ణయాత్మక మూడో, చివరి వన్డేలో టీమిండియా ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చింది. తొలుత ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్ బౌలింగ్ రాణించగా.. ఛేదనలో యశస్వి జైస్వాల్ సెంచరీకి తోడు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి అర్ధసెంచరీలతో రాణించి మ్యాచ్‌ను ముగించారు. ఈ గెలుపుతో టీమిండియా మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో చేజిక్కించుకొని ట్రోఫీని కైవసం చేసు కుంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాను ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే పేసర్ అర్ష్‌దీప్ దెబ్బకొట్టాడు. ఓపెనర్ రికెల్టన్(0)ను డకౌట్ చేసి సఫారీలపై ఒత్తిడి పెంచాడు. ఆ తర్వాత క్వింటన్ డికాక్(106) శతకానికి తోడు బవుమా(48) రెండో వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యంతో జట్టును ఆదుకు న్నారు. వీరిద్దరూ 113 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. జట్టు స్కోర్ 168పరుగుల వద్ద సఫారీ జట్టు మూడో వికెట్‌ను కోల్పోయింది. ఆ తర్వాత వరుసగా వికెట్లు చేజార్చుకుంటూ కేవలం 270పరుగులకే పరిమితమైంది. భారత బౌలర్లు కుల్దీప్, ప్రసిధ్‌కు నాలుగేసి వికెట్లు, ఆకాశ్‌దీప్, జడేజాకు ఒక్కో వికెట్ దక్కాయి. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియా ఓపెనర్లు యశస్వి జైస్వాల్ సెంచరీకి తోడు రోహిత్ శర్మ అర్ధసెంచరీతో రాణించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 155పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత రోహిత్(75) ఔటైనా.. విరాట్ కోహ్లి(65) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. దీంతో భారతజట్టు 39.5 ఓవర్లలో కేవలం ఒక వికెట్ కోల్పోయి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ యశస్వి జైస్వాల్‌కు, సిరీస్ విరాట్ కోహ్లికి దక్కాయి. ఇరుజట్ల మధ్య ఐదు టి20ల సిరీస్ డిసెంబర్ 9నుంచి ప్రారంభం కానుంది.

ప్రసిధ్, కుల్దీప్ కట్టడి

తొలిగా బ్యాటింగ్‌కు దిగిన సఫారీ జట్టును టీమిండియా పేసర్ ప్రసిద్ కృష్ణ, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కట్టడి చేశారు. ప్రసిధ్(4/66), కుల్దీప్ (4/41) రాణించడంతో దక్షిణాఫ్రికా జట్టు 270 పరుగులకే పరిమితమైంది. ఒకానొక దశలో 350కు పైగా పరుగులు చేసేలా కనిపించిన సఫారీ జట్టును వీరిద్దరూ మిడిలార్డర్, లోయర్ ఆర్డర్ బ్యాటర్లను కట్టడి చేశారు. కుల్దీప్ యాదవ్ ఒకే ఓవర్లో బ్రెవీస్(29), యాన్సెన్(17)లను ఔట్ చేసి సఫారీల భారీస్కోర్ ఆశలపై నీళ్లు చల్లాడు.

దిగ్గజాల సరసన జైస్వాల్..

టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డేలో శతకం బాది మూడు ఫార్మాట్‌లలో సెంచరీలు కొట్టిన బ్యాటర్ల సరసన చేరాడు. కేవలం 111 బంతుల్లో 10 ఫోర్లు, ఒక సిక్సర్‌తో సెంచరీ బాదిన జైస్వాల్ మూడు ఫార్మాట్లలో వంద కొట్టిన ఆరో భారత క్రికెటర్‌గా నిలిచాడు. జైస్వాల్ కంటే ముందు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, సురేశ్ రైనా ఈ ఫీట్‌ను సాధించారు.

వీక్షణలోనూ రికార్డు...

భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య శనివారం జరిగిన నిర్ణయాత్మక వన్డేను రికార్డుస్థాయిలో ప్రేక్ష కులు వీక్షించారు. డిస్నీ హాట్‌స్టార్‌లో ప్రసారమైన మూడో, చివరి వన్డేను దాదాపు 21కోట్లమంది వీక్షించినట్లు సమాచారం. దీంతో ఈ మ్యాచ్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌పై రికార్డుపుటల్లో కెక్కింది.

స్కోర్‌బోర్డు...

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (బి)ప్రసిధ్ 106, రికెల్టన్ (సి)రాహుల్ (బి)అర్ష్‌దీప్ 0, బవుమా (సి)కోహ్లి (బి)జడేజా 48, బ్రీజ్కే (ఎల్‌బి)ప్రసిధ్ 24, మార్‌క్రమ్ (సి)కోహ్లి (బి)ప్రసిధ్ 1, బ్రెవీస్ (సి)రోహిత్ (బి)కుల్దీప్ 29, యాన్సెన్ (సి)జడేజా (బి)కుల్దీప్ 17, బోష్ (సి అండ్ బి)కుల్దీప్ 9, మహరాజ్ (నాటౌట్) 20, ఎన్గిడి (ఎల్‌బి)కుల్దీప్ 1, బార్ట్‌మన్ (బి)ప్రసిధ్ 3, అదనం 12. (47.5ఓవర్లలో ఆలౌట్) 270పరుగులు. **వికెట్ల పతనం:** 1/1, 2/114, 3/168, 4/170, 5/199, 6/234, 7/235, 8/252, 9/258, 10/270 **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 8-1-36-1, హర్షిత్ రాణా 8-2-44-0, ప్రసిధ్ 9.5-0-66-4, జడేజా 9-0-50-1, కుల్దీప్ 10-1-41-4, తిలక్ వర్మ 3-0-29-0

ఇండియా ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (నాటౌట్) 116, రోహిత్ శర్మ (సి)బ్రీజ్కే (బి)మహరాజ్ 75, విరాట్ కోహ్లి (నాటౌట్) 65, అదనం 15. (39.5ఓవర్లలో వికెట్ నష్టానికి) 271పరుగులు. **వికెట్ల పతనం:** 1/155 **బౌలింగ్:** యాన్సెన్ 8-1-39-0, ఎన్గిడి 6.5-0-56-0, మహరాజ్ 10-0-44-1, బార్ట్‌మన్ 7-0-60-0, బోష్ 6-0-53-0, మార్‌క్రమ్ 2-0-17-0.

గెలుపు ముంగిట ఆస్ట్రేలియా

- ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 134/6
- యాషెస్ సిరీస్ పింక్‌బాల్ టెస్ట్

బ్రిస్బేన్: యాషెస్ సిరీస్ రెండో(పింక్ బాల్) టెస్ట్‌లోనూ ఆస్ట్రేలియా గెలుపుకు చేరువైంది. తొలి ఇన్నింగ్స్‌లో 511 పరుగుల భారీ స్కోర్ చేసిన ఆసీస్.. రెండో ఇన్నింగ్స్‌లో మిచెల్ స్టార్క్(2/48), స్కాట్ బొలాండ్(2/33)ల ప్రత్యర్థి జట్టు సగం వికెట్లు పడగొట్టారు. దీంతో మూడోరోజు ఆట నిలిచే సమయానికి ఇంగ్లండ్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 6వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. బెన్ స్టోక్స్ సేన ఇంకా 43 పరుగులు వెనకబడి ఉండగా.. క్రీజ్‌లో స్టోక్స్(4), జాక్స్(4) ఉన్నారు. నాలుగోరోజు టెయిలెండర్లను త్వరగా చుట్టేస్తే.. కంగారూ టీమ్ వరుసగా రెండో విజయం సాధించడం లాంఛనమే. ఓవర్ నైట్ స్కోర్ 6వికెట్ల నష్టానికి 378పరుగులతో శనివారం మూడోరోజు ఆటను కొనసాగించిన ఆస్ట్రేలియా జట్టు 511 పరుగుల భారీస్కోర్ చేసింది. అలెక్స్ క్యారీ(63), స్టార్క్ (77) అర్ధసెంచరీలకి తోడు బోలండ్(21నాటౌట్), డోగెట్(13) బ్యాటింగ్‌లో రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లు కర్సేకు నాలుగు, స్టోక్స్‌కు మూడు, ఆర్చర్, అట్కిన్సన్, జాక్స్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. దీంతో ఆతిథ్య జట్టుకు 177పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది.

స్కోర్‌బోర్డు...

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 334ఆలౌట్

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 511ఆలౌట్

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (సి అండ్ బి)నెసెర్ 44, డకెట్ (బి)బోలండ్ 15, పోప్ (సి అండ్ బి)నెసెర్ 26, రూట్ (సి)క్యారీ (బి)స్టార్క్ 15, బ్రూక్ (సి)క్యారీ (బి)బోలండ్ 15, స్టోక్స్ (బ్యాటింగ్) 4, స్మిత్ (సి)క్యారీ (బి)స్టార్క్ 4, జాక్స్ (బ్యాటింగ్) 4, అదనం 7. (35ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 134పరుగులు. **వికెట్ల పతనం:** 1/48, 2/90, 3/97, 4/121, 5/123. 6/128 **బౌలింగ్:** స్టార్క్ 12-2-48-2, నెసెర్ 7-0-27-2, డోగెట్ 6-2-19-0. బోలండ్ 10-2-33-2.

నాకౌట్‌కు భారత మహిళల జూనియర్ హాకీ జట్టు

శాంటినిగో: ఎఫ్‌ఐహెచ్ మహిళల జూనియర్ హాకీలో భారత జట్టు నాకౌట్‌కు చేరింది. శుక్రవారం రాత్రి జరిగిన గ్రూప్-సి చివరి లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు 4-0గోల్స్‌తో ఐర్లాండ్‌ను ఓడించింది. పూర్ణిమ (42, 58వ ని.)రెండు గోల్స్‌కి తోడు కనిక(12వ ని.), సాక్షి రాణా (57వ ని.)లో ఒక్కో గోల్ కొట్టారు. తొలి క్వార్టర్‌లో భారత హాకీ జట్టు ఒక గోల్ చేసి ఐర్లాండ్‌పై ఒత్తిడి పెంచింది. దీంతో గ్రూప్-సిలో భారతజట్టు 2వ స్థానంలో నిలిచి నాకౌట్‌కు చేరింది. ఈ గ్రూప్‌లో ఉన్న జర్మనీ 9పాయింట్లతో టాప్‌లో నిలిచింది.

'సిగ్మా'లో అతిథి పాత్ర చేస్తున్న జాసన్

తమిళ నటుడు విజయ్ కొడుకు జాసన్ సంజయ్ దర్శకత్వంలో 'సిగ్మా' అనే చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రంలో సందీప్ కిషన్ నటిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో జాసన్ అతిథి పాత్ర చేయబోతున్నారని తెలుస్తోంది. ఓ స్పెషల్ సాంగ్‌లో కేథరీన్, సందీప్‌తో కలసి జాసన్ కూడా కనిపించనున్నారు. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందించారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మాణంలో ఈ ప్రాజెక్టు చెన్నై, తలకోన అడవులు, థాయిలాండ్‌లో షూటింగ్ జరుపుకుంది. వచ్చే వేసవిలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

మహిళగా పుట్టినందుకు గర్వంగా ఉంది..

ఇటీవల ముంబయి వేదికగా జరిగిన 'వీ ది విమెన్ ఆసియా' కార్యక్రమంలో జాన్వీ మాట్లాడుతూ మహిళగా పుట్టడాన్ని గౌరవంగా భావిస్తున్నానన్నారు. ఇంకా ఆమె ఇలా మాట్లాడారు. 'సమానత్వం అనేది సంభాషణలతో, చర్చలతోనే మొదలవుతుంది. మనం ఈ అంశం గురించి ఇప్పటికైనా ఓపెన్‌గా మాట్లాడితే మన తర్వాత తరానికైనా దీనిపై పూర్తి అవగాహన వస్తుంది. మహిళలు శక్తిమంతులు. వారిని ప్రోత్సహించాలి. నేను మహిళగా పుట్టినందుకు గర్వంగా ఉంది. మనల్ని మనం ప్రశంసించుకుంటూ ముందుకుసాగాలి' అన్నారు. ఈ వీడియోను ప్రియాంక చోప్రా షేర్ చేస్తూ, 'ఇలా మాట్లాడే వారిని కూడా ప్రోత్సహించాలి..' అని పేర్కొన్నారు. గతంలోనూ జాన్వీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలపై మాట్లాడారు. 'ఇండస్ట్రీలో కొనసాగాలంటే పురుష అహంకారాన్ని ఎదుర్కోవాలి. నలుగురు మహిళలు ఉన్న ప్రదేశంలో నేను ధైర్యంగా నా అభిప్రాయాన్ని వ్యక్తం చేయగలను. కానీ, అదే ప్రదేశంలో నలుగురు పురుషులు ఉంటే మాత్రం నేను నా అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేను. ఎందుకంటే వారు నొచ్చుకోకుండా వెల్లడించాల్సి ఉంటుంది. దీనికి చాలా నేర్పు ఉండాలి. నేను ఈ విషయంలో ఎన్నో పోరాటాలు చేశాను' అని అన్నారు.

ఎర్రపోతవరంలో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

ప్రజాశక్తి- రామచంద్రపురం (డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా)

ధ్వంసమైన అంబేడ్కర్ విగ్రహం మెడ భాగం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎర్రపోతవరంలోని అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆ విగ్రహానికి పూలమాలలు వేసేందుకు గ్రామ పెద్దలు వెళ్లారు. విగ్రహం మెడపైనా, చేతిపైనా ధ్వంసం అయి ఉండడాన్ని గుర్తించి కె.గంగవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఈ ఘటనకు పాల్పడినట్లు ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇన్‌ఛార్జి సిఐ మండపేట సురేష్, కె.గంగవరం ఎస్ఐ జానీ బాషా, ద్రాక్షారామం ఎస్ఐ ఎం.లక్ష్మణ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు. గ్రామస్తులు శాంతియుతంగా ఉండాలని, నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ధ్వంసమైన విగ్రహానికి వెంటనే మరమ్మతులు చేయించి పెయింట్ వేయించారు. అనంతరం గ్రామ పెద్దలు, పోలీసులు అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ సర్పంచ్ దున్నా అన్నవరం, బాలాంతరం మాజీ సర్పంచ్ ఈరెళ్ల రాజు, న్యాయవాది ఇనకోటి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు నేర్చుకుంటాను

'గుమ్మడి నర్సయ్య' సినిమా కోసం తాను తెలుగు నేర్చుకుంటానని.. స్వయంగా డబ్బింగ్ చెబుతానని శివరాజ్ కుమార్ అన్నారు. ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య జీవితంపై సినిమా రానున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ నటిస్తున్నారు. శనివారం చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమం పాల్వంచలో నిర్వహించారు. కార్యక్రమంలో శివరాజ్ కుమార్ మాట్లాడారు. 'ఈ సినిమా చేస్తున్నందుకు చాలా సంతోషంగా, అలాగే గర్వంగా అనిపిస్తోంది. మంచి మనిషి జీవిత చరిత్రలో నటిస్తున్నాను. 'మన కోసం కాదు.. ఇతరుల కోసం బతకాలని' మా నాన్న ఎప్పుడూ చెప్పేవారు. శుక్రవారం గుమ్మడి నర్సయ్య ఇంటికి వెళ్లి వాళ్ల కుటుంబసభ్యులను కలిశాను. నా సొంత మనుషులను కలిసినట్లు అనిపించింది. నేను తెలుగులో మాట్లాడడం లేదని ఏమీ అనుకోకండి. తెలుగు నేర్చుకుంటాను. ఈ సినిమాకు నేనే స్వయంగా డబ్బింగ్ చెబుతాను. ఈ చిత్రం ఎంతోమందిలో స్ఫూర్తి నింపుతుంది. ముఖ్యంగా రాజకీయాల్లోకి రావాలనుకునే యువత దీన్ని కచ్చితంగా వీక్షించాలి' అన్నారు.

వరలక్ష్మికొత్త సినిమా 'పోలీస్ కంప్లైంట్'

నవీన్ చంద్ర, వరలక్ష్మీ శరత్ కుమార్ జంటగా నటిస్తున్న సినిమా 'పోలీస్ కంప్లైంట్'. మేగోటి సంజీవ్ కుమార్ దర్శకత్వంలో బాలకృష్ణ మహరాణా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'ఈ సినిమాలో వరలక్ష్మి శరత్ కుమార్ పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుంది. అదే సమయంలో ఆ పాత్ర ద్వారా వినోదాన్నీ పంచుతుంది. కృష్ణ గారిపై చిత్రీకరించిన ప్రత్యేక గీతం సినిమాకే హైలైట్‌గా నిలుస్తుంది' అని నిర్మాత అన్నారు. ఇందులో కృష్ణ సాయి, రాగిణి ద్వివేది, రవిశంకర్, ఆదిత్య ఓం, శ్రీనివాస్ రెడ్డి, సప్తగిరి, తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. సినిమా కథ గురించి సంజీవ్ మేగోటి చెబుతూ, 'చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌పై ఈ సినిమా తీశాం. మనం చేసే ప్రతి చర్య తిరిగి మనకే ఫలితంగా వస్తుందన్న భావనను హారర్ థ్రిల్లర్‌గా కొత్త కోణంలో చూపించనున్నాం. సినిమా అవుట్ పుట్ బాగా వచ్చింది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ పూర్తి కాగానే విడుదలకు సన్నాహాలు చేస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి ఆరోహణ సుధీంద్ర, సుధాకర్ మారియో, సంజీవ్ మేగోటి సంగీతం అందిస్తున్నారు.

30 ఏళ్ల తర్వాత మళ్లీ వెండితెరపై

80వ దశకంలో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నందమూరి కళ్యాణ్ చక్రవర్తి మళ్లీ వెండితెరపైకి రాబోతున్నారు. స్వప్న సినిమాస్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'ఛాంపియన్' చిత్రంలో ఆయన ఓ కీలక పాత్ర పోషించనున్నారు. నందమూరి త్రివిక్రమరావు (ఎన్టీఆర్ సోదరుడు) కుమారుడైన కళ్యాణ్ చక్రవర్తి గతంలో 'తలంబ్రాలు', 'ఇంటి దొంగ', 'దొంగ కాపురం', 'మేనమామ', 'అక్షింతలు' వంటి కుటుంబ కథా చిత్రాలతో ప్రేక్షకులకు దగ్గరయ్యారు. 'రౌడీ బాబాయ్', 'రుద్రరూపం' వంటి యాక్షన్ సినిమాల్లో కూడా నటించారు.

వెనిజులాకు 172 మంది తరలింపు

- కారకస్‌కు అమెరికా విమానం

మైక్వెటా : సరైన పత్రాలు లేకుండా అమెరికాలో నివసిస్తున్న 172మంది వెనిజులా వాసులను అమెరికా బహిష్కరించిన నేపథ్యంలో వారిని తీసుకుని అమెరికా నుండి విమానం శుక్రవారం కారకస్‌కు చేరుకుంది. ఈ విమానంలో ఐదుగురు చిన్నారులు, 26మంది మహిళలు, 141మంది పురుషులు వున్నారని వెనిజులా అధికారులు తెలిపారు. వెనిజులా గగనతలం మొత్తంగా మూసివేసినట్లుగా పరిగణించాలని ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించినప్పటికీ ఈ తరలింపు విమానాలు ల్యాండ్ అవడానికి వెనిజులా తిరిగి అనుమతించింది. అమెరికా నుండి వెనిజులాకు ఈ వారంలో వచ్చిన రెండవ విమానం ఇది. కరేబియా సముద్ర జలాల్లో పెద్దఎత్తున అమెరికా మిలటరీని మోహరించిన నేపథ్యంలో అరిజోనాలోని ఫోనిక్స్ నుండి ఈ విమానం కారకస్‌కు చేరుకుంది. ఇప్పటివరకు 14వేల మంది వెనిజులా వాసులను అమెరికా వారి స్వదేశానికి పంపివేసింది. విదేశాల నుండి స్వదేశానికి వచ్చిన వారి సంఖ్య 18,260కి చేరుకుందని అధికార గణాంకాలు తెలిపాయి.

చమురు నిల్వల కోసమే ట్రంప్ దుష్ప్రచారం : మధురో

తమ ప్రభుత్వాన్ని కూలదోసి, చమురు నిల్వలను స్వాధీనం చేసుకోవడానికే మాదక ద్రవ్యాల పేరుతో ట్రంప్ ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోందని వెనిజులా అధ్యక్షుడు వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో విమర్శించారు. అందులో భాగంగానే అమెరికాలో ఉన్న వెనిజులా వాసులను వెనక్కి పంపిస్తున్నారని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద విమాన వాహక నౌకతో సహా సైనిక బలగాలను ట్రంప్ ప్రభుత్వం వెనిజులా సముద్ర జలాల్లో మోహరించింది. ఇటీవలి మాసాల్లో అమెరికా బలగాలు కరేబియన్, పసిఫిక్ ప్రాంతాల్లో 20కి పైగా దాడులు జరిపాయి. ఫలితంగా 87మంది వెనిజులా వాసులు మరణించారు.

పేరు మార్పు ప్రకటన

నేను, భీమిరెడ్డి కృష్ణ రెడ్డి, తం. రామ చంద్రారెడ్డి, వయస్సు 54 సంవత్సరాలు, ఇ.నెం. బి-0905, జయబేరి ది క్యాపిటల్, బ్లాక్-బి, ఫ్లోర్-9, టవర్-5, కంచనపల్లి, కంచనపల్లె, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522 501లో నివసిస్తూ, నా పేరు మార్పు చేసుకున్నాను. ఇకపై నా పూర్వపు పేరు భీమిరెడ్డి కృష్ణ రెడ్డి (Bhimireddy Krishna Reddy) స్థానంలో భీమిరెడ్డి కృష్ణ రెడ్డి గా (Bhimireddi Krishna Reddi) పిలువబడుదును.
ఈ విషయాన్ని సంబందిత అన్ని శాఖలు, అధికారులు మరియు సాధారణ ప్రజలు గమనించగలరు.

Sd/- భీమిరెడ్డి కృష్ణ రెడ్డి
(Bhimireddi Krishna Reddi)

బ్యాంక్ ఆఫ్ ఇండియా
Bank of India — Relationship beyond banking
ఆటోనగర్ బ్రాంచి, గుంటూరు, డి.నెం.8-24-4, 2వ లైను, యన్‌టిఆర్ నగర్, మణిపురం బ్రిడ్జి దగ్గర, గుంటూరు-522001. ఫోన్: 0863-220730, 22255978

SARFAESI ACT 13(4) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 క్రింద **బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకం చేసిన వారు, సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3 తో కలిపి చదువుకోబడిన సెక్షన్ 13(12) ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **ఋణగ్రహీతలు:** M/s. **శ్రీ సంధ్య ఆప్టికల్స్ (దీని తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న యజమాని: శ్రీ దుద్యాల శివ నాగ వరప్రసాద్)** వారిని **బకాయిమొత్తము: రూ.9,60,343.55 (అక్షరాల తొమ్మిది లక్షల అరవై వేల మూడు వందల నలభై మూడు రూపాయలు మరియు యాభై ఐదు పైసలు) + 21.02.2024 తేదీ నుండి 13.85% పి.ఎ. చొప్పున నెలవారీ వడ్డీతో కూడిన చక్రవడ్డీ మరియు బ్యాంకుకు అయిన అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు ఇతర వ్యయాలతో పాటు** సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించవలసిందిగా **ది.09-07-2025 తేదీ గల డిమాండ్ నోటీసు** జారీచేశారు.
ఋణగ్రహీత సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13 సబ్‌సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములు వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని క్రింది సంతకందారు **06 డిసెంబర్ 2025న స్వాధీనం చేసుకున్నారని** ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.
ఆస్తితో ఎటువంటి వ్యవహారములు జరుపరాదని, ఆస్తితో జరిపే ఏ వ్యవహారములైనా **చెల్లించవలసిన బకాయి రూ.9,60,343.55 (అక్షరాల తొమ్మిది లక్షల అరవై వేల మూడు వందల నలభై మూడు రూపాయలు మరియు యాభై ఐదు పైసలు) + నెలవారీ వడ్డీతో కూడిన చక్రవడ్డీ మరియు ఇతర ఖర్చులు, వ్యయాలతో పాటు బ్యాంక్ ఆఫ్ ఇండియా** హక్కుకు లోబడి ఆ విధంగా చేయవచ్చునని ముఖ్యంగా ఋణగ్రహీతను, మరియు సాధారణ ప్రజలను ఇందుమూలముగా హెచ్చరించడమైనది.
సదరు చట్టం యొక్క సెక్షన్ 13 సబ్-సెక్షన్ (8) నియమావళి ననుసరించి సెక్యూర్డ్ ఆస్తులను విడిపించు కొనుటకు తగిన సమయం లభిస్తుందని ఋణగ్రహీతకు విన్నవించటమైనది.

స్థిరాస్తి యొక్క వివరములు

గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, అమరావతి సబ్ డిస్ట్రిక్ట్, అమరావతి మండలం, ధరణికోట గ్రామ పంచాయతీ పరిధిలోని డి.నెం: 118/1 నందు **శ్రీ దుద్యాల కృష్ణ గారి పేరున గల** 145.3 చదరపు గజాలు లేదా 121.5 చదరపు మీటర్ల విస్తీర్ణం గల ఖాళీ స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **ఆస్తి సరిహద్దులు: తూర్పు:** 4 గజాల వెడల్పు గల దారి ...28.3 అడుగులు, **దక్షిణం:** ఆకుల నాగేశ్వరరావు మరియు ఇతరుల మిగిలిన ఆస్తి ...46.5 అడుగులు, **పడమర:** ఆకుల నాగేశ్వరరావు మరియు ఇతరుల మిగిలిన ఆస్తి ...28 అడుగులు, **ఉత్తరం:** 12 అడుగుల వెడల్పు మరియు 200 అడుగుల పొడవు గల రోడ్డు ...46.5 అడుగులు

తేది: 06.12.2025, ప్రదేశం: గుంటూరు — సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ)
అస్సెట్ రికవరి బ్రాంచ్ (79170), విజయవాడ, 4వ ఫ్లోర్, ఆంధ్రా బ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఎ.పి-520001
E-mail : arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియజేస్తూ ప్రకటన (30 రోజుల నోటీస్)
RULE 6(2)/8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

ఋణగ్రహీత & హామీదారుల పేర్లు మరియు చిరునామా: 1) **శ్రీ కునపులి సీత రామ శర్మ,** తండ్రి. కె సత్యనారాయణ, డి.నెం. 41-5-25, పాత పోలీస్ స్టేషన్, కృష్ణలంక, విజయవాడ, 2) **శ్రీమతి కూనపులి సునీత,** భర్త. శ్రీ కునపులి సీత రామశర్మ, డి.నెం 41-5-25, పాత పోలీస్ స్టేషన్, కృష్ణలంక, విజయవాడ
విషయం: **బ్యాంక్ వారికి శ్రీ కునపులి సీత రామ శర్మ రుణపడిన బకాయి వసూలు చేసుకొను నిమిత్తమై సెక్యూరిటైజేషన్ & రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద ఆస్తి విక్రయము గురించి.**
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచ్ (79170), 4వ అంతస్థు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్. ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520001 వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ **13(2)** క్రింద **ది.21-12-2017న డిమాండ్ నోటీసు** ద్వారా మిమ్ముల ను మాకు చెల్లించవలసిన బకాయి మొత్తము నిర్దేశించిన గడువులోపు చెల్లించమని కోరినను, బకాయి మొత్తం నిర్దేశించిన గడువులోపు చెల్లించుటలో మీరు విఫలమైనారు. ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.04-11-2025**న సదరు చట్టంలోని సెక్షన్ 13(4) లోని 6/8వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారములతో అధీకృత అధికారి **లాంఛనాత్మక స్వాధీనం** చేసుకోవడమైనది.
ఆస్తిని **లాంఛనాత్మక స్వాధీనం** చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తమును చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు అందిన తేది నుండి 30 రోజుల తరువాత ఆన్లైన్ మోడ్ ద్వారా పబ్లిక్ ఇ-వేలం నిర్వహించడం ద్వారా దిగువ పేర్కొన్న ఆస్తిని విక్రయించడం అనివార్యమైనది. ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం తేదీ మరియు సమయం ఇ-వేలం నిర్వహించబడే సర్వీస్ ప్రొవైడర్ యొక్క వివరములు విడిగా జారీచేయబడుతుంది.
కాబట్టి, మీరు బ్యాంకుకి చెల్లించాల్సిన మొత్తాన్ని విక్రయ నోటీసును ప్రచురించే తేదీకి ముందు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు బ్యాంక్ వెచ్చించిన ఖర్చులతో కలిపి చెల్లించినట్లయితే, ఆస్తి అమ్మకంపై తదుపరి చర్య తీసుకోబడదు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం తనఖాఆస్తులను విడిపించుకొను హక్కు కలదు.

స్థిరాస్తి వివరములు

షెడ్యూల్-ఏ: కృష్ణాజిల్లా-520011, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్, ముత్యాలంపాడు, ప్రస్తుత డి నం.21-1-7ఎ, అసెస్‌మెంట్ నం.18559, కొత్త అసెస్‌మెంట్ నం.130305, మున్సిపల్ వార్డ్ నం.46, ప్రస్తుత వార్డ్ నం.42, బ్లాక్ నం.31, రెవెన్యూ వార్డ్ నం.15, ఎన్.టి.ఎస్.నం.151లో **"సాయిశ్రీ టవర్స్"** పేరుతో కలిగిన నివాస అపార్ట్‌మెంట్ ఈ దిగువ హద్దులలో **ఉత్తరం:** యు సీతమ్మ మరియు సీతా రామరాజు గార్ల ఆస్తి, **దక్షిణం:** మున్సిపల్ రోడ్, **తూర్పు:** టి వెంకటేశ్వర రాజు మరియు వెంకట రామరాజు గార్ల ఆస్తి, **పడమర:** పాలేటి రత్నం గారి ఆస్తి. పైన తెలిపిన సరిహద్దులలో మొత్తం 321.75 చదరపు గజాలు లేదా 269.02 చదరపు మీటర్ల విస్తీర్ణంలో యు.డి.ఎస్. 25.0 చదరపు గజాలు లేదా 20.90 చదరపు మీటర్ల స్థలం
షెడ్యూల్-బి: "సాయిశ్రీ టవర్స్"లో గ్రౌండ్ ఫ్లోర్‌లోని నివాస ఫ్లాట్ నెం. జి.ఎఫ్-1, 625-0 చ॥అ॥ల ఆర్.సి.సి ప్లింత్ ఏరియా మరియు కామన్ ఏరియా మరియు మొదలైన వసతులు మరియు హక్కులతో కలిపి ఈ దిగువ హద్దులలో **ఉత్తరం:** యు.సీతమ్మ గారి ఆస్తి, **దక్షిణం:** ఫ్లాట్ నెం.జి.ఎఫ్-2 ఆస్తి, **తూర్పు:** టి. వెంకటేశ్వర రాజు మరియు వెంకట రామరాజు గార్ల ఆస్తి, **పడమర:** పాలేటి రత్నం ఆస్తి

తేది : 01-12-2025
ప్రదేశం : విజయవాడ
చీఫ్ మేనేజర్ / అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచ్ విజయవాడ

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (భారత ప్రభుత్వ రంగ సంస్థ) ...విశ్వాసానికి మరోపేరు
CO- SAM (స్ట్రెస్సడ్ అస్సెట్ మేనేజ్‌మెంట్) 9-35, కావూరి టవర్స్, కామయ్య తోపు, కానూరు, విజయవాడ, ఆం.ప్ర.-520007, మొబైల్ నెం.: 6362844637 ఈ-మెయిల్ : cs8332@pnb.co.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 8(6) r/w 9(1) నిబంధనలతో చదువబడే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం నోటీసు

ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ, యావన్మంది ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) & హామీదారు(లు)కు నోటీసు జారీచేస్తూ తెలియజేయునది ఏమనగా, దిగువ సెక్యూర్డు క్రెడిటార్ గారికి తనఖా ఉంచిన/ఛార్జిలో ఉన్న స్థిరాస్తులను నిర్మాణాత్మకంగా / భౌతికంగా / లాంచనాత్మకంగా బ్యాంకు అధీకృత అధికారిగారు సెక్యూర్డు క్రెడిటార్ గారు స్వాధీనత తీసుకుని వాటిని **"ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నదో అదే పద్ధతిపై"** దిగువ పట్టికలో తెలిపిన తేదీలలో బ్యాంకు/సెక్యూర్డు క్రెడిటార్ గారు సదరు ఋణగ్రహీత(లు), హామీదారు(లు) నుండి రావలసిన బకాయిలను వసూలు నిమిత్తం ఈ నోటీసు జారీచేస్తున్నారు. ప్రతి ఆస్తికి ఎదుట దిగువ పట్టికలో రిజర్వు ధర & ధరావత్తు వివరములు తెలుపబడినవి.

ఇ-వేలం తేది, సమయం : 12-01-2026
ఉ॥ గం॥ 11.00 నుండి సా॥ గం॥ 4.00 వరకు

బయానా చెల్లింపునకు ఆఖరు తేది: **12.01.2026,** సాయంత్రం 4 గం॥ల లోపు
బిడ్ పెంపుదల మొత్తం: **రూ.10,000/-**

1) ఋణగ్రహీత పేరు / బ్యాంకుకు మొత్తం బకాయిలు: 1) శ్రీసత్య సాయి ఏజెన్సీస్, ప్రాతినిధ్యం వహించు ప్రొప్రయిటర్: శ్రీ తలారి వెంకట హనుమంతరావు, ఖాతా నెం.4238008700000901
26-17-198, కంకరగుంట గేట్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002, 2) **శ్రీ తలారి వెంకట హనుమంతరావు,** తండ్రి: శ్రీ వెంకట నరసింహారావు, 14వ వార్డు, బసివిరెడ్డిపేట, నిడదవోలు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా-534301, 3) **శ్రీమతి తలారి వీర వెంకట నాగమణి,** భర్త: లేటు వెంకట హనుమంతరావు, బి-4, శ్రీనిలయం అపార్ట్‌మెంట్స్, దర్లవారి వీధి, గాంధీనగర్, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా-533004, 4) **కుమారి తలారి సాయి హర్షిత,** తండ్రి: లేటు వెంకట హనుమంతరావు, బి-4, శ్రీనిలయం అపార్ట్‌మెంట్స్, దర్లవారి వీధి, గాంధీనగర్, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా-533004, 5) **శ్రీ తలారి నరసింహారావు,** తండ్రి: లేటు అప్పారావు, బసివిరెడ్డిపేట, నిడదవోలు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా-534301, 6) **శ్రీమతి తలారి రత్నమాల,** భర్త: నరసింహారావు, బసివిరెడ్డిపేట, నిడదవోలు, పశ్చిమ గోదావరి జిల్లా-534301, 7) **శ్రీ తలారి వెంకట హనుమంతరావు,** తండ్రి: శ్రీ వెంకట నరసింహారావు, డి.నెం.14-9-3/2, నిడదవోలు గ్రామం, పశ్చిమ గోదావరి జిల్లా-534301.
బ్రాంచ్ ఆఫీస్: 423800 - గుంటూరు అరండల్‌పేట
డిమాండ్ నోటీసు తేది: **28-02-2007** స్వాధీనతా తేది: **26-06-2007**
బకాయి మొత్తం: **తేది.30.09.2025 నాటికి బకాయి రూ.32,39,831/-** మరియు తదుపరి వడ్డీ, ఛార్జీలు, వ్యయాలు మరియు ఇతర ఖర్చులు. స్వాధీనతా స్వభావం: **లాంఛనాత్మకం**
సెక్యూరిటీ / ఆస్తి వివరాలు: **తనఖా చేసిన / యజమాని పేరు (తనఖాదారుల ఆస్థి(లు)):** తవ **డాక్యుమెంట్ నెం.1566/2004, తేదీ 07-05-2004 ప్రకారం శ్రీ తలారి వెంకట హనుమంతరావు గారి పేరున గల ఆస్థి:** నిడదవోలు పట్టణం మరియు మండలం, ఆర్.ఎస్.నెం.284/10, సమీప పాత డి.నెం.14-6-2, కొత్త డి.నెం.14-9-3/2లో ఉన్న 376 చ.గజాల విస్తీర్ణం గల స్థలం. **హద్దులు: తూర్పు:** శ్రీ తలారి వెంకటరావు గారి ఇంటి గోడ 57'-0", **పడమర:** తలారి గోపాలకృష్ణరావు గారి ఆస్తి మరియు తలారి వెంకట హనుమంతరావు గారి ఆస్తి-57'-0", **దక్షిణం:** గోశాల సత్యనారాయణమూర్తి గారి ఇంటి గోడ - 58'-0", **ఉత్తరం:** మున్సిపల్ రోడ్-61'-0".
సెక్యూర్డ్ క్రెడిటార్స్‌కు తెలిసిన మేరకు ఋణభారముల వివరాలు : ఋణ భారములు ఏమి లేవు.
రిజర్వు ధర: రూ.22,75,000/- **ధరావత్తు : రూ.2,27,500/-**

ఇ-వేలం నియమ నిబంధనలు : 1) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని నియమ & నిబంధనలను అనుసరించి దిగువ తదుపరి తెలిపిన నిబంధనలను అనుసరించి అమ్మకం జరుపబడును. 2) ఆస్తులను **'ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నవో అదే పద్ధతిపై"** విక్రయించబడతాయి. **3)** అధీకృత అధికారి గారి వద్దగల షెడ్యూలులోని సెక్యూర్డు ఆస్తికి సంబంధించిన ఉత్తమ వివరముల మేరకు తెలుపబడినవి. కాని సదరు వివరములలోని తప్పులకు, తప్పుడు వివరములకు, వదిలివేయబడుటలకు అధీకృత అధికారి గారు సమాధానం తెలుపవలసిన అవసరం లేదు. **4)** అమ్మకం ఇ-వేలం పోర్టల్ **https://baanknet.com** ద్వారా ఆన్‌లైన్‌లో దిగువ సంతకందారు **తేది.12-01-2026, ఉదయం గం.11-00 ల నుండి సాయంత్రం గం.4-00ల వరకు** నిర్వహించెదరు. **5)** అమ్మకం యొక్క పూర్తి వివరములతో నియమ నిబంధనల కొరకు దయజేసి **https://baanknet.com & www.pnbindia.in** వెబ్‌సైటులు చూడవలెను.

సర్ఫేసి చట్టం 2002 లోని రూలు 8(6) r/w 9(1) ప్రకారం చట్టబద్ధమైన అమ్మకం ప్రకటన

ప్రదేశం: విజయవాడ, తేది: 05-12-2025 — సం/- అధీకృత అధికారి, పంజాబ్ నేషనల్ బ్యాంక్

ఎట్టకేలకు కేంద్రం జోక్యం

- విమాన ఛార్జీలపై నియంత్రణ
- నేటి రాత్రికల్లా రిఫండ్ ఇచ్చేయాలని ఆదేశాలు
- ప్రత్యేక రైళ్లు, అదనపు బోగీల ఏర్పాటు
- సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ : విమాన ప్రయాణికులు ఐదు రోజులపాటు నానా అవస్థలు పడిన తరువాత కేంద్రం శనివారం జోక్యం చేసుకుంది. రద్దయిన విమానాలకు సంబంధించి ఎలాంటి జాప్యం లేకుండా పెండింగ్‌లో ఉన్న రిఫండ్‌లను వెంటనే చెల్లించాలని మంత్రిత్వ శాఖ ఇండిగో యాజమాన్యాన్ని ఆదేశించింది. ఈ ప్రక్రియను ఆదివారం రాత్రి 8 గంటల కల్లా పూర్తి చేయాలని సూచించింది. తమ వినియోగదారులకు వేగంగా రిఫండ్ అందించడంపై దృష్టి సారించినట్లు ఇండిగో తెలిపింది. ప్రయాణికులకు ఫ్లైట్ షెడ్యూల్ వివరాలను వెబ్‌సైట్లు, మొబైల్ నోటిఫికేషన్ల ద్వారా కూడా అందిస్తున్నట్లు వెల్లడించింది.

టికెట్ రేట్ల పెంపుపై నియంత్రణ

ఇండిగోలో సంక్షోభంతో వందలాది విమానాల రద్దు అవుతున్న పరిస్థితులను ఆసరాగా తీసుకుని కొన్ని విమానయాన సంస్థలు అడ్డగోలుగా టికెట్ల ధరలను పెంచాయి. ఇప్పటికే లక్షలాది మంది ప్రయాణికులు తమ అత్యవసర ప్రయాణాల కోసం రెండు నుంచి పది రెట్ల వరకూ అధికంగా చెల్లించి ముందస్తు, తక్షణ ప్రయాణాల కోసం టికెట్లను బుక్ చేసుకున్నారు. ఈ అధిక విమాన చార్జీలపై విమానాశ్రయాలు సహా సోషల్ మీడియాలో తీవ్ర ఆందోళన నెలకొనడంతో ఎట్టకేలకు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ స్పందించింది. విమాన టికెట్ ధరలపై నియంత్రణ విధిస్తున్నట్లు తెలిపింది. 500 కిలోమీటర్ల వరకు గరిష్టంగా రూ.7,500, 500–1000 కిలోమీటర్ల వరకు రూ.12,000, 1000–1500 కిలోమీటర్ల వరకు రూ.15,000, 1500 కిలోమీటర్లు దాటితే రూ.18,000 వరకు మాత్రమే టికెట్ చార్జీలను వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అంతరాయాల సమయంలో అసాధారణంగా ఛార్జీలను పెంచడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పేర్కొంది. కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకునేవరకు కొత్తగా సూచించిన పరిమితులను కచ్చితంగా పాటించాల్సిందేనని పేర్కొంది. రీజనల్ మార్గాల్లో రాయితీతో నడిచే ఉడాన్ విమానాలు ఆర్‌సిఎస్ – యుడిఎస్ విమానాలకు, బిజినెస్ క్లాస్‌కు ఈ ఛార్జీలు వర్తించవని వెల్లడించింది.



48గంటల్లోగా లగేజి అప్పగించండి

విమానాల రద్దు లేదా జాప్యం కారణంగా ప్రయాణికుల నుండి వేరుపడిన వారి బ్యాగేజీ ఎక్కడుందో కనుగొని, వచ్చే 48గంటల్లోగా వారికి అందజేయాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర పౌర విమానయాన శాఖ శనివారం ఇండిగోని ఆదేశించింది.

ఇండిగో సిఇఓ క్షమాపణలు

బడ్జెట్ ఎయిర్‌లైన్స్‌గా గుర్తింపు పొందిన ఇండిగో శుక్రవారం నాడు వెయ్యికి పైగా విమాన సర్వీసులను రద్దు చేసింది. గత నాలుగు రోజులుగా ఇంత గందరగోళం నెలకొన్నా నోరు విప్పని ఇండిగో సిఇఓ పీటర్ అల్బర్స్ ప్రయాణికులకు కలిగించిన అసౌకర్యానికి చింతిస్తున్నామంటూ క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ఒక వీడియో విడుదల చేశారు. జరిగిన దానిపై వివరణ ఇస్తూ ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యామని అంగీకరించారు. అంతర్గతంగా తమ అన్ని వ్యవస్థలను, షెడ్యూళ్లను తిరిగి పునరుద్ధరించే పనిలో వున్నామన్నారు. విమానాల రద్దు, ఆలస్యం, అంతరాయాలపై క్షమాపణలు కోరుతూ వచ్చే పది రోజుల్లో కార్యకలాపాలు సాధారణ స్థితికి వస్తాయని హామీ ఇచ్చారు. ఈ పరిస్థితి మరింత కాలం కొనసాగవచ్చని వైమానిక రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

సిఇఓపై వేటు?

ఇండిగో సేవల్లో అంతరాయం, సంక్షోభం నేపథ్యంలో ఆ సంస్థ సిఇఓ పీటర్ అల్బర్స్‌ను పదవి నుండి తొలగించాలని కేంద్రం, ఇండిగో బోర్డుకు ఆదేశాలు జారీ చేసే అవకాశం వున్నట్లు తెలుస్తోంది. ఆ సంస్థకు భారీగా జరిమానా కూడా విధించే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

టికెట్ ధరలపై పర్యవేక్షణ : మంత్రి రామ్మోహన్ నాయుడు

టికెట్ ధరలను పెంచకుండా పర్యవేక్షిస్తున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఎయిర్‌లైన్స్, ట్రావెల్ ప్లాట్‌ఫామ్స్‌పై ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి పెట్టిందన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రత్యేకంగా కమిటీ వేసి విచారణకు ఆదేశించామన్నారు. కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటివరకు జరిగినదానిపై ఇండిగో కచ్చితంగా సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించామన్నారు. రైల్వే శాఖ కూడా ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసిందన్నారు. గత కొన్ని రోజులుగా ఇండిగో విమానాలతో నెలకొన్న సంక్షోభం నేపథ్యంలో ఫిబ్రవరి 10 వరకు కొత్త నిబంధనల అమలు నుండి ఇండిగోను మినహాయిస్తున్నట్లు కూడా ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

ప్రభుత్వం బాధ్యత వహించాలి : సిపిఐ

ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు చూస్తుంటే ఒక కంపెనీ ఎయిర్‌లైన్స్ రంగంలో ఆధిపత్యం చెలాయిస్తే ప్రయాణికులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నమవుతాయో తెలుస్తోందని సిపిఐ నేత డి.రాజా విమర్శించారు. దేశంలో నెలకొన్న ఈ సంక్షోభానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. అసలు ఏం జరిగిందో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని ఎన్‌సిపి నేత సుప్రియా శూలే కోరారు.

రైల్వే శాఖ కీలక నిర్ణయం

ఇండిగో సంక్షోభం వేళ భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. విమానాల రద్దు నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని దేశవ్యాప్తంగా 37 రైళ్లకు 116 అదనపు కోచ్‌లు అనుసంధానించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ రైల్వే మంత్రిత్వశాఖ ప్రకటన విడుదల చేసింది. దక్షిణ రైల్వేలో 18 రైళ్లకు అత్యధికంగా కోచ్‌లు పెంచింది. ఉత్తర, పశ్చిమ, తూర్పు, ఈశాన్య రైల్వే జోన్లలో కూడా స్పెషల్ కోచ్‌లు ఏర్పాటు చేసింది. అధిక డిమాండ్ ఉన్న మార్గాల్లో అదనపు ఛైర్ కార్, స్లీపర్ క్లాస్ కోచ్‌లను ఏర్పాటు చేసింది. వీటితోపాటు ప్రయాణికుల కోసం అదనంగా నాలుగు ప్రత్యేక రైళ్లను కూడా నడుపుతోంది.

'సుప్రీం'లో పిటిషన్

వరుసగా ఐదోరోజు కూడా వందలాది విమానాలు రద్దవడం, ఇతర విమానయాన సంస్థలు ధరలు విపరీతంగా పెంచడం, ప్రయాణికుల ఇబ్బందుల నేపథ్యంలో విమానాల రద్దుపై సుప్రీం కోర్టులో పిల్ దాఖలైంది. ప్రయాణికుల ఇబ్బందులపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పందించాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. పరిస్థితి తీవ్రతను పరిగణనలోకి తీసుకొని దీనిపై తక్షణమే విచారణ జరిపేందుకు ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోరారు. స్టేటస్ రిపోర్ట్ సమర్పించేలా పౌరవిమానయాన మంత్రిత్వశాఖ, డిజిసిఎను ఆదేశించాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్‌ను సుప్రీం పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఫ్రాన్స్ సెమీ క్రిస్మస్ వేడుకల్లో విషాదం

- కారు ఢీకొని 10 మంది మృతి

గ్వాడ్‌లూప్ : ఫ్రాన్స్‌లో క్రిస్మస్‌కు ముందు నిర్వహించే వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. ఫ్రాన్స్ ఓవర్సీస్ రీజియన్ అయిన గ్వాడెలూప్‌లోని సెయింట్–ఆన్‌లో క్రిస్మస్ వేడుకల ఏర్పాట్లలో ఉన్న జనసమూహంపైకి శుక్రవారం ఒక కారు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో తొమ్మిదిమంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అక్కడి అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, వైద్య బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ మద్యం, మాదక ద్రవ్యాలు సేకరించడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. గతేడాది జర్మనీ మాగ్డెబర్గ్ నగరంలోని క్రిస్మస్ మార్కెట్‌లోకి కారు దూసుకెళ్లడంతో ఇద్దరు మరణించగా, 68 మంది గాయపడ్డారు.

పెంచలయ్య హత్యను పసిగట్టలేకపోయాం

(మొదటిపేజి తరువాయి)

కాదని చెప్పే వాళ్లను ఏమనాలని ప్రశ్నించారు. రాజధాని పనుల్లో వేగం పెరిగిందని చెప్పారు. తనతో రాజధాని రైతుల సమావేశం తరువాత మంచి ఫలితాలు వస్తున్నాయని అన్నారు. రెండో దశ భూ సమీకరణకు కూడా రైతులు ముందుకొచ్చారని, ఇది మంచి పరిణామం అని చెప్పారు. ప్రజలు, రైతులు, ప్రభుత్వం అంతా సంతోషంగానే ఉన్నారని, కొందరికి మాత్రం కడుపుమండుతోందని పేర్కొన్నారు. పాఠశాలల్లో నిర్వహిస్తున్న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ఒక బ్రాండ్‌గా మారిందన్నారు. విద్యాశాఖలో తీసుకొస్తున్న మార్పులు ఫలితాలను ఇస్తున్నారని తెలిపారు. అంతకుముందు గ్రీవెన్స్‌లో భవానీపురంలో ఇళ్లు కూల్చేసిన బాధితులు సిఎంను కలిసి వినతిపత్రం అందించారు. ఈ అంశం తన దృష్టికి వచ్చిందని, న్యాయం చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఉద్యోగభద్రత, వేతన పెంపుతో పాటు పలు సేవా సంబంధిత అంశాలపై జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో సిఎంకు వినతిపత్రం అందించారు. అనంతరం టిడిపి రాష్ట్రఅధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌తో కలిసి పలు అంశాలపై సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా టిడిపి కార్యాలయానికి వచ్చిన చంద్రబాబు అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

'కీలక దశ' లో గాజా కాల్పుల విరమణ ఒప్పందం!

- రెండోదశపై కసరత్తు
- పలు ప్రశ్నలు, సందేహాలను పరిష్కరించాల్సి వుందన్న నేతలు

దోహా సమావేశంలో మాట్లాడుతున్న కతార్ ప్రధాని షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ అల్ తాని

దోహా : గాజా కాల్పుల విరమణ ఒప్పందం ప్రస్తుతం 'కీలక దశ'లో వుందని కతార్ ప్రధాని షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ అల్ తాని వ్యాఖ్యానించారు. మొదటి దశ ముగిసిందని, ఇక ఒప్పందాన్ని మరింత బలపరిచేలా రెండోదశను అమలు చేయడానికి అమెరికా నేతృత్వంలో అంతర్జాతీయ మధ్యవర్తుల కసరత్తు జరుగుతోందని చెప్పారు. దోహాలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ "ఇప్పుడు మనం ఒక విరామం ఇచ్చాం" అని పేర్కొన్నారు. "దీన్ని ఇంకా కాల్పుల విరమణగా పరిగణించలేం, పూర్తిగా ఇజ్రాయిల్ బలగాలు వైదొలగకుండా, గాజాలో సుస్థిరత నెలకొనకుండా, ప్రజలు స్వేచ్ఛగా లోపలకు, బయటకు రాకపోకలు సాగించకుండా కాల్పుల విరమణ జరిగిందని చెప్పలేం." అని ప్రధాని షేక్ మహ్మద్ వ్యాఖ్యానించారు. రాబోయే దశ అయినా తాత్కాలికమే అవుతుందని కతార్ ప్రధాని వ్యాఖ్యానించారు. పాలస్తీనా దేశం ఏర్పడటమే ఈ ప్రాంతంలో శాశ్వత శాంతి స్థాపనకు అత్యవసరమైన అంశమని వ్యాఖ్యానించారు. ఈ ఘర్షణకు మూల కారణాన్ని, సమస్యను పరిష్కరించనిదే సమస్య పరిష్కారం కాదని అన్నారు. టర్కీ విదేశాంగ మంత్రి హకన్ ఫిదాన్ మాట్లాడుతూ, గాజాలో అంతర్జాతీయ భద్రతా బలగాల ఏర్పాటుపై పెద్ద ప్రశ్న నెలకొని వుందన్నారు. ఈ బలగాల్లో ఏ ఏ దేశాలు వుంటాయో ఇంకా స్పష్టత రాలేదన్నారు. అసలు కమాండ్ వ్యవస్థ ఎలా వుంటుందీ, అది చేపట్టబోయే మొదటి మిషన్ ఏమిటి ఇలాంటివేవీ తెలియవన్నారు. వేలాదిగా ప్రశ్నలు దీనిపై తలెత్తుతున్నాయని వ్యాఖ్యానించారు.

కొనసాగుతూనే ఉన్న ఇజ్రాయిల్ మారణహోమం

ఒప్పందంలో మొదటి దశలో భాగంగా రెండేళ్లుగా సాగుతున్న భీకర పోరును తాత్కాలికంగా ఆపారు. అక్టోబరు 10న తొలి దశ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల్లో 360మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య శాఖాధికారులు తెలిపారు. గాజాలో తమ ఆధీనంలో వున్న భూభాగంలోకి అడుగుపెట్టిన పాలస్తీనియన్లపై దాడులు జరిపామని ఇజ్రాయిల్ ఆర్మీ సమర్ధించుకుంటోంది. రెండో దశలో భాగంగా గాజాలో అంతర్జాతీయ భద్రతా బలగాలను మోహరించాల్సి వుంది. సాంకేతిక పరంగా కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి వుంది. హమాస్ ఆయుధాలు అప్పగించాల్సి వుంది. గాజా నుండి పూర్తిగా ఇజ్రాయిల్ బలగాల ఉపసంహరణ జరగాల్సి వుంది.

రూపాయి విలువ మార్కెట్ శక్తులకు వదిలేయాలి: మంత్రి సీతారామన్



న్యూఢిల్లీ : ప్రపంచ మార్కెట్‌లో రూపాయి విలువ రికార్డ్ కనిష్టాలను నమోదు చేస్తోంటే.. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాత్రం పెద్ద ఆందోళన ఏమీ వద్దని అన్నారు. కరెన్సీ హెచ్చు తగ్గులు ఆర్థిక వ్యవస్థ పనితీరును నిర్ణయించలేవని, మార్కెట్ శక్తులకు వదిలివేయాలని చెప్పారు. శనివారం హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో రూపాయి పతనంపై మంత్రి మాట్లాడారు. ఇటీవల డాలర్‌తో రూపాయి 91 చేరువలో నమోదవడంపై ప్రభుత్వం తరుపున మంత్రి తొలిసారి స్పందించారు. రూపాయి విలువలో భారీ జోక్యం చేసుకోకుండా మార్కెట్ శక్తులకు వదిలివేయాలని మంత్రి పేర్కొన్నారు. మారకం రేట్లు చాలా సున్నితమైనవని తెలిపారు. కరెన్సీ కదలికలను అతిగా రాజకీయం చేయడం లేదా అతిగా నిర్వహించడం చేయకూడదని చెప్పుకొచ్చారు. విమర్శకులు రూపాయి క్షీణతపై కాకుండా ప్రస్తుత భారత వృద్ధి రేటుపై దృష్టి పెట్టాలన్నారు. రూపాయి విలువ తగ్గినప్పుడు ఎగుమతిదారులు ప్రయోజనం పొందుతారన్నారు. దీంతో భారత వస్తువుల ఎగుమతికి మద్దతు లభిస్తుందన్నారు. భారత ఎగుమతి వస్తువులు ఎవరికి చౌకగా మారుతున్నాయో మంత్రి వివరిస్తే బాగుండేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కుటుంబాల్లో పొదుపు తగ్గుతోందన్న ఆందోళనలను మంత్రి తప్పుబట్టారు. పొదుపు, పెట్టుబడులు పెరుగుతున్నాయంటూ సమర్థించుకున్నారు. పైగా ఆస్తులు పెరుగుతున్నాయని తెలిపారు. రూపాయి విలువ పతనమై, ధరలు విపరీతంగా పెరిగి సామాన్యుడు సతమతమవుతుండగా కేంద్ర మంత్రి అడ్డగోలుగా సమర్ధించడం సరికాదని పలువురు ఆర్థిక విశ్లేషకులు విమర్శిస్తున్నారు.

ఆఫ్ఘన్ సరిహద్దుల్లో ఘర్షణలు

- పాక్ దాడుల్లో నలుగురు ఆఫ్ఘన్లు మృతి
- ఒప్పందాన్ని ఖాతరు చేయని పాకిస్తాన్

కాందహార్ ప్రావిన్స్‌లోని సరిహద్దులో మృతిచెందిన వారికి అంత్యక్రియల సందర్భంగా ప్రార్థనలు చేస్తున్న ఆఫ్ఘన్లు

కాబుల్ : ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దులో పాకిస్తాన్ దళాలు దాడులు చేశాయి.. ఈ దాడుల్లో నలుగురు ఆఫ్ఘనిస్తాన్ పౌరులు మృతి చెందారు. ఈ విషయాన్ని కాందహార్ ప్రావిన్స్‌లోని నిస్పిన్ బోల్డాక్ జిల్లా గవర్నర్ శనివారం ధృవీకరించారు. పాకిస్తాన్ దళాలు స్పిన్ బోల్డాక్ ప్రాంతంలో దాడులు చేశాయని, దీంతో ఆఫ్ఘన్ దళాలు స్పందించాయని ఆఫ్ఘనిస్తాన్ తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబిహూల్లా ముజాహిద్ సోషల్ మీడియాలో తెలిపారు. మరోవైపు చమన్ సరిహద్దులో ప్రశాంత వాతావరణం ఉన్నప్పటికీ పాక్ దళాలు కాల్పులు జరిపాయి.. అయితే పాకిస్తాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ ఆఫ్ఘన్ దళాలే ముందుగా కాల్పులు జరిపాయని ఎదురుదాడి చేశారు. "పాకిస్తాన్ తన ప్రాదేశిక సమగ్రతను, పౌరుల భద్రతను కాపాడుకోవడానికి పూర్తిగా అప్రమత్తంగా ఉందని " ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. 2021లో తాలిబన్లు అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి.

దీనికి కారణం తాలిబన్ ప్రభుత్వం టిటిపితో సహా అనేక సాయుధ గ్రూపులకు ఆశ్రయం కల్పిస్తోందని పాకిస్తాన్ ఆరోపిస్తుంది.. 2007 నుండి పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా టిటిపి ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తుందని పాక్ చెబుతుంది.. బుధవారం పాకిస్తాన్‌లో జరిగిన బాంబు దాడిలో ముగ్గురు పాకిస్తాన్ పోలీసు అధికారులు మరణించారని పేర్కొంది. బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ , ఐఎస్ఐఎస్ఐ అనుబంధ సంస్థలకు ఆఫ్ఘనిస్తాన్ ఆశ్రయం కల్పిస్తోందని పాకిస్తాన్ ఆరోపించింది. అయితే తాలిబన్లు ఈ ఆరోపణలను ఖండించారు. పాకిస్తాన్ లోపల భద్రతకు తాము బాధ్యత వహించలేమని ఇస్లామాబాద్ ఉద్దేశపూర్వకంగా తమపై విషప్రచారాన్ని వ్యాప్తి చేసి సరిహద్దు ఉద్రిక్తతలను రెచ్చగొడుతోందని స్పష్టం చేశారు. అక్టోబర్ 19న ఖతార్ రాజధాని దోహాలో ఆఫ్ఘన్, పాకిస్తాన్ అధికారులు కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నారు. అయితే ఈ ఒప్పందం తర్వాత ఖతార్, టర్కీ , సౌదీ అరేబియా దేశాలు నిర్వహించిన వరుస చర్చలు విఫలమయ్యాయి. గత వారంలో సౌదీ అరేబియాలో జరిగిన చర్చలు కూడా పురోగతిని సాధించలేకపోయాయి. పాకిస్తాన్ మాజీ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ దేశ తొలి రక్షణ దళాల అధిపతి (సిడిఎఫ్)గా భాధ్యతలు చేపట్టిన తరువాత ఆఫ్ఘనిస్తాన్‌తో ఉద్రిక్తతలు పెరగటం గమనార్హం.

భారత్-రష్యా భాగస్వామ్యం అత్యంత సుస్థిరం!: జైశంకర్

న్యూఢిల్లీ : గత ఏడెనిమిది దశాబ్దాల్లో భారత్–రష్యా భాగస్వామ్యం 'అత్యంత సుస్థిరంగా కొనసాగుతున్న అతిపెద్ద సంబంధాల్లో ఒకటి' అని విదేశాంగ మంత్రి జైశంకర్ వ్యాఖ్యానించారు. ఆర్థిక సంబంధాలపై ప్రధానంగా దృష్టి పెడుతూ పుతిన్ ప్రస్తుత భారత్ పర్యటన సాగిందని చెప్పారు. ఇక్కడ జరిగిన ఒక మీడియా సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై భారత్ చర్చలు సాగుతున్న వేళ పుతిన్ పర్యటన మరిన్ని ఇబ్బందులు కలగజేయగలదన్న అభిప్రాయాలతో ఆయన ఏకీభవించలేదు. ప్రపంచంలోని అన్ని ప్రధాన దేశాలతో భారత్‌కు సత్సంబంధాలున్నాయని ప్రతి ఒక్కరికీ తెలుసునని చెప్పారు. ఇతర దేశాలతో మనం సంబంధాలు ఎలా వృద్ధి చేసుకోవాలో చెప్పాలని ఏ దేశమైనా మనకు చెప్పాలనుకోవడం సహేతుకమైన ప్రతిపాదన కాదని ఆయన వ్యాఖ్యానించారు. "ఇతరులు కూడా ఇదే ఊహించుకోవచ్చు, కానీ మనకు అనేక సంబంధాలుంటాయి, వాటిలో ఏది కావాలో ఎంచుకునే స్వేచ్ఛ మనకు వుంటుంది. ఈ విషయం మనం ఎల్లప్పుడూ స్పష్టం చేస్తూనే వచ్చాం." అని జై శంకర్ తేల్చి చెప్పారు. భారత్ వంటి పెద్ద, ఆవిర్భవిస్తున్న దేశానికి సాధ్యమైనంత మందితో మంచి సహకారాన్ని, సంబంధాలను కొనసాగించడం చాలా ముఖ్యమని అన్నారు. భారత్, రష్యా సంబంధాలను చూసినట్లైతే గత 70, 80 సంవత్సరాల్లో ప్రపంచం అనేక ఎత్తుపల్లాలను చూసింది, కానీ రెండు దేశాల మధ్య సంబంధాలకు సంబంధించినంత వరకు అవి అత్యంత సుస్థిరంగా సాగాయని చెప్పారు. అనేక దేశాలతో మన సంబంధాలు ఇలాగే వుంటాయన్నారు.

కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం ఎంపి సచ్చిదానందం తదితరులు

అండమాన్, నికోబార్ దీవుల్లో సముద్ర జల రవాణా మెరుగుపరుస్తాం

- సిపిఎం ఎంపికి కేంద్ర మంత్రి హామీ

పోర్ట్ బ్లెయిర్ : అండమాన్ నికోబార్ దీవుల్లోని ప్రజలకు సముద్ర జలాల రవాణా, అనుసంధానతను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవడానికి తమ ప్రభుత్వం కట్టుబడి వుందని కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి శర్వానంద సోనోవాల్ దిండిగల్ సిపిఎం ఎంపి ఆర్.సచ్చిదానందంకు హామీ ఇచ్చారు. షిప్పింగ్ సేవలనేవి ఈ ప్రాంతానికి జీవనాడి వంటివని గుర్తించామని చెప్పారు. ఈ మేరకు మంత్రి ఇటీవల ఎంపికి ఒక లేఖ రాశారు. అండమాన్ నికోబార్ దీవుల మధ్య ప్రయాణికులు, సరుకుల రవాణాను మెరుగుపరిచేందుకుగానూ ముఖ్యంగా దక్షిణాది ద్వీప సముదాయానికి మెరుగైన రాకపోకల కోసం అండమాన్ నికోబార్ పాలనా యంత్రాంగం చర్యలు తీసుకుందని చెప్పారు. 300మంది ప్రయాణికులు పట్టే రెండు పడవలను అద్దెకు తీసుకుందని, 200 టన్నుల సరుకు పట్టే నాలుగు బోట్లను కొనుగోలు చేసిందని తెలిపారు. సరుకు రవాణాలో నెలకొన్న ఇబ్బందుల పరిష్కారానికే ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుందని, దీనివల్ల ప్రైవేటు ఆపరేటర్ల గుత్తాధిపత్యం తగ్గుతుందని, పైగా దీవుల్లో నిత్యావసరాల ధరలు కూడా తగ్గుతాయని చెప్పారు. ఇవి కాకుండా అవసరమైతే 500మంది ప్రయాణికులు పట్టే పడవలను దీవుల మధ్య రవాణాకు ముఖ్యంగా మెయిన్‌ల్యాండ్ సెక్టార్‌లో మోహరించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

రెండోదశ పూలింగ్ అంటే రైతులను మోసం చేయడమే

(మొదటిపేజి తరువాయి)

చేయడం వల్లే రైతులకు ఈ పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు రెండోదశ పూలింగు గురించి మాట్లాడలేదని, అప్పుడు ఎందుకు ఈ ప్రకటన చేయలేదని ప్రశ్నించారు. సెస్ మాజీ ప్రొఫెసర్ సి.రామచంద్రయ్య మాట్లాడుతూ తొలిదశలో తీసుకున్న రైతుల సమస్యలనే ఇప్పటి వరకూ పరిష్కరించలేదని, చిన్న రైతుల గురించి అసలు పట్టించుకోవడం లేదని అన్నారు.. కాంగ్రెస్ నాయకులు తులసీరెడ్డి మాట్లాడుతూ అమరావతి రాజధాని ప్రజా రాజధానిగా ఉండాలనేది కాంగ్రెస్ పార్టీ విధానమన్నారు. సెల్ఫ్‌ఫైనాన్స్‌సిటీ అంటూ రూ.60 వేలకోట్ల అప్పులు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. సిపిఐ జాతీయ నాయకులు అక్కినేని వనజ మాట్లాడుతూ రాజధాని రైతులకు జరుగుతున్న అన్యాయంపై మరోసారి ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రైతు శ్రీధర్ మాట్లాడుతూ తమ సమస్యలపై ముఖ్యమంత్రికి, మంత్రి లోకేష్, నారాయణ, సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబుకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక కార్యకర్త వసుంధర మాట్లాడుతూ అమరావతిలో పేదల బతులకు దయనీయంగా ఉన్నాయని, పెద్ద రైతులు తప్ప పేద రైతుల సమస్యలు పట్టించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. అనంతవరానికి చెందిన రైతు ఆలూరి రఘునాథరావు మాట్లాడుతూ రెండోదశ పూలింగు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు. రాజధాని ప్రాంత సిఐటియు నాయకులు ఎం.రవి మాట్లాడుతూ లక్షకోట్లతో అమరావతి నిర్మిస్తున్నామని చెబుతున్నా పారిశుధ్య కార్మికులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు.తణుకుకు చెందిన చిర్ల రాజేంద్రప్రసాదరెడ్డి మాట్లాడుతూ రెండోదశ పూలింగును వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రౌండ్‌టేబుల్ సమావేశం ఆమోదించిన తీర్మానాన్ని వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రకటించగా ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఉల్లికి పరిహార(స)ం..!

(మొదటిపేజి తరువాయి)

ప్రకటించారు. సెప్టెంబర్‌లో ఈ ప్రకటన చేసినా నేటికీ అమలుకు నోచుకోలేదు. ఈ పరిహారానికి ఎవరు అర్హులనే విధివిధానాలు కూడా ఖరారు కాలేదు. ఈ పరిహారం అంశాన్ని గత నెల ఏడున జిల్లా పరిషత్ సమావేశంలోనూ పలువురు ఎంపిపిలు, జడ్‌పిటిసి సభ్యులు ప్రస్తావించారు. పరిహారం ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. 13 వేల ఎకరాలకు ప్రతిపాదనలు పంపామని, ఇంకా విధివిధానాలు ఖరారు కాలేదని ఉద్యాన శాఖ అధికారులు సమాధానం ఇచ్చారు. ప్రభుత్వం పరిహారం ఇస్తే అప్పులు తీర్చుకోవాలని రైతులు ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

1.50 ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశాను. దాదాపు 90 రోజులు వరకు కంటికి రెప్పలా పంటను కాపాడుకున్నాను. పంట కోత కోసే సమయానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో ట్రాక్టర్‌తో దున్నేశాను. నాతోపాటు అనేక మంది రైతులు పంటను మేకలకు, పశువులకు వదిలేశారు. నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.

– నాగరాజు, పెద్దహుల్తి, పత్తికొండ మండలం

తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలి

ఉల్లి ధరలు పతనమైనప్పుడు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలు రూ.1200కు కొంటామని చెప్పి మూడు రోజులే కొని ఆపేసింది. హెక్టారుకు రూ.50 వేలు ఇస్తామని చంద్రబాబు మాట ఇచ్చి అమలు చేయకపోవడం రైతులను మోసగించడమే. రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. ఉల్లి రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి. హెక్టారుకు రూ.50 వేలు తక్షణమే వారి ఖాతాల్లో జమ చేయాలి.

– కె ప్రభాకర రెడ్డి, ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పొమ్మనకుండా పొగ...!

(మొదటిపేజి తరువాయి)

(8 నెలల్లో) కేవలం 3.30 కోట్లు పని దినాలు మాత్రమే పూర్తి చేశారు. గిరిజనులు గత ఆర్థిక సంవత్సరంలో 3.02 కోట్ల పని దినాలు పూర్తి చేస్తే, ఈ ఏడాది ఇప్పటి వరకూ (8 నెలల్లో) కేవలం 1.88 కోట్ల పని దినాలు మాత్రమే పూర్తి చేశారు. ఈ పథకంలో పని చేసిన దళిత, గిరిజనుల సంఖ్య కూడా గత ఏడాది కంటే భారీగా తగ్గుదల కనిపిస్తుంది. గత ఏడాది దళితుల్లో 17.51 లక్షల మందికి పని కల్పించగా, ఈ ఏడాది ఆ సంఖ్య 14.30 లక్షలకు పడిపోయింది. గిరిజనుల విషయానికి వస్తే గత ఏడాది 7.84 లక్షల మందికి పని కల్పించగా, ఈ ఏడాది 6.93 లక్షల మందికి తగ్గింది. ఫలితంగా పని దినాల కల్పన తగ్గినట్లు స్పష్టం అవుతుంది. రాష్ట్రంలోనే అత్యల్పంగా విశాఖపట్నం జిల్లాలో 2,746 మంది దళితులకు, 358 మంది గిరిజనులకు మాత్రమే ఈ ఏడాది పని కల్పించడం గమనించాల్సిన విషయం.

వేళ్లపైనే వంద రోజులు పని చేసిన కుటుంబాలు

మరోవైపు ఈ ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికి చేరుకున్నా వంద రోజుల పని పూర్తి చేసుకున్న గిరిజన కుటుంబాలు నామమాత్రంగానే ఉన్నాయి. కొన్ని జిల్లాలో వారి సంఖ్య రెండంకెలు కూడా దాటలేదు. విశాఖపట్నం జిల్లాలో కేవలం 2, పశ్చిమ గోదావరి జిల్లాలో 6, కాకినాడ జిల్లాలో 4, గుంటూరు జిల్లాలో 7, తూర్పుగోదావరి జిల్లాలో కేవలం 11 గిరిజన కుటుంబాలు మాత్రమే ఉపాధి పథకంలో 100 రోజుల పని పూర్తి చేసుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 29,984 గిరిజన కుటుంబాలు ఈ లక్ష్యం సాధించగా ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే 20,094 కుటుంబాలు ఉండగా, మిగిలిన 25 జిల్లాలో అంతంత మాత్రంగానే ఉన్నారు. దళిత కుటుంబాల్లోను ఈ సంఖ్య తక్కువగానే ఉంది. విశాఖపట్నం జిల్లాలో 37 కుటుంబాలు, గుంటూరులో 97 కుటుంబాలు ఉన్నాయి.

పని దినాల్లో ఎస్సీలకు 18.7 శాతం, ఎస్టీలకు 17 శాతం తగ్గుదల

రాష్ట్రంలో గత ఏడాదితో పోలిస్తే దళితులు, గిరిజనులకు కల్పించిన పని దినాల్లో కూడా భారీగా తగ్గుదల నమోదైంది. ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకూ పని దినాల్లో దళితులకు 18.7 శాతం, గిరిజనులకు 17 శాతం తగ్గుదల నమోదైందని వెల్లడించింది. ఇతర వర్గాలకు 11.3 శాతం తగ్గుదల నమోదైనట్లు వెల్లడించింది. ఈ పథకంలో కల్పించాల్సిన మొత్తం పని దినాల్లోను 13.6 శాతం తగినట్లు గతంలో విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది.

JEEVANA
జీవన the family
8 విజయవాడ
ఆదివారం 7 డిసెంబర్ 2025

జీవన సౌరభం

చిన్న ప్రోత్సాహం కూడా కొండంత ఉత్సాహాన్ని నింపుతుంది.

నివురు గప్పిన నిప్పులా దహించేస్తున్న నిషా

అందాల సాగరతీరం.. ఆహ్లాద ప్రకృతి వాతావరణం మన విశాఖ సొంతం. అరకు సోయగాలు, గిరిజన సంస్కృతులు, కొండవాలులు వేటికవే ప్రత్యేక ఆకర్షణలు. ఈ వాతావరణంలోనే ఇప్పుడు దట్టమైన పొగమంచులా మత్తు పొగ కమ్మేసింది. దేశంలో ఢిల్లీ, మధ్యప్రదేశ్, గోవా.. ఎక్కడైనా డ్రగ్స్ పెద్ద ఎత్తున పట్టుబడితే దాని మూలాలు విశాఖకి వచ్చి చేరుతున్నాయి. ఒకటి, రెండు కాదు.. దేశం నలుమూలలకి సరఫరా చేసేందుకు లక్షల కిలోల గంజాయి నిల్వలు ఇక్కడి నుండే సరిహద్దు దాటుతున్నాయి. ఇంత పెద్ద ఎత్తున ఇక్కడి నుండే ఎందుకు? గంజాయి సరఫరాలో మన రాష్ట్రమే ప్రథమ స్థానంలో ఉందన్న గణాంకాల వెనుక పెద్దా దందానే నడుస్తోంది. ఈ ముఠా కేవలం సరఫరాలోనే కాదు.. డబ్బు ఆశ చూపించి అమాయక గిరిజనులతో వేల ఎకరాల్లో గంజాయి సాగు కూడా చేయిస్తోంది.

ఉమ్మడి విశాఖలో రూ.10 వేల కోట్ల గంజాయి వ్యాపారం జరుగుతోందని 2022లోనే అంచనా వేశారు. ఇక్కడ పట్టుబడుతున్న నిల్వలు దేశంలో ఎక్కడా లేవన్నది గణాంకాలు చెబుతున్నాయి. 2021లో మాదకద్రవ్యాలపై ఎన్‌సిబి ఇచ్చిన నివేదిక ప్రకారం దేశ వ్యాప్తంగా 7.50 లక్షల కిలోల గంజాయి దొరికింది. ఇందులో 2 లక్షల కిలోలకి పైగా ఏపీలోనే స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత లక్షా 71 వేల కిలోలతో రెండో స్థానంలో ఒరిస్సా ఉంది. పట్టుబడిన మొత్తం నిల్వల్లో 50 శాతం పైగా ఈ రెండు రాష్ట్రాల్లోనే దొరికింది. డ్రగ్స్ వ్యవహారంలో 1775 కేసులు నమోదయ్యాయి. 4 వేల 202 మందిని అరెస్టు చేశారు. మూడేళ్ల క్రితం నాటి ఈ లెక్కలతో పోలిస్తే ప్రస్తుతం ఈ సంఖ్య ఏ స్థాయికి వెళ్లిందో అర్థం చేసుకోవచ్చు.

విశాఖలోనే ఎందుకు?

విశాఖ అడవుల్లో పెరిగే గంజాయికి దేశవిదేశాల్లో మంచి గిరాకీ ఉంది. నాణ్యమైన గంజాయి పంట ఉత్పత్తికి ఈ నగరం ఆవాసంగా ఉంది. గంజాయిలో శీలావతి, రాజహంస, కాళపత్రి రకాల్లో చివరి రెండింటికీ అంత డిమాండ్ లేదు. శీలావతి రకానికి ఉన్న గిరాకీ ఆ పంటని విరివిగా పండించేలా చేస్తోంది. దేశంలో పట్టుబడుతున్న నిల్వల్లో ఈ రకమే ఎక్కువ. గంజాయి స్మగ్లర్లు ఏజెన్సీల్లోని అమాయక గిరిజనులకు డబ్బు ఆశ చూపించి తక్కువ ధర చెల్లించి మరీ సాగు చేయిస్తున్నారు. పంట పండించడం ఒక ఎత్తయితే, దాన్ని సరఫరా చేయడం మరో ఎత్తు. ఈ పనికి కూడా ఏజెన్సీలోని నిరుద్యోగులని వాడుకుంటున్నారు. ఉపాధి లేక, జీవనోపాధి కరువైన అమాయక ప్రజలు వేరే గత్యంతర లేక తక్కువ కూలికే ఈ అక్రమ వ్యాపారంలో భాగమవుతున్నారు.

శీలావతి రూటు.. దందాకి చోటు

సరఫరాలో విద్యార్థులు, టూరిస్టులు, గిరిజనులు ఈ దందాలో పెద్ద సంఖ్యలో పాల్గొనడానికి కారణం డబ్బు. ఏజెన్సీలో పండుతున్న శీలావతి రకం కేజీకి రూ.3 వేల నుండి రూ. 5 వేల వరకు ధర పలుకుతోంది. ఈ రేటు అడవి దాటే వరకే. ఆ తరువాత ఆ రేటుని లెక్కగట్టడం ఎవరి చేతుల్లో ఉండదు. దళారుల చేతులు మారుతూ మార్కెట్లోకి వెళ్లే సరికి వేల రూపాయల ధర కాస్తా లక్షల్లో పలుకుతుంది. గంజాయి రవాణాకి చాలామంది ఆకర్షితమవ్వడానికి ఇదే ప్రధాన కారణం.

తీరం గుండా ప్రయాణించి ...

అక్రమ రవాణాలో పట్టుబడిన నిందితులకి ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం గరిష్టంగా 10 నుండి 30 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. 3 నుండి 4 నెలల పాటు బెయిల్ దొరికే అవకాశం లేదు. స్థానికంగా 2 నుండి 3 కేజీల గంజాయి కొనుగోళ్లు ఉంటే విశాఖ సరిహద్దు నుండి టన్నుల్లో సరఫరా అవుతోంది. తెలంగాణ, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కేరళ, తమిళనాడు, గోవా వంటి రాష్ట్రాలకి విశాఖ అడవుల నుండే శీలావతి సరఫరా అవుతోంది.

విశాఖ, ఒరిస్సా, ఏ.ఓ.బి ప్రాంతాలు శీలావతికి అనువైనవి. అక్టోబరు నుండి జనవరి మధ్య గంజాయి విపరీతంగా సాగు అవుతుంది. 20 వేలకి పైగా ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మూడు నెలల్లో పంట దిగుబడి వస్తుంది. ఎండబెట్టిన తరువాత కేజీ నుండి 5 కేజీల పరిమాణంలో ప్యాకింగ్ చేస్తారు. పోలీసులకి పట్టుబడుతున్న గంజాయి ఎక్కువగా ఈ ప్యాకెట్లలోనే ఉంటుంది. దీంతో కొంతకాలంగా దాని రూపాన్ని మారుస్తున్నారు. హాషిష్ ఆయిల్ పేరుతో సరఫరా చేస్తున్నారు.

రూపం మార్చుకొని ...

30 కేజీల గంజాయితో కేజీ ఆయిల్ తయారవుతుంది. దీని నుండి వచ్చే నిషా చాలా ఎక్కువ. పైగా సరఫరా చేయడం సులభం. ఏజెన్సీ ఏరియాలో హాషిష్ ఆయిల్ విలువ లక్షరూపాయలు పలుకుతోంది. అడవి దాటాక దాని రేటు రూ.5 లక్షల పైమాటే. ఇంత లాభసాటిగా ఉండడంతో లిక్విడ్ గంజాయి తయారీకి ప్రత్యేకంగా యంత్రాలు తెప్పిస్తున్నారు. ఒక్క ఆయిల్ రూపంలోనే కాదు, పారిశ్రామిక వాడలు, పర్యాటక ప్రాంతాలను దాటి నగరాలని విస్తరిస్తున్న ఈ గంజాయి ఇప్పుడు అనేక రూపాల్లో లభ్యమవుతోంది.

ఏజెన్సీలోనే ఎందుకు..

ఈ ప్రాంతంలో గిరిజనులు పండించే వ్యవసాయ ఉత్పత్తులకి ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధరలు ఇవ్వడం లేదు. దీనికి తోడు ప్రకృతి వైపరీత్యాలకి పంటలు దెబ్బతిని ఆదాయాలు పడిపోతున్నాయి. జీవనోపాధి కరువైన ఈ ప్రజలు క్రమంగా గంజాయి సాగు వైపు ఆకర్షితులయ్యారు. 40 ఏళ్ల క్రితం ఇతర రాష్ట్రాలకు చెందిన గంజాయి స్మగ్లర్లు ఏజెన్సీ వాసులకు గంజాయి సాగు నేర్పించారు. అలా ఇక్కడ మొదలైంది. ఇప్పుడు దేశంలోనే మొదటి స్థానంలోకి వచ్చేంతలా విస్తరించింది. దందాల వెనుక ఉన్న బడా బాబులు మాత్రం ఎప్పుడూ తెర వెనుకే ఉంటారు. ఇంత పెద్ద ఎత్తున సాగు చేసేందుకు గిరిజనులకు డబ్బులు ఎవరు ఇస్తున్నారు? దళారులని ముందుండి నడిపించేదెవరు?

గత్యంతరం లేదు..

అల్లూరి సీతారామరాజు జిల్లా దారకుండ పంచాయతి గంగవరం గిరిజన గ్రామంలో 300 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ ప్రాంతంలో 2020 వరకు గంజాయి సాగు చేయడం ప్రధాన ఆదాయ వనరు. పోలీసులు చేపట్టిన 'పరివర్తన' కార్యక్రమంలో భాగంగా మూడేళ్ల వరకు గిరిజనులెవ్వరూ గంజాయి సాగు చేయలేదు. దాని స్థానంలో తృణధాన్యాలు పండించారు. బ్యాంకు వడ్డీలకి తెచ్చి సాగు చేస్తే, గిట్టుబాటు ధరలేక రైతులు అప్పుల్లో కూరుకుపోయారు. తినడానికి తిండే కాదు. పిల్లలు కట్టుకోవడానికి సరైన బట్టలు కూడా ఉండని పరిస్థితి ఎదురైందని గ్రామవాసి ఒకరు ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. గూడెం కొత్తవీధి మండలంలోని దారకొండ, నెలజిరత వంటి గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. మినుములు, రాగులు, కందులు, చినరాజ్మా వంటి పంటలు వేశారు. అకాల వర్షాలు, నాణ్యమైన విత్తనాలు లేక నష్టపోయినట్లు ఇదివరకే ఆ గ్రామస్తులు వాపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో మళ్లీ గంజాయి సాగు వైపు వెళ్తున్నామని గ్రామస్తులు గతంలో చెప్పారు. 'అడవిలో గంజాయి పంట సాగుకు ప్రభుత్వం ఒప్పుకోలేదు. మానేయ్యమంది. రెండేళ్లు అలాగే చేశాం. కానీ మమ్మల్ని ఎవరూ పట్టించుకోలేదు. మాకు వేరే గత్యంతరం లేదు' అని గంగవరానికి చెందిన రాము మూడేళ్ల క్రితం ఒక ఇంటర్వ్యూలో వాపోయాడు. లక్షల కోట్ల రూపాయల ఈ గంజాయి వ్యాపారంలో సాగు చేయడం, రవాణా చేయడం, వినియోగించడంలో నిమగ్నమవుతున్న వారందరూ బాధితులే.. లాభపడేది మాత్రం దళారులు, బడా వ్యాపారులు.

ఈ మత్తును ఆపాలంటే ...

గంజాయి వ్యాపారం ప్రాంతీయ సమస్య కాదు, జాతీయ భద్రతా సమస్యగా పరిగణించాలి. వ్యవస్థని దహించేస్తున్న ఈ నిషాని అంతం చేయాలంటే ప్రభుత్వ చర్యల్లో మరింత కదలిక రావాలి. గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపించాలి. పంటలకు గిట్టుబాటు ధరల హామీ ఇవ్వాలి. డ్రోన్ సర్వేలతో సాగును ముందే గుర్తించాలి. పోలీసుల చర్యలు వేగవంతం చేయాలి. పాఠశాలల్లో తరచూ డ్రగ్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లు నిర్వహించాలి. నివురు గప్పిన నిప్పులా మత్తు సమాజాన్ని బూడిద చేయకుండా కాపాడాలంటే ఈ చర్యలు వేగవంతం చేయాలి.

చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ అంకెలు, సంఖ్యల దగ్గర చుక్కలను ఒకదాని తర్వాత ఒకటి కలపండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.



నేను గీసిన బొమ్మ

కె.ప్రవళిక, 5వ తరగతి, ఎం.పి.యు.పి స్కూలు, టెక్కలి.



అమ్మా! చెప్పవే ...

అది ఒక పెద్ద పాఠశాల. ఒకటవ తరగతి నుంచి పదవతరగతి దాకా దాదాపు వెయ్యి మంది పిల్లలు అక్కడ చదువుకుంటున్నారు. తల్లిదండ్రులు ప్రతిరోజూ పిల్లలను తీసుకువచ్చి బడి దగ్గర దింపుతారు, తిరిగి సాయంత్రం తీసుకువెళ్తారు. పాఠశాల సైన్స్ ల్యాబ్‌లో ఒక చిట్టెలుక దాని పిల్లలు నివాసముంటున్నాయి. చిన్న పిల్ల పేరు మూషికి. దానికి మాత్రం బోలెడన్ని సందేహాలు. పగలంతా పిల్లల అలికిడి ఉండడంతో ఎలుకలన్నీ అక్కడ ఉన్న చెక్క పెట్టెలో నిద్రపోతాయి. కానీ, మూషికి మాత్రం అటూ ఇటూ తిరుగుతూ, పిల్లలు ఏం చేస్తున్నారో చూస్తుంది. 'వాళ్ల కంట పడితే ప్రమాదం' అని తల్లి ఎన్నిసార్లు చెప్పినా మూషికి వినిపించుకోదు. ఒక రోజు సాయంత్రం బడి విడిచే సమయం అయ్యింది. 'అమ్మా! త్వరగా రా!' అంది మూషికి చిన్నగా అరుస్తూ. 'ఏమైంది? నీకెప్పుడూ సందేహాలే!' అంది చిట్టెలుక నవ్వుతూ. 'అటు చూడు!' అంది మూషికి. చిట్టెలుక చూసింది. బడి విడవడంతో పొలోమని పిల్లలందరూ తమ పుస్తకాల సంచులు పట్టుకుని పరుగు పరుగున గేటు బయట ఉన్న తమ తల్లిదండ్రులను కలిసి ఇంటికి వెళ్ళిపోతున్నారు. 'ఇందులో వింతేముంది?' అని అడిగింది చిట్టెలుక. 'అందరూ ఒకేలా ఉన్నారు కదా! మరి వాళ్ల అమ్మానాన్నని ఎలా పోల్చుకుంటున్నారు?' అని కళ్ళు తిప్పుకుంటూ అడిగింది మూషికి అమాయకంగా. 'నువ్వు నన్ను ఎలా పోల్చుకుంటున్నావో వాళ్ళు కూడా వారి అమ్మానాన్నలను అలాగే పోల్చుకుంటారు. మనకు మనుషులందరూ ఒకేలా కనిపిస్తారు. మనుషులందరికీ మనం ఒకేలా కనిపిస్తాము అయినా నువ్వు 'అమ్మా' అంటూ వేరొకరి దగ్గరికి వెళ్ళడం లేదు కదా! అలాగే అన్ని జీవులు కూడా, తమపై చూపిస్తున్న ప్రేమని బట్టి తమ వారిని గుర్తుపడతాయి' అని వివరించింది చిట్టెలుక. 'ఓహ్! హమ్మయ్య! నా సందేహం తీరింది. ప్రేమకు గుర్తుపట్టే శక్తి ఉంది కదా అమ్మా!' అంది మూషికి సంతోషంగా.

– కాశీ విశ్వనాథం పట్రాయుడు, 94945 24445.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం-ప్రజల పక్షం
దినపత్రికలో ఉద్యోగ అవకాశాలు
జర్నలిజం కాలేజీలో శిక్షణ
➤ సబ్ ఎడిటర్లు
➤ రిపోర్టర్లు
➤ వెబ్ జర్నలిస్టులు
తెలుగులో వ్రాయగలిగి ఉండాలి
వర్తమాన, సామాజిక, ఆర్థిక రాజకీయాలపై అవగాహన
జర్నలిజంపై ఆసక్తి కలిగి ఉంటే..
బయోడేటాను మెయిల్ చేయగలరు
కనీస విద్యార్హత : డిగ్రీ చదివినవారు
సంప్రదించాల్సిన అడ్రస్ : ప్రజాశక్తి భవనం,
అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి, గుంటూరు జిల్లా
prajasakti.hr@gmail.com
ఫోన్ : 94940 98968, www.prajasakti.com
చివరి తేదీ 2025 డిసెంబర్ 10

श्रम एवं रोजगार मंत्रालय
भारत सरकार
MINISTRY OF LABOUR & EMPLOYMENT
GOVERNMENT OF INDIA
सत्यमेव जयते

"ప్రధాన మంత్రి విక్షిత్ భారత్ రోజ్‌గార్ యోజన దాదాపు 3.5 కోట్ల మంది యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది".
ప్రధాన మంత్రి, నరేంద్ర మోడీ

ఉద్యోగం లేదా వ్యాపారం
భారత ప్రభుత్వం మీతో ఉంది
ప్రధానమంత్రి విక్షిత్ భారత్ రోజ్‌గార్ యోజన
పైగా ఉద్యోగ అవకాశాల సృష్టికే
3.5 కోట్లకు
మద్దతు ఇవ్వడానికి
తొలిసారి ఉద్యోగులకు ప్రయోజనాలు
» రెండు విడతలుగా రూ.15,00 వరకు ప్రోత్సాహకం.
ఉద్యోగాలు సృష్టించే యజమానులకు ప్రయోజనాలు
» ప్రతి అదనపు నియామకానికి నెలకు రూ.3000 వరకు ప్రోత్సాహకం
మరింత సమాచారం కొరకు
దర్శించండి- www.pmvbry.epfindia.gov.in లేదా
సంప్రదించండి- 14480/1800-180-1850 (టోల్-ఫ్రీ) లేదా
స్కాన్ చేయండి-

CBC 23101/13/0001/2526

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68